www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

అమెరికా నుంచి మరో 487 మంది!

భారతీయ అక్రమ వలసదారుల తరలింపుపై సమాచారం: విదేశాంగ కార్యదర్శి మిస్రీ

అమెరికా అధికారులతో సంప్రదింపులు.. దురుసుగా ప్రవర్తించవద్దని విజ్ఞప్తి చేసినట్టు వెల్లడి

ఐసీసీపై అమెరికా ఆంక్షలు

నెతన్యాహు మీద వారెంట్ జారీతో ట్రంప్ ఆగ్రహం

ఆంక్షలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ

అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించిన ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు

2



శనివారం | 8-2-2025 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 22 సంచిక (Issue): 311

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 8.16 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మృగశిర సా. 6.07 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.2.26-4.01; దుర్ముహూర్తం: ఉ.6.48-8.19; అమృతఘడియలు: ఉ.9.31-11.04; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.10

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



19 మంది హైకోర్టు జడ్జిల
ఫోన్ల ట్యాపింగ్

ఒక సుప్రీంకోర్టు జడ్జి ఫోన్‌నూ ట్యాప్ చేశారు.. హైకోర్టుకు తెలిపిన పీపీ

ప్రైవేటు న్యూస్ చానల్ ఎండీ శ్రవణ్‌కుమార్‌రావు బెయిల్‌పై ధర్మాసనం విచారణ

కేసులో ఉన్న తీవ్రత దృష్ట్యా అతనికి బెయిల్ ఇవ్వొద్దని కోరిన ప్రభుత్వ న్యాయవాది

తాను జర్నలిస్టునని, పోలీసులు పెట్టిన సెక్షన్లు తనకు వర్తించవన్న శ్రవణ్‌కుమార్

బెయిల్‌పై తీర్పు రిజర్వు.. రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టుకు తెలిపారు. తెలంగాణ హైకోర్టుకు చెందిన 19 మంది జడ్జిలు, ఒక సుప్రీంకోర్టు జడ్జి ఫోన్లను ట్యాప్ చేశారని చెప్పారు. ఈ కేసులో ఏ-6గా ఉన్న ప్రైవేట్ న్యూస్ చానల్ ఎండీ శ్రవణ్‌కుమార్‌రావుకు ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వొద్దని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకెలాంటి సంబంధం లేదని, తానొక జర్నలిస్టునని, పోలీసులు పెట్టిన సెక్షన్లు తనకు వర్తించవని పేర్కొంటూ శ్రవణ్‌కుమార్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. శ్రవణ్‌రావును తప్పించుకు తిరుగుతున్న నేరగాడిగా ప్రకటించాల్సిందిగా దిగువ కోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఎఫ్‌ఎస్ఎల్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయని, తెలంగాణ హైకోర్టుకు చెందిన 19 మంది జడ్జిలు, ఒక సుప్రీంకోర్టు జడ్జి ఫోన్లను నిందితులు ట్యాప్ చేశారని వెల్లడించారు. ఇది అత్యంత తీవ్రమైన నేరమని, ఇదే విషయాన్ని హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో సమర్పించామని చెప్పారు. కేసులో ఉన్న తీవ్రత దృష్ట్యా ఏ-6కు బెయిల్ ఇవ్వరాదని కోరారు. కాగా, నిందితుడు శ్రవణ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తన క్లయింటు విదేశాల్లో ఉన్నప్పటికీ.. తన చిరునామా, ఫోన్ నంబర్లు



మిగతా 12వ పేజీలో...

నాకు, రాహుల్‌కు మధ్య అగాధం
వట్టిమాట

ఆయనతో నా సాన్నిహిత్యాన్ని బయటకు చెప్పుకోవాల్సిన పని లేదు

అనిరుద్ రెడ్డి పిలిస్తే పది మంది ఎమ్మెల్యేలు వెళతారా!?

వాళ్లు విందు చేసుకుంటే తిరుగుబాటని వక్రీకరించారు

కేటీఆర్‌ను అర్జెంటుగా అరెస్టు చేసి జైల్లో వేయాలని లేదు

ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఏం చెబుతుందో చూద్దాం

మేం చేసిన సర్వేలో బీసీలు పెరిగారు.. ఓసీలు తగ్గారు

కేసీఆర్ సర్వే తప్పుల తడక.. ముస్లింల లెక్క తేల్చలేదు

మా సర్వేతో కోటా కోసం కోర్టుకెళ్లేందుకు వారికి చాన్స్

ఓబీసీలకు అన్యాయం చేసింది కిషన్ రెడ్డి, బీజేపీయే

కులగణన, పీసీసీ కార్యవర్గంపైనే అధిష్ఠానంతో చర్చ

మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం అభిప్రాయం ప్రకారమే..

ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తనకూ, రాహుల్ గాంధీకి మధ్య ఎంతో అగాథం ఉందని, తనకు ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. మధ్యప్రదేశ్ సభలో తాను మాట్లాడిన తర్వాత రాహుల్ గాంధీ మాట్లాడారని, తెలంగాణ ముఖ్యమంత్రి బాగా చేస్తున్నాడని చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణలో కులగణన గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించారని, బిహార్‌లో కూడా తన గురించి మాట్లాడారని వివరించారు. కులగణనపై రాహుల్‌తో ఎప్పటికప్పుడు చర్చించానని, కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం లేకుండా కులగణనను జరిపించి అసెంబ్లీలో ప్రవేశపెడతామా? అని ప్రశ్నించారు. రాహుల్‌తో తనకున్న సన్నిహిత సంబంధాల గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేదని, గతంలో చంద్రబాబునాయుడుతో పని చేసినప్పుడు కూడా ఆయన తనపై ఆగ్రహంతో ఉన్నారని ప్రచారం చేశారని తప్పుబట్టారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎమ్మెల్యేలు తనపై తిరుగుబాటు చేస్తున్నారన్న కథనాలనూ కొట్టిపారేశారు. వారు సరదాగా కూర్చుని విందు చేసుకుంటే చిలువలు పలవలు అల్లి ప్రచారం చేశారని నవ్వుతూ బదులిచ్చారు. 'అనిరుధ్ రెడ్డి పిలిస్తే పది మంది ఎమ్మెల్యేలు వెళతారా?' అని ప్రశ్నించారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి మహబూబ్‌నగర్‌కు నీటి కోసం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడేందుకు జూపల్లి కృష్ణారావును లెటర్ ఇచ్చి తానే బెంగళూరు పంపానని చెప్పారు. తన ఢిల్లీ పర్యటనలో ఈసారి కులగణనపై, పీసీసీ కార్యవర్గంపై మాత్రమే

మిగతా 13వ పేజీలో...

పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు!

ఖర్గేతో రేవంత్, ఉత్తమ్, భట్టి చర్చలు

వేణుగోపాల్‌తో వేర్వేరుగా భేటీ

వారంలోపు పీసీసీ కార్యవర్గం ప్రకటన

రాష్ట్రంలో కుల గణనపై ఖర్గే హర్షం

13



వారు దావోస్‌కు వెళ్లింది..
ప్రచారం కోసమే!

బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడులు తక్కువ, పబ్లిసిటీ ఎక్కువ

రెండు సమావేశాల్లోనే మా సత్తా నిరూపించుకున్నాం

ఎంఎస్‌ఎంఈలకు అండగా ఉంటాం

పరిశ్రమ పెట్టకుంటే భూమి వెనక్కే

రాష్ట్రంలో హెచ్‌సీ రోబోటిక్స్ మరో రూ.500 కోట్ల పెట్టుబడి: శ్రీధర్ బాబు



దక్షిణ కోస్తా రైల్వే జోన్..
ఇక అధికారికం

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం

కుదించిన వాల్తేరు డివిజన్ ఇకపై విశాఖ డివిజన్‌గా మార్పు

410 కిలోమీటర్ల విశాఖపట్నం డివిజన్ దక్షిణ కోస్తా జోన్‌లోకి

680 కిలోమీటర్లతో రాయగడ డివిజన్.. తూర్పుకోస్తా రైల్వేలోకి

ఐటీ బిల్లుకు ఓకే.. 8800 కోట్లతో 2026 దాకా స్కిల్ ఇండియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్.. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు శుక్రవారం లాంఛనంగా ఆమోదం తెలిపింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించిందని, దీనివల్ల పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయని వెల్లడించారు. కొత్త జోన్ వల్ల రైల్వే ఆపరేషన్లలో సమర్థత పెరుగుతుందని చెప్పారు. కుదించిన వాల్తేరు డివిజన్‌ను ఇకపై విశాఖ డివిజన్‌గా పరిగణిస్తారని.. వాల్తేరు డివిజన్‌లోని

మిగతా 2వ పేజీలో...

నేడే ఢిల్లీ ఫలితాలు

50 దాకా స్థానాల్లో గెలుస్తాం: బీజేపీ

ఎగ్జిట్‌పోల్ అంచనాలు తప్పుతాయి.. మళ్లీ మేమే: ఆప్

పోలైన ఓట్ల జాబితా అప్‌లోడ్ చేయాలని ఈసీకి తిరస్కరణ: కేజ్రీవాల్

'ఆపరేషన్ లోటస్' ఆరోపణలపై ఆధారాలు చూపండి

కేజ్రీవాల్‌కు ఏసీబీ నోటీసులు

2

రోడ్ల మరమ్మతులకు
మోక్షం



అత్యవసర, సాధారణ రిపేర్లకు చర్యలు

82 నియోజకవర్గాల్లో 3,373 కి.మీ. గుర్తింపు

అంచనా రూ.1,051కోట్లు.. 11న టెండర్లు?

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ పరిధిలోని రహదారుల పరిస్థితిపై ఆ శాఖ దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ పరిధిలోని రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చడంతో పాటు అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా గుర్తించిన అత్యవసర మరమ్మతులు, సాధారణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏయే నియోజకవర్గాల్లో, ఎన్ని కి.మీ. మేర రహదారులపై గుంతలు ఉన్నాయి..? వాటిలో అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతులు ఎన్ని..? అనే దానిపై అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఇందుకు సంబంధించి ప్రాథమికంగా ఒక నివేదికను సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 82 నియోజకవర్గాల్లో అత్యవసర మరమ్మతులతో పాటు, సాధారణ పనులను చేపట్టాల్సి ఉందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో 1,690 కి.మీ మేర అత్యవసర మరమ్మతులు చేయాలని, అందుకు రూ.203.10 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇవే నియోజకవర్గాల్లో 1,683కి.మీ మేర సాధారణ రిపేర్లు చేయాల్సి ఉందని, అందుకు రూ.847.98 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని లెక్కగట్టారు. ఈ రెండు పనులు కలిపి మొత్తం 3,373.30 కి.మీ మేర ఉండగా.. రిపేర్లకు రూ.1,051.08కోట్ల వరకు నిధులు కావాల్సి ఉందని తేల్చారు.

ఫిబ్రవరి 11న టెండర్లు..

రాష్ట్రంలోని 82 నియోజకవర్గాల పరిధిలోని రోడ్లపై అత్యవసర, సాధారణ మరమ్మతులకు సంబంధించిన పనులకు టెండర్ల ద్వారా గుత్తేదారులను ఖరారు చేయాలని నిర్ణయించారు. ఈ రెండు రకాల మరమ్మతులకు విడివిడిగా టెండర్లను పిలవాలా..? లేక రెండింటికీ కలిపి టెండర్లను ఆహ్వానించాలా..? అనే దానిపై సందిగ్ధం ఏర్పడినట్టు తెలుస్తోంది. అయితే

మిగతా 14వ పేజీలో...



ఆర్‌బీఐ 'కరుణ' కటాక్షం

11

రెపో రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింపు

ఐదేళ్ల తర్వాత ఇదే తొలిసారి

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ వడ్డీ రేట్లు

ద్రవ్యోల్బణం 4.2 శాతానికి!

ద్రవ్య పరపతి సమీక్ష వివరాలను వెల్లడించిన ఆర్బీఐ

సీఎం ఇలాకాలో
బడిపిల్లల పస్తులు!



ఢిల్లీ బాసులు, గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు

పేద విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై దృష్టి పెట్టాలి

మళ్లీ కన్నీరు పెడుతున్న తెలంగాణ పల్లె: కేటీఆర్


అమెరికాలో కేఐబీసీ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం

కలుషితాహారం పెడితే అరెస్టు చేస్తామన్న ముఖ్యమంత్రి మాట ఏమైంది?: హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ కొనసాగిస్తున్నది ప్రజా పాలన కాదని, ప్రజలను వేధించే పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలోనే బడిపిల్లలు అన్నం దొరక్క పస్తులుండాల్సి వస్తోందన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే పరిస్థితి లేకుండా పోయిందంటూ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. "పేదల గూళ్లపైకి బుల్డోజర్లు పంపడంపై ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడంలో లేదా? అదానీకి రాష్ట్రంలోని

మిగతా 3వ పేజీలో...

మహిళా పోలీసులు
తక్కువే!



తెలంగాణలో 76,292 మంది పోలీసులు

అందులో అతివలు 4,782 మంది మాత్రమే

రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలు

ఠాణాల్లో మగ పోలీసులతో వివరాలన్నీ చెప్పుకోలేని దుస్థితిలో బాధితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సందర్భం వచ్చిన ప్రతిసారీ ప్రభుత్వం ప్రకటిస్తోంది. సమస్యల్లో ఉన్న వారికి అండగా నిలబడేందుకు మహిళా భద్రత విభాగం, భరోసా కేంద్రాల వంటివి ఉన్నాయని చెబుతోంది. అయితే, ఆయా విభాగాలు పనిచేస్తున్నా.. అవి ఆశించిన స్థాయిలో సమర్థంగా సేవలందించలేని పరిస్థితి. తమకు జరిగిన అన్యాయంపై బాధితులు మొదట పోలీస్ స్టేషన్‌కు వెళ్తుంటారు. అయితే అక్కడికి వెళ్లిన మహిళలు తమ బాధను సవివరంగా పోలీస్‌లు వద్ద చెప్పుకునే పరిస్థితి లేదు. ఇందుకు ప్రధాన కారణం పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది తక్కువగా ఉండటమే. ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది అందుబాటులో ఉంటున్నా.. వారి సంఖ్య అంతంతమాత్రంగానే ఉంది. సిబ్బంది కొరత, ఇతర కారణాల వల్ల చాలా చోట్ల రాత్రిళ్లు మహిళా పోలీస్‌లు

మిగతా 3వ పేజీలో...



ఢిల్లీలో విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ముస్లిం బీసీ, హిందూ బీసీ ఏంటి?

ఇలా అని ఏ చట్టంలో ఉంది?

తూతూ మంత్రంగా కులగణన చేశారు

రాష్ట్రంలోని 50 శాతం ఇళ్లలో సర్వే చేయనేలేదు

వికసిత్ భారత్ లక్ష్యాల్లో బొగ్గు రంగం కీలకం

బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీరు విచారకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని దాదాపు 50 శాతం ఇళ్లలో కులగణన చేయలేదని, తూతూ మంత్రంగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. ముస్లిం బీసీ, హిందూ బీసీ అని ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. శుక్రవారం నేషనల్ మీడియా సెంటర్‌లో కిషన్‌రెడ్డి

మిగతా 12వ పేజీలో...



మీ సేవలో రేషన్ కార్డులకు దరఖాస్తులు

నేటి నుంచి స్వీకరణ

13

అదానీ రూ. 10 వేల కోట్ల
విరాళం

విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాల కోసం..

చిన్న కుమారుడి పెళ్లిలో ప్రకటించిన వ్యాపారవేత్త

నిరాడంబరంగా జరిగిన వివాహం

2

సైనిక డ్రోన్ల తయారీలో చైనా ఎలక్ట్రానిక్ విడిభాగాలు!

సైన్యం దర్యాప్తులో వెల్లడి.. దేశీయ పరిశ్రమలకు ఇచ్చిన రూ.230 కోట్ల కాంట్రాక్టు రద్దు

- దేశ రక్షణకు విఘాతం దృష్ట్యా కఠిన చర్యలు
- ఎల్‌ఏసీ వెంట 400 డ్రోన్లతో నిఘాకు గతంలో నిర్ణయం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: చైనాకు చెందిన ఎలక్ట్రానిక్ విడిభాగాలను వాడుతున్నట్లు తేలటంతో.. దేశీయ పరిశ్రమలకు ఇచ్చిన రూ.230 కోట్ల విలువైన డ్రోన్ల కాంట్రాక్టును సైన్యం రద్దు చేసింది. తూర్పు లడక్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి 400 డ్రోన్లను మోహరించాలని నిర్ణయించిన సైన్యం.. ఆ కాంట్రాక్టును ఇటీవల దేశీయ పరిశ్రమలకు ఇచ్చింది. వీటిలో 100 తేలికపాటి డ్రోన్లు కాగా, 200 మధ్యస్థాయివి, 100 భారీ (హెవీవెయిట్) డ్రోన్లు. ఈ డ్రోన్ల తయారీలో చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఎలక్ట్రానిక్ విడిభాగాలను వాడుతున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఇది దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కావటంతో, కాంట్రాక్టును సైన్యం గతేడాది ఆగస్టులోనే తాత్కాలికంగా నిలిపివేసి ఈ అంశంపై దర్యాప్తు జరిపింది. ఆరోపణలు నిజమేనని తేలటంతో దేశీయ కంపెనీలకు ఇచ్చిన కాంట్రాక్టును మొత్తంగా రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. రక్షణరంగ ఉత్పత్తుల్లో చైనా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్లను ఉపయోగించవద్దంటూ 'మిలిటరీ నిఘా విభాగం డైరెక్టరేట్ జనరల్' 2010, 2015ల్లోనే హెచ్చరికలు జారీ చేసింది. అయినప్పటికీ, ఉల్లంఘనలు జరుగుతున్నాయి. గతేడాది ఆగస్టులో కశ్మీర్‌లోని రాజౌరీలో మోహరించిన ఓ డ్రోన్‌పై సైన్యం నియంత్రణ కోల్పోయింది. ఆ డ్రోన్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన నేపథ్యంలో, మిలిటరీ డ్రోన్లలో చైనా విడిభాగాల వాడకంపై సైన్యం నిషేధాన్ని అమలు చేసింది.

అమెరికా నుంచి మరో 487 మంది!

- తరలింపుపై వారికి తుది ఉత్తర్వులు జారీ..కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అమెరికా నుంచి మరో 487 మందిని వెనక్కి పంపించనున్నారని, తరలింపుపై వారికి తుది ఉత్తర్వులు జారీ చేశారని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ మేరకు అమెరికా అధికారులు సమాచారం ఇచ్చినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారం తెలిపారు. వారిలో 298 మంది వివరాలను తమకు అందజేసినట్లు చెప్పారు. అమెరికా న్యాయ శాఖ నిబంధనల మేరకు అక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అక్రమ వలసదారుల సంఖ్యపై తమకు సమాచారం అందించారని తెలిపారు. తొలివిడతలో 104 మంది భారతీయ అక్రమ వలసదారుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో తరలించడంపై రాజకీయ దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విదేశాంగ శాఖ కార్యదర్శి ఈ ప్రకటన చేయడం గమనార్హం. అమెరికా ప్రస్తుతం చేపట్టిన వలసదారుల తరలింపు ప్రక్రియ గతంలో కంటే భిన్నమైనదని మిస్రీ పేర్కొన్నారు. ఈ తరలింపును అమెరికా తన 'జాతీయ భద్రతా ఆపరేషన్'గా అభివర్ణించిందని తెలిపారు. అయితే భారతీయుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని అమెరికాకు స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ విషయంలో అమెరికా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. మరింత మంది అక్రమ వలసదారులతో కూడిన విమానం త్వరలోనే భారత్‌కు రానుందని తెలిపారు.

లోకం తీరు



మే 4న నీట్-యూజీ పరీక్ష

- మార్చి 7 వరకు దరఖాస్తుకు గడువు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దేశంలోని వైద్య విద్య కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్షను మే 4వ తేదీన నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. ఈ పరీక్ష కోసం శుక్రవారం నుంచి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. మార్చి 7వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఎంబీబీఎస్ కోర్సుల్లో మొత్తంగా 1.08 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో దాదాపు 56 వేలు ప్రభుత్వ ఆస్పత్రులు, దాదాపు 52వేలు ప్రైవేటు కాలేజీల్లో ఉన్నాయి. డెంటిస్ట్రీ, ఆయుర్వేద, యునానీ, సిద్ధాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నీట్ ఫలితాలు ఉపయోగపడతాయి. పెన్ను, పేపర్ విధానంలో పరీక్షను నిర్వహించనున్నట్లు గత నెలలో ఎన్టీఏ పేర్కొంది.

మార్చి 24 నుంచి సమ్మెకు బ్యాంకు యూనియన్ల పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 : మార్చి 24 నుంచి రెండు రోజులపాటు దేశ వ్యాప్త సమ్మెకు బ్యాంకు యూనియన్లు పిలుపు ఇచ్చాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, అన్ని కేడర్లలో తగినంత మంది ఉద్యోగుల నియామకం తదితర డిమాండ్ల సాధనకు ఈ నిర్ణయం తీసుకున్నాయి. 9 బ్యాంకు యూనియన్ల ఫోరమ్.. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. బ్యాంకు ఉద్యోగుల పనితీరు మదింపు, అలాగే పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆర్థిక సేవల శాఖ ఇటీవల ఇచ్చిన ఆదేశాలను తక్షణం ఉపసంహరించుకోవాలని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేసింది. ఈ ఆదేశాలు ఉద్యోగ భద్రతకు చేటు అని, ఉద్యోగుల మధ్య విభేదాలకు దారితీస్తాయని పేర్కొంది.

అసెంబ్లీ రూపొందించే అన్ని బిల్లుల్ని ఆమోదించాల్సిన అవసరం లేదు

- సుప్రీంకోర్టులో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి



చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ రూపొందించే అన్ని బిల్లుల్ని ఆమోదించాల్సిన అవసరం లేదని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి సుప్రీంకోర్టుకు వివరించారు. తమిళనాడు అసెంబ్లీ రూపొందించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలుపకుండా బుట్టదాఖలు చేస్తున్నారని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా.. గవర్నర్ తరఫు న్యాయవాది ఈ మేరకు వాదించారు. గవర్నర్‌కు 4ముఖ్యమైన అధికారాలున్నాయని..., బిల్లులకు ఆమోదం, నిలిపివేయడం, తిరిగి పంపించడం, అసంతృప్తి తెలియజేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బిల్లుల్లో ఇరుపక్షాలకు అనుకూలమైన ప్రతిపాదనలు చేర్చడంపై గవర్నర్ పరిశీలన జరుపుతున్నారని, బిల్లులు ఆమోదం పొందకపోతే, ప్రభుత్వం- గవర్నర్ కలసి నిర్ణయం తీసుకొనేందుకు అనువుగా రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చని వివరించారు. అంతేగాక ఆ బిల్లులపై నిర్ణయం కోసం రాష్ట్రపతికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వమే గవర్నర్‌ను కోరవచ్చని, ఈ వ్యవహారాన్ని రాష్ట్ర హక్కులను హరించినట్లు భావించకూడదన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎలాంటి వివరణ ఇవ్వకుండా బిల్లును తిప్పి పంపితే, ఆయన మనసులో ఏముందో ప్రభుత్వానికి ఎలా తెలుస్తుందని నిలదీసింది. సంబంధిత బిల్లును ఆమోదించడం కుదరదని గవర్నర్ ఎలా చెబుతారని ప్రశ్నించింది. 2023లో బిల్లులు రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పటి నుంచి ఇప్పటివరకు గవర్నర్ ఏమేం చర్యలు తీసుకున్నారో చెప్పాలని, మూడేళ్లుగా బిల్లుల్ని ఎలా పెండింగ్‌లో ఉంచుతారని ప్రశ్నించింది. గవర్నర్ ప్రభుత్వ పాలనకు అడ్డంకి కారాదని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణ ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

కశ్మీర్‌లో ఏడుగురు చొరబాటుదారుల హతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: నియంత్రణ రేఖను దాటివచ్చి భారత సైన్యానికి చెందిన ఫార్వర్డ్ పోస్టుపై దాడికి యత్నించిన ఏడుగురు చొరబాటుదారులను భద్రతా బలగాలు హతమార్చాయి. చనిపోయిన వారిలో ఇద్దరు ముగ్గురు పాక్ ఆర్మీకి చెందినవారిగా భావిస్తున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. మిగిలినవారు అల్-బదర్ గ్రూప్ ఉగ్రవాదులు కావొచ్చని పేర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడటానికి యత్నించారు. మెరుపువేగంతో స్పందించిన భారత సైన్యం వారిపై కాల్పులు జరిపి మట్టుబెట్టింది. ఈ చొరబాటు, దాడి యత్నం వెనుక పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్(బీఏటీ) ఉందని భావిస్తున్నారు.

ఆయనకు రూ.500 కోట్లు ఇవ్వండి!

- రతన్ టాటా వీలునామాలో ఓ వ్యాపారవేత్త పేరు


మోహన్ దత్తా, రతన్ టాటా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దివంగత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా తన వీలునామాలో ఓ వ్యక్తికి రూ.500 కోట్లు ఇవ్వాలని పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల తెరిచిన వీలునామాను చూసి ఆయన కుటుంబం, టాటా ఆంతరంగికులు ఆశ్చర్యపోయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. వీలునామాలో పేర్కొన్న ఆ వ్యక్తి జంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్ రంగ వ్యాపారవేత్త మోహిని మోహన్ దత్తా. ట్రావెల్ ఏజెన్సీ స్టాలియన్‌లో దత్తా, ఆయన కుటుంబానికి 80 శాతం వాటా, మిగతాది టాటా ఇండస్ట్రీస్‌కు ఉండేది. 2013లో టాటా గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో భాగంగా ఉన్న తాజ్ సర్వీసెస్‌లో స్టాలియన్ విలీనమైంది. రతన్ టాటాకు దత్తా నమ్మకంగా, టాటా కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉండేవారు. అయితే రతన్ టాటా తన వీలునామాలో దత్తా పేరును చేర్చినప్పటికీ హైకోర్టు ధ్రువీకరణ తర్వాతే సంపద పంపిణీ జరుగుతుందని తెలుస్తోంది.

బంగ్లాదేశ్‌లో హింస.. హసీనా ప్రసంగమే కారణం

ఢాకా, ఫిబ్రవరి 7: బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ప్రధాని హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీకి చెందిన పలువురు నేతల ఇళ్లకు నిరసనకారులు నిప్పంటించారు. మ్యూజియంగా మార్చిన బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ స్మారక నివాసంపై వేలాది మంది దాడి చేసి నిప్పంటించారు. షేక్ హసీనా బుధవారం రాత్రి ఆన్‌లైన్‌లో చేసిన ప్రసంగం కారణంగా తాజా హింసాత్మక ఘటనలు చెలరేగాయి. యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని ఆమె అవామీ లీగ్ నేతలకు పిలుపునిచ్చారు. దీంతో హసీనా వ్యతిరేకులు రెచ్చిపోయారు.

నిరాడంబరంగా అదానీ చిన్న కొడుకు పెళ్లి

- సేవా కార్యక్రమాలకు రూ.10వేల కోట్లు విరాళం

అహ్మదాబాద్, ఫిబ్రవరి7: ప్రముఖ వ్యాపారవేత్త గౌతం అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ వివాహం నిరాడంబరంగా జరిగింది. సూరత్‌కు చెందిన ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె దివా షాను జీత్ వివాహమాడారు. అతి కొద్దిమంది బంధువులు, స్నేహితుల సమక్షంలో జైన, గుజరాతీ సంప్రదాయ పద్ధతుల్లో జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను గౌతం అదానీ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. పెళ్లికి శ్రేయోభిలాషులను పిలవలేకపోయినందుకు క్షమించాలన్నారు. కుమారుడి వివాహం సందర్భంగా గౌతం అదానీ పేదలకు ఉపయోగపడేలా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణం కోసం రూ. పది వేల కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ స్థాయికి తగ్గట్లుగా విద్యాబోధన అందిస్తారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆసుపత్రులను నిర్మిస్తారు.


నూతన వధూవరులు దివా షా-జీత్ అదానీలతో గౌతమ్ అదానీ, ఆయన సతీమణి ప్రీతి

42 కోట్ల మంది



ఇప్పటి వరకు కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు

- 10న త్రివేణి సంగమానికి రాష్ట్రపతి
- మహా కుంభ్‌నగర్‌లో మరో అగ్నిప్రమాదం
- ఇస్కాన్‌తో సహా 12 క్యాంపులు దగ్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. దేశ విదేశాల్లోని భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలి వస్తున్నారు. శుక్రవారం నాటికి త్రివేణి సంగమంలో 42 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సంఖ్య అమెరికా, కెనడా దేశాల్లోని ప్రజల కంటే ఎక్కువ కావడం విశేషం. గతనెల 13న ప్రారంభమై ఈనెల 26తో ముగిసే ఈ మహా ఉత్సవంలో పుణ్యం స్నానం చేసే వారి సంఖ్య 50 కోట్లు దాటుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మకర సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమి వంటి మూడు అమృత స్నానాలు పూర్తయినా భక్తుల తాకిడి తగ్గలేదు. మౌని అమావాస్య రోజున 8 కోట్ల మందికిపైగా, మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30, ఫిబ్రవరి 1న 2 కోట్ల మందికి పైగా, పౌష్య పౌర్ణమికి 1.7 కోట్ల మంది, వసంత పంచమి నాడు 2.5 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించారు. ఇప్పటి వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర ప్రముఖులు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈనెల 10న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఇక్కడికి రానున్నారు. బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ శుక్రవారం సంగమంలో పవిత్ర స్నానాలు చేశారు.



నటనకు ఇషికా గుడ్‌బై

సనాతన ధర్మం పాటించడం కోసం ఇకపై నటనకు గుడ్‌బై చెబుతున్నట్లు బాలీవుడ్ బ్యూటీ ఇషికా తనేజా తెలిపారు. సనాతన ధర్మం పాటించే క్రమంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. గతనెల 29న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో గురు దీక్ష తర్వాత ఆమె మహా కుంభమేళాలో పుణ్య స్నానం ఆచరించారు. ఆధ్యాత్మిక సేవకు తాను అనుసంధానం అయ్యానని, మహా కుంభమేళాలో దివ్యమైన శక్తి ఉందన్నారు. 2017లో వచ్చిన ఇందు సర్కార్ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఉమన్ అచీవర్‌గా 2016లో రాష్ట్రపతి అవార్డు అందుకున్నారు. 2018లో మిస్ వరల్డ్ టూరిజం టైటిల్ గెలుచుకున్నారు. విక్రమ్ భట్ వెబ్ సిరీస్ హడ్‌లో కీలక పాత్ర పోషించారు. 60 నిమిషాల్లో 60 మంది మోడళ్లకు 60 ఎయిర్‌బ్రష్ మేకప్‌తో గిన్నీస్ బుక్ రికార్డు సాధించారు. నటనకు గుడ్‌బై చెప్పినా.. భవిష్యత్‌లో నిర్మాతగా మారతానని ఇషికా తెలిపారు.

ఇస్కాన్ క్యాంప్‌లో అగ్ని ప్రమాదం

మహా కుంభ్‌నగర్‌లోని ఇస్కాన్ క్యాంప్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం కలకలం రేపింది. సెక్టార్ 18లోని ఇస్కాన్ క్యాంప్‌లో మొదలైన అగ్నికీలలు పరిసరాల్లోని మరో 12 క్యాంపులకు కూడా వ్యాపించాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కానీ ఆ క్యాంపులకు పెద్దఎత్తున నష్టం కలిగింది. మంటలు మొదలైన వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి వాటిని ఆపేశారని చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ తెలిపారు. మహా కుంభమేళాలో ఇది మూడో అగ్ని ప్రమాదం. గత నెల 19, 25 తేదీల్లో అగ్నిప్రమాదాలు జరిగాయి. అయితే ఆ ప్రమాదాల్లో ఎవరూ గాయపడలేదు.

నేడే ఢిల్లీ ఫలితాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడికానున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని నిలబెట్టుకోవడం ద్వారా నాలుగోసారి అధికారంలోకి రానుందా? కమలనాథులు 27 ఏళ్ల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారా? అనేది ఆసక్తికరంగా మారింది. కౌంటింగ్ కోసం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈనెల 5వ తేదీన పోలింగ్ జరగ్గా 60.54% ఓటింగ్ నమోదైంది. తమ పార్టీ దగ్గర దగ్గరగా 50 సీట్లు కైవసం చేసుకోవడం ద్వారా అధికారంలోకి వస్తుందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర దీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయని, కేజ్రీవాల్ ఆధ్వర్యంలో మరోసారి తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆప్ చెబుతోంది. మరోవైపు.. ప్రతి అసెంబ్లీ స్థానంలో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్ల జాబితాతో కూడిన ఫామ్ 17సీ డాటాను అధికారిక వెబ్‌సైట్లో పెట్టాలని తాము పదే పదే ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినా తిరస్కరించిందని ఆప్ అధినేత కేజ్రీవాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే పారదర్శకత కోసం ప్రతి బూత్‌లో పోలైన ఓట్ల వారీగా వివరాలను వెల్లడించేందుకు తమ పార్టీ తరఫున ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేశామని ఎక్స్‌లో వెల్లడించారు. ఇక.. బీజేపీ నేతలు తమ పార్టీకి చెందిన 16మంది ఎమ్మెల్యేలను కమలదళంలోకి చేరాలని, ప్రలోభపెట్టారని ఇందుకు రూ.15 కోట్లు ఇవ్వజూపారని కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై బీజేపీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు ఏసీబీ అధికారులు శుక్రవారం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీచేశారు.

ఐదు నెలల్లో

39 లక్షల కొత్త ఓటర్లా?

మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఓటర్ల జాబితాలను బయటపెట్టాలి: రాహుల్



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 7: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఆ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత ఐదు నెలల స్వల్పకాలంలోనే ఏకంగా 39 లక్షల మంది కొత్త ఓటర్లు చేరారని.. ఇదెక్కడి వైపరీత్యమని ప్రశ్నించారు. భారీ సంఖ్యలో నకిలీ ఓటర్లను సృష్టించారని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితా, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గత ఏడాది మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకుగాను కాంగ్రెస్-ఉద్ధవ్ శివసేన-పవార్ ఎన్సీపీలతో కూడిన మహా వికాస్ అఘాడీ 30 స్థానాలు గెలుచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకుగాను ఈ మూడు పార్టీలూ 46 సీట్లు మాత్రమే పొంది ఘోరంగా ఓడిపోయాయి. నాడు 17 లోక్‌సభ సీట్లే సాధించిన బీజేపీ-శిందే శివసేన-అజిత్ ఎన్సీపీలతో కూడిన మహాయుతి.. ఐదు నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 235 సీట్లు గెలుపొందడం గమనార్హం. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన మహారాష్ట్ర ఎన్నికలపై స్పందించారు. '2019 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల నడుమ ఐదేళ్లలో 32 లక్షల మంది ఓటర్లు అదనంగా ఓటర్లు చేరితే.. ఇప్పుడు ఐదు నెలల్లోనే ఏకంగా 39 లక్షల మంది వచ్చిచేరారు. వీరంతా ఎవరనేది ప్రశ్న. రెండోది.. మహారాష్ట్రలో ఓటింగ్‌కు అర్హత ఉన్న జనాభా కంటే ఎక్కువగా ఓటర్లు ఎలా ఉన్నారు' అని ప్రశ్నించారు. రాహుల్ ఆరోపణలను మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ఖండించారు. రాహుల్ అబద్ధాల్లో బతుకున్నారని ధ్వజమెత్తారు. ఆయన ప్రశ్నలకు ఈసీ గతంలోనే జవాబులిచ్చిందన్నారు. 'శనివారం ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో రాహుల్‌కు తెలుసు. ఫలితాల తర్వాత ఏం మాట్లాడాలో.. ఏం సాకులు వెతుక్కోవాలో ఇప్పుడాయన ప్రాక్టీసు చేస్తున్నారు. అసత్యాలతో తనను తాను ఓదార్చుకుంటే.. కాంగ్రెస్ పునరుజ్జీవం జరగదు' అని ఎద్దేవా చేశారు. ఇంకోవైపు.. రాహుల్ పేరు ప్రస్తావించకుండా.. వచ్చిన ఆరోపణలపై పూర్తి వాస్తవాలతో స్పందిస్తామని ఈసీ ప్రకటించింది.

దక్షిణ కోస్తా రైల్వే జోన్.. ఇక అధికారికం

(మొదటి పేజీ తరువాయి)

కొంత భాగం (410 కిలోమీటర్లు) విశాఖపట్నం డివిజన్‌గా దక్షిణ కోస్తా జోన్‌లో ఉంటుందని తెలిపారు. వాల్తేరు డివిజన్‌లోని మిగతా భాగం (680 కిలోమీటర్ల)తో కొత్తగా తూర్పు కోస్తా రైల్వేలో రాయగడ రైల్వే డివిజన్ ఏర్పడుతుందని చెప్పారు. పార్లమెంట్‌లో చేసిన వాగ్దానాన్ని ఈ నిర్ణయంతో నేరవేర్చినట్టయిందని ఆయన పేర్కొన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఇప్పటికే ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ప్రకటించారని అశ్వినీ వైష్ణవ్ గుర్తు చేశారు. క్యాబినెట్ ఆమోదంతో.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా ఉనికిలోకి వచ్చినట్టయింది. కాగా, దీంతో పాటు మరో మూడు కీలక నిర్ణయాలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

- ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఐటీ చట్టం స్థానంలో తేనున్న కొత్త ఇన్‌కం ట్యాక్స్ బిల్లుకు ఆమోదం. ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని సరళతరం చేసేందుకే దీన్ని రూపొందించారు. వచ్చేవారంలో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం దాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపుతారు.
- 2022-23 నుంచి 2025-26 వరకూ రూ.8,800 కోట్ల వ్యయంతో 'స్కిల్ ఇండియా' కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి 2026 దాకా కొనసాగించాలన్న ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్. కాగా.. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) 4.0, ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(పీఎం-న్యాప్స్), జనశిక్షణ్ సంస్థాన్ స్కీమ్(జేఎస్ఎస్)లను 'స్కిల్ ఇండియా ప్రోగ్రాం' పరిధిలోకి తీసుకొచ్చినట్టు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.
- జాతీయ పారిశుధ్య కార్మికుల కమిషన్ కాలపరిమితిని 31.03.2025 నుంచి 31.03.2028 వరకూ పొడిగించాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.


మా జోలికి వస్తే ఊరుకోం..

- ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆంక్షలు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై వారెంట్ జారీతో ట్రంప్ ఆగ్రహం



వాషింగ్టన్, ఫిబ్రవరి 7: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెలరేగిపోతున్నారు. తమకు అత్యంత సన్నిహితమైన మిత్రదేశం ఇజ్రాయెల్ విషయంలో ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు(ఐసీసీ)కే షాకిచ్చారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అరెస్టు వారెంట్ జారీ చేసినందుకు ఐసీసీపై ఆంక్షలు విధిస్తూ గురువారం కార్యనిర్వాహక ఉత్తర్వులు(ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్) జారీ చేశారు. ఐసీసీ హద్దులు మీరీ తమ ఆంక్షలను అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ట్రంప్ తన ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఐసీసీ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని, ఐసీసీ అధికారులు, ఉద్యోగులు, వారి బంధువులను అమెరికాలో అడుగుపెట్టనివ్వమని స్పష్టం చేశారు. నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తున్న వేళ ఈ ఉత్తర్వులు రావడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో మంగళవారం భేటీ అయిన నెతన్యాహు.. క్యాపిటల్ హిల్‌లో గురువారం పలువురు చట్టసభ సభ్యులతో సమావేశమయ్యారు. 2023 అక్టోబరులో ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి ప్రతిగా.. పాలస్తీనాలో ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్య వల్ల వేల మంది పాలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఆ దేశ మాజీ రక్షణ మంత్రి యొయివ్ గెలంత్‌పై ఐసీసీ గత ఏడాది అరెస్టు వారెంట్లు జారీ చేసింది. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఉన్న ఐసీసీలో 125 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ఐసీసీలో లేవు. దీంతో ఐసీసీ తన పరిధి దాటి అమెరికా, దాని మిత్రదేశమైన ఇజ్రాయెల్‌పై నిరాధర ఆరోపణలతో చర్యలకు ఉపక్రమించిందని ట్రంప్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, అమెరికా తమపై ఆంక్షలు విధించడాన్ని ఐసీసీ శుక్రవారం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ఆంక్షలు ఎన్ని ఎదురైనా ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల రక్షణకు ఐసీసీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. మానవహక్కుల పరిరక్షణ కోసం సభ్య దేశాలన్నీ ఐసీసీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చింది.

చంద్రుడిపై పది నిమిషాల విధ్వంసం!




చంద్రుడిపై ఏర్పడిన లోయ

న్యూయార్క్, ఫిబ్రవరి 7: గ్రాండ్ కాన్యన్.. అమెరికాలోని అరిజోనాలో కొలరాడో నది కొన్ని మిలియన్ల సంవత్సరాలపాటు కొండలను రాసుకుంటూ ప్రవహించడం వల్ల సహజసిద్ధంగా ఏర్పడ్డ అతి పెద్ద లోయ! 6093 అడుగుల లోతు.. 446 కిలోమీటర్ల పొడుగు.. 29 కిలోమీటర్ల వెడల్పుతో అచ్చెరువొందించే ఆ ప్రకృతి అద్భుతాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ ఏటా లక్షలాది మంది పర్యాటకులు అక్కడికి వెళ్తుంటారు! అలాంటి అతిపెద్ద లోయలు చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో రెండున్నాయి. వాటి పేర్లు.. వ్యాలిస్ ష్రోడింగర్, వ్యాలిస్ ప్లాంక్. వీటిలో వ్యాలిస్ ష్రోడింగర్ దాదాపు 2.7 కిలోమీటర్ల లోతుతో.. ఇంచుమించుగా 270 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. వ్యాలిస్ ప్లాంక్ పొడుగు కూడా దాదాపు 270 కిలోమీటర్లేగానీ.. లోతు ఏకంగా 3.5 కిలోమీటర్లు ఉంటుంది. అయితే అవి మన గ్రాండ్ కాన్యన్ లోయలా సహజసిద్ధంగా కొన్ని మిలియన్ సంవత్సరాలపాటు నీటి రాపిడి వల్ల ఏర్పడ్డవి కావని.. 380 కోట్ల సంవత్సరాల క్రితం గ్రహశకలం తాకిడి కారణంగా కేవలం పది నిమిషాల్లో ఏర్పడ్డాయని అంతర్జాతీయ శాస్త్రజ్ఞుల బృందం తాజా అధ్యయనంలో వెల్లడైంది. నాసాకు చెందిన లూనార్ రికన్నైజాన్స్ ఆర్బిటర్ ఆ ప్రాంతంలో తీసిన ఛాయాచిత్రాలు, ఇతరత్రా డేటాను విశ్లేషించి వారు ఈ అంచనాకు వచ్చారు. అప్పట్లో ఆ గ్రహశకలం గంటకు 3600 కిలోమీటర్ల వేగంతో వచ్చి ఢీకొన్నప్పుడు ఉత్పన్నమైన శక్తి.. అమెరికా, సోవియెట్ యూనియన్, చైనా దేశాలు ఇప్పటిదాకా చేపట్టిన అణు పరీక్షలన్నింటివల్ల ఉద్భవించిన శక్తి కన్నా 700 రెట్లు ఎక్కువని.. అందుకే 10 నిమిషాల వ్యవధిలో ఈ లోయలు చందమామపై ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞులు వివరించారు.

సీఎం ఇలాకాలో బడిపిల్లల పస్తులు!

(మొదటిపేజీ తరువాయి)

వనరులు దోచి పెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా? అమృత్ స్కీంను బామ్మర్దికి అప్పనంగా కట్టబెట్టడంలో ఉన్న తెలివి.. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంపై ఉన్న శ్రద్ధ.. భవిష్యత్తు భారతావనికి వారసులైన పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఢిల్లీ బాసులు.. గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదని, ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ 420 అబద్ధపు హామీలు, 420 రోజుల చేతకాని పాలన.. ప్రజలకు శాపంగా మారిందని, 420 మంది రైతన్నలు ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు. అసమర్థులు అధికార పీఠమెక్కి.. అన్నదాతలను బలిపీఠం ఎక్కిస్తున్నారని ఆరోపించారు. చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్ల.. తెలంగాణ పల్లె మళ్లీ కన్నీరు పెడుతోందని పేర్కొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాలకు అన్యాయం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. దీనిని బీఆర్ఎస్ తరఫున క్షేత్రస్థాయిలో ఎండగడతామని, ఇందుకు సంబంధించి కార్యాచరణకు సిద్ధమవుతున్నామని చెప్పారు. శుక్రవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో ఆ పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల్లాగే బీసీలకు ఇచ్చిన హామీలు కూడా డొల్ల అనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగానే బీసీ వర్గాల సంఖ్యను ప్రభుత్వం భారీగా తగ్గించి చూపించిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నేతలు మధుసూదనాచారి, గంగుల కమలాకర్, జోగు రామన్న సహా బీసీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. అమెరికాలో ఏప్రిల్ 19న జరగనున్న కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్-2025కు హాజరు కావాల్సిందిగా కేటీఆర్‌ను కేఐబీసీ ఆహ్వానించింది. ఇవాన్‌స్టన్‌లోని ప్రతిష్ఠాత్మక నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీలో నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించాలని కేఐబీసీ ఉపాధ్యక్షుడు చెనాక్షా గోరంట్ల శుక్రవారం ఓ లేఖ ద్వారా కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ: హరీశ్‌రావు

గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కలుషితాహారం పెడితే సంబంధిత వ్యక్తులను అరెస్టు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట ఏమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో విద్యార్థులు ఆస్పత్రిపాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని శుక్రవారం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో కలుషితాహారం వల్ల విద్యార్థులు ఆస్పత్రుల్లో చేరిన ఘటనలు వందల సంఖ్యలో జరిగాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, కలుషితాహార ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళా పోలీస్‌లు తక్కువే!



(మొదటిపేజీ తరువాయి)

విధుల్లో ఉండటం లేదు. ఫలితంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళలు తమ సమస్యను పురుష పోలీస్‌ల వద్ద చెప్పుకోలేని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో అవసరమైనప్పుడు అత్యవసరంగా మహిళా సిబ్బందిని పిలిపించాల్సి వస్తోంది. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది కొరతను అధిగమించేందుకు నియామకాల్లో 33% రిజర్వేషన్ అమల్లోకి తెచ్చినా.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో అవసరమైనంత మంది అందుబాటులో లేరు.

మహిళా అధికారులు సిబ్బంది ఇలా..

రాష్ట్ర పోలీస్ శాఖలో అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. అందులో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే. వీరిలో ఎస్పీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు 3,642 మంది, సాయుధ విభాగం(ఏఆర్)లో 1,073 మంది మహిళలు ఉన్నారు. వీరితోపాటు 868 మంది మహిళలు హోంగార్డులుగా ఉన్నారు.

ఎక్కడికక్కడ ఇబ్బందులే...

మహిళా సిబ్బంది కొరత వల్ల పోలీసింగ్‌లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆందోళనలు, నిరసనల సమయంలో మహిళలను అదుపు చేయడం, అదుపులోకి తీసుకోవడం కష్టతరంగా మారుతోంది. నిబంధనల ప్రకారం మహిళలను అదుపులోకి తీసుకోవాలన్నా, అరెస్ట్ చేయాలన్నా, స్టేషన్‌లో విచారించాలన్నా.. మహిళా సిబ్బంది ఉండాల్సిందే. కానీ సిబ్బంది కొరత వల్ల కొన్ని సందర్భాల్లో ఠాణాల్లోనూ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు ఆందోళనల సమయంలో పురుష పోలీస్ సిబ్బందే మహిళా ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవాల్సి వస్తోంది. దీంతో అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీస్ శాఖ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

మహిళలపై పెరుగుతున్న నేరాలు..

మహిళలు, చిన్నారుల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ఏటా వారిపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై 19,013 కేసులు నమోదు కాగా.. 2024లో ఆ సంఖ్య 19,922కు పెరిగింది. గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారం కేసులు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. మిస్సింగ్ కేసుల్లో 2023తో పోలిస్తే 2024లో 18% పెరుగుదల నమోదైంది. ఇలా ప్రతి సంవత్సరం మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్యలో పెరుగుదల నమోదవుతుండగా.. బాధితులకు అవసరమైన స్థాయిలో సహాయం అందించేందుకు వీలుగా మహిళా పోలీస్ సిబ్బంది లేరు.

నియోజకవర్గాల్లోనూ మహిళా పోలీస్ స్టేషన్లు ఉండాలి..

జిల్లా కేంద్రాల్లోనే కాకుండా ప్రతి నియోజకవర్గ పరిధిలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెరిగిన మహిళల జనాభాకు అనుగుణంగా మహిళా పోలీస్ సిబ్బంది లేరని చెప్పారు. చాలా మంది యువతులు, మహిళలు మగ పోలీస్‌ల వద్ద అన్ని విషయాలు చెప్పుకోలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మహిళలు స్టేషన్‌కు వచ్చినప్పుడు మహిళా పోలీస్‌లు వారికి ధైర్యం చెప్పి, అండగా నిలబడేలా పరిస్థితులు కల్పించాలని రాజేంద్ర పల్నాటి కోరారు.

మదర్ డెయిరీ అప్పులు 32 కోట్లు!

- వడ్డీలకే నెలకు రూ.45 లక్షలు చెల్లిస్తున్నాం
- డెయిరీ ఆస్తులు అమ్మడం అనివార్యం
- సర్వసభ్య భేటీలో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయింది. రకరకాల కారణాలతో డెయిరీ అప్పులు పెరిగిపోయాయని.. వడ్డీల కింద నెలకు రూ.45 లక్షలు చెల్లిస్తున్నామని డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. మదర్ డెయిరీకి ఉన్న స్థిరాస్తులు అమ్మితే కానీ బయటపడే పరిస్థితి లేదన్నారు. హయత్‌నగర్‌లోని 'నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ)' ఆవరణలో 26వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మదర్ డెయిరీకి ఉన్న స్థిరాస్తులను అమ్మితే తప్ప డెయిరీని కాపాడుకోలేం. దానికి పాల రైతు సంఘాల అనుమతి, సహకారం కావాలి. డెయిరీని కాపాడుకోవడానికి ఇది ఒక్కటే మార్గం. అర్థం చేసుకుని సహకరించండి' అని కోరారు. 2014-2015 వరకు డెయిరీ లాభాల్లో నడిచిందన్నారు. ఆ తర్వాత అన్నీ నష్టాలేనని తెలిపారు. నకిరేకల్, చిట్యాల, చండూరులోని డెయిరీకి చెందిన స్థిర ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నట్లు వెల్లడించారు. రుణాలు రూ.32 కోట్లకు చేరాయన్నారు. ప్రతి నెల రూ.45 లక్షలు వడ్డీ కింద చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.22 కోట్లు బకాయి పడినట్లు చెప్పారు. ఢిల్లీ మదర్ డెయిరీ కాంట్రాక్టు రద్దు అయిన తర్వాతే నష్టాలు వచ్చాయన్నారు. డెయిరీలో 300 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 570 మంది ఉన్నారని, దీని వల్ల నెలకు రూ.1.80 కోట్ల భారం పడుతోందని మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఇలా రకరకాల కారణాల వల్ల డెయిరీ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. అయితే ఆస్తుల అమ్మకంపై రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు రైతులు ఆస్తులు అమ్మకుండా ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంటును తీసుకొచ్చి డెయిరీని నడిపించాలని కోరారు. ఆస్తులు విక్రయిస్తే న్యాయ పోరాటనికీ సిద్ధమని మరికొందరు, పదేళ్లుగా డెయిరీకి నష్టాలు వస్తుంటే పాలక వర్గం ఏం చేస్తోందని ఇంకొందరు ప్రశ్నించారు. ఆస్తులు అమ్మినా డెయిరీ లాభాల్లోకి రాకపోతే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని కొందరు పలు ప్రశ్నలు సంధించారు.

ఆస్తులు అమ్మక తప్పదు..

నష్టాల నుంచి గట్టెక్కేందుకు డెయిరీ ఆస్తులు విక్రయించాలని, గత సర్వసభ్య సమావేశంలోనే తీర్మానం చేశామని చైర్మన్ తెలిపారు. పాడి రైతుల అనుమతి కోసం మరోసారి సర్వసభ్య సమావేశంలో పెడుతున్నామని చెప్పారు. ఇష్టం ఉన్న వారు రిజిస్టర్‌లో సంతకం పెట్టాలని కోరారు. డెయిరీ ఆస్తులు బ్యాంకులు జప్తు చేస్తే తక్కువ ధర వస్తుందని, ఇది రైతులకే నష్టమని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో డెయిరీ ఆస్తుల్ని పాలకవర్గం ఆధ్వర్యంలోనే అమ్మితే అధిక ధర వస్తుందని, దాంతో అప్పులు చెల్లించి, మిగిలిన సొమ్ముతో డెయిరీని నడిపిద్దామని అన్నారు. చిట్యాల, మిర్యాలగూడ ఆస్తులు అమ్మితేనే సుమారు రూ.55 కోట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆస్తుల విక్రయంపై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని, పది మందితో కమిటీ వేస్తామని చెప్పారు.

పాలకవర్గమే బాధ్యత వహించాలి

"డెయిరీ నష్టాల్లో కూరుకుపోవడానికి పాలకవర్గమే బాధ్యత వహించాలి. డిస్ట్రిబ్యూటర్‌కు లాభం చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోరాదు. నష్టానికి కారణాలు తెలుసుకోవాలి. స్థిర ఆస్తులు అమ్మకుండా నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి. పది రోజులకోసారి పాడి రైతులకు డబ్బులు చెల్లించాలి. నష్ట నివారణపై గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయాలను, సూచనలను తీసుకోవాలి. అవకతవకలు జరిగితే పాలక వర్గాన్ని రద్దు చేస్తామని రాసి ఇవ్వాలి" అని పలువురు రైతులు డిమాండ్ చేశారు.

ఉద్యోగుల భవిష్యత్తును కార్పొరేట్లకు తాకట్టు పెట్టొద్దు

- ఎన్ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ వద్దని దశాబ్దకాలంగా ఉద్యోగులు పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి కొత్తగా ఏకీకృత పింఛను(యూపీఎస్) విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతోందని, దీనివల్ల ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరమవుతాయని ఎన్.ఎం.ఒ.పి.ఎస్. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి స్థిత ప్రజ్ఞ అన్నారు. యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో శుక్రవారం నిర్వహించిన ఉపవాస సత్యాగ్రహ ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీవితాలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త విధానం వల్ల ఉద్యోగులకు ఏమాత్రం భద్రత ఉండదన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బెంగళూరు ఉద్యోగ సంఘాల నాయకులు, రాష్ట్రం నుంచి సీపీఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌తో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో

వేలాది కోళ్ల మృత్యువాత

ఇప్పటి వరకు 45 వేల కోళ్లు మృతి.. పౌల్ట్రీ యజమానులకు తీవ్రనష్టం



కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో మృతి చెందిన కోళ్లను గోతిలో పూడుస్తున్న దృశ్యం(ఫైల్)

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గత పది రోజులుగా కోళ్లకు వస్తున్న అంతుచిక్కని వైరస్‌తో పౌల్ట్రీఫామ్‌ల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్, భీంగల్, పోతంగల్ మండలాల పరిధిలోని కొన్ని పౌల్ట్రీఫామ్‌లలో గల బాయిలర్ కోళ్లకు వైరస్ సోకడంతో చనిపోయాయి. జిల్లాలోని ఈ మూడు మండలాల పరిధిలో గల 10 ఫామ్‌లలో వైరస్‌తో 40 వేల వరకు కోళ్లు మృతి చెందాయి. జిల్లాలో బాయిలర్‌కు సంబంధించిన ఫామ్‌లు 50 వరకు ఉన్నాయి. వీటిలో 15 లక్షల వరకు కోళ్లు పెరుగుతున్నాయి. గుడ్లు పెడుతున్న కోళ్లకు మాత్రం ఈ వ్యాధి సోకలేదు. పశుసంవర్ధక శాఖ వైద్యులు చనిపోయిన కోళ్ల రక్త నమూనాలను హైదరాబాద్‌కు పంపించారు. మల్టిపుల్ వైరస్, వాతావరణ మార్పుల వల్ల ఈ వ్యాధులు సోకినట్లు వారు అంచనాకు వచ్చారు. కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ అంతుచిక్కని వైరస్‌తో వేలాదిగా కోళ్లు మృతి చెందుతున్నాయి. ఐదు రోజుల క్రితం బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ కోళ్లఫారంలో సుమారు 5 వేలకు పైగా కోళ్లు మృతి చెందాయి. కిష్టాపూర్‌లోనే కాకుండా బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లోనూ వేలాదిగా కోళ్లు మృతి చెందడంతో పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది రైతులు సుమారు 14 లక్షల వరకు బాయిలర్ కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు చెందిన కోళ్లను కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశించకుండా నిఘా పెట్టారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ వైరస్ వల్ల బాయిలర్ కోళ్లు మృతి చెందుతుండగా.. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఈ పరిస్థితి లేదు. ఈ రెండు జిల్లాల పరిధిలో కోళ్లకు ఎలాంటి వ్యాధి సోకలేదు. కాగా.. జిల్లాలో కోళ్లకు వచ్చిన ఈ వ్యాధిని మల్టిపుల్ వైరస్‌గా భావిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జగన్నాథచారి తెలిపారు. చనిపోయిన కోళ్ల నమూనాలను హైదరాబాద్‌లోని వెటర్నరీ ల్యాబ్‌కు పంపించామన్నారు. నివేదిక వచ్చిన తర్వాతనే వివరాలు తెలుస్తాయని చెప్పారు. అయితే పౌల్ట్రీ రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎక్కడా కోళ్లకు వైరస్ సోకిన దాఖలాలు లేవు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు, పౌల్ట్రీఫాం అసోసియేషన్ బాధ్యులు సైతం కోళ్లకు వైరస్ రాలేదని ధ్రువీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో భారీ సంఖ్యలో లేయర్, బ్రాయిలర్ కోళ్ల ఫారాలు ఉన్నా ఎక్కడా వైరస్ సమాచారం లేదు. మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పౌల్ట్రీ పరిశ్రమ లేదు.



దామరవంచ గురుకులంలో కలుషిత ఆహారం


- 16 మంది విద్యార్థులకు అస్వస్థత
- రాత్రి భోజనం తర్వాత వాంతులు, విరేచనాలు

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో 16మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నలుగురు తీవ్రంగా, 12 మంది స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. గురుకులంలోని సుమారు 530 మంది విద్యార్థులకు గురువారం సాయంత్రం స్నాక్స్ కింద గుడాలు, రాత్రి భోజన సమయంలో కాకరకాయ కూర, సాంబారు వడ్డించారు. అది తిన్న వారిలో 16 మంది విద్యార్థులకు అర్ధరాత్రి దాటాక వాంతులు, వీరేచనాలు కాగా శుక్రవారం తెల్లవారుజామునకు విషయం తెలుసుకున్న గురుకుల సీనియర్ ప్రిన్సిపాల్ రమేష్, జూనియర్ ప్రిన్సిపాల్ రాజమౌళి, వార్డెన్ అప్పారావు, ఉపాధ్యాయుల సహాయంతో గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన లకావత్ రాహుల్, గుగులోతు సాయిప్రసాద్, బానోత్ యాకూబ్, అనిల్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కలుషిత ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న వెల్లడించారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు.

చర్చలకు రండి

- ఆర్టీసీ జేఏసీకి లేఖ పంపిన కార్మిక శాఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ప్రైవేటు విద్యుత్ బస్సుల రద్దు, 2021 వేతన సవరణ జరిపి కొత్త నియామకాలు తదితర అంశాలకు పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీస్‌పై కార్మిక శాఖ స్పందించింది. చర్చలకు హాజరు కావాల్సిందిగా ఆర్టీసీ యాజమాన్యంతో పాటు జేఏసీ నాయకులకు శుక్రవారం లేఖ పంపింది. సోమవారం ఆర్టీసీ యాజమాన్యం, జేఏసీ నాయకులతో కార్మిక శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. మరోవైపు సమ్మెను విజయవంతం చేసేందుకు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులను జేఏసీ సమాయత్తం చేస్తోంది. కాగా, ఆర్టీసీ సమ్మెపై నిఘా విభాగం దృష్టి సారించింది. ఎవరెవరు సమ్మెకు అనుకూలంగా ఉన్నారనే వివరాలను నిఘా విభాగం అధికారులు సేకరిస్తున్నారు. సమ్మె నోటీస్‌కు కట్టుబడి ఉన్నామని, న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వెనక్కు తగ్గేది లేదని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ ఎత్తుగడ

ఆ మురికివాడలన్నింటినీ నేలమట్టం చేసి, పేదజనాలను తరిమికొట్టి అక్కడ ఒక మహాద్భుతమైన బీచ్ రిసార్ట్ కడతానంటున్నారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. అచ్చంగా ఇవే మాటలు కాకున్నా, గాజా గురించి ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి అంతిమంగా చెప్పింది ఇదే. గాజా నుంచి పాలస్తీనియన్లను ఖాళీచేయించడం, పొరుగు దేశాల్లో శాశ్వతంగా స్థిరపరచడం, హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల శరణార్థులుగా మారి పొరుగు దేశాలకు పోయినవారిని ఇక వెనక్కురానివ్వకపోవడం వంటివి ఆయన మెదడులో పుట్టిన అద్భుతమైన ఆలోచన. పాలస్తీనియన్లను తరమడానికి అవసరమైతే అమెరికా సైన్యాన్ని కూడా వాడతానని ట్రంప్ ముందే చెప్పారు కనుక, గాజాను అలా స్వచ్ఛందంగా ఖాళీచేసిపోయాక, వారి జన్మభూమిని ఏ విధంగా అమెరికా వశం చేయాలో ఇజ్రాయెల్ ప్రధాని చూసుకుంటారు. మందుపాతరలతో, మారణాయుధాలతో, మాంసపు ఖండాలతో నిండివున్న ఆ రుధిరక్షేత్రాన్ని శుభ్రం చేయించి దానిని ఓ అద్భుతమైన బీచ్ రిసార్టుగా అమెరికా తీర్చిదిద్దుతుంది. అది కేవలం విందువినోదాలను మాత్రమే పంచుతుందని సామాన్యజనం భ్రమపడతారని ట్రంప్‌కు తెలుసు. కాబట్టి, ఉపాధి అవకాశాలు పెంచుతుందని కూడా ఆయన గుర్తుచేశారు. ఇతరులతో పాటుగా అక్కడ పాలస్తీనా పేదలు, నిర్భాగ్యులు కూడా పనిచేసుకోవచ్చునని ఆయన దయగల మనసు అనుమతించింది.

అరవైవేల మృతదేహాలమీద అద్భుతమైన రిసార్టు నిర్మిస్తామని, ఊచకోత కోసిన చోట రియల్ ఎస్టేట్, టూరిస్ట్ వ్యాపారం చేసుకుంటామని ఒక దేశాధినేత చెప్పడం ఇదే ప్రథమం కావచ్చు. అందుకే ఇంతటి పాడు ప్రపంచం కూడా అంతగా నివ్వెరపోయింది, ఆగ్రహంగానూ ప్రతిస్పందించింది. అనంతరం శ్వేతసౌధం ట్రంప్ వ్యాఖ్యలకు కొత్తభాష్యాలు చెప్పింది. స్వపక్షం కూడా కస్సుమంటున్నందున ఒక్క అమెరికన్ సైనికుడు కూడా అక్కడ అడుగుపెట్టకుండానే స్వకార్యాన్ని చక్కబెట్టుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. తన సమక్షంలో ట్రంప్ అంత చక్కగా భవిష్యత్‌ను విప్పిచెప్పిన తరువాత ఇజ్రాయెల్ ప్రధానికి మాత్రం ఆనందం కలగకుండా ఎందుకు ఉంటుంది? హమాస్ ఏలుబడిలో ఉన్న గాజా దుంపనాశమై, అక్కడో అద్భుతమైన బీచ్‌రిసార్టు వస్తే ఇజ్రాయెల్‌కు అంతకంటే భద్రత ఏముంటుంది? ఆయన వెంటనే సినిమా ఫక్కీలో మంచి ఆఫర్ ఇది అని తేల్చేశారు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత, ఆయనతో భేటీ అయిన తొలివిదేశీ నేత నెతన్యాహూ. పదిహేను నెలల గాజాయుద్ధంలో చావులూ నష్టాలూ కష్టాలూ ఒప్పందాల వరకూ లోతుపాతులన్నీ చర్చించుకోకుండానే వీరిద్దరూ మీడియాముందు ఈ విన్యాసం చేయరన్నది నిజం. ట్రంప్ తన ప్రణాళిక విప్పగానే, చరిత్రగతినే మార్చేటంతటి మహాద్భుతమైన ఆలోచన అని కీర్తించారు నెతన్యాహూ. తక్షణ అమలుకోసం అమెరికా నుంచే తన దేశానికి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తన సైనికులను పంపబోవడం లేదు కనుక, మీరే పాలస్తీనియన్లను గాజానుంచి వెళ్ళగొట్టండి అని ఇజ్రాయెల్ రక్షణమంత్రి తన సైన్యాన్ని ఆదేశించారు.

ట్రంప్ ప్రతిపాదనను చాలా దేశాలు ఖండించాయి. ఈజిప్ట్, జోర్డన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ ఇత్యాది దేశాలు ఆగ్రహంగా స్పందించాయి. అంతర్జాతీయ వేదికలు కఠినమైన మాటల్లో తప్పుబట్టాయి. ధ్వంసమైన గాజాను అందంగా తీర్చిదిద్దుతానని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, అమెరికా–ఇజ్రాయెల్ తమ మారణాయుధాలతో కలసికట్టుగా సర్వనాశనం చేయడానికి ముందు అది ఎంత మనోహరంగా ఉండేదో తెలియచెబుతున్న చిత్రాలు తిరిగి ప్రచారంలోకి వచ్చాయి. టూరిజం మక్కా, ఉద్యోగాల మక్కా అంటూ ఆయన విసురుతున్న వలలో పాలస్తీనియన్లు చిక్కరన్నది వాస్తవం. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉండగా, ఇజ్రాయెలీ బందీలను హమాస్ సవ్యంగా అప్పగిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసి కొత్త చిచ్చురేపారు. నెతన్యాహూ మళ్ళీ రణనినాదాలు చేస్తున్నారు. అమెరికా రాయబారకార్యాలయాన్ని టెల్ అవీవ్‌నుంచి జెరూసలేంకు మార్చడం, ఆక్రమించుకున్న ప్రాంతాలతో కలిపి ఇజ్రాయెల్ సార్వభౌమత్వాన్ని గుర్తించడం వంటివి ట్రంప్ తన తొలి హయాంలో చేశారు. ఇప్పుడు పాలస్తీనియన్ల భూభాగంలో కొంత తానే ఆక్రమించుకొని, 18లక్షల మందిని ఇతరదేశాలకు తరిమికొట్టి పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం పేరిట కొత్త కుట్రలకు తెరదీస్తున్నారు.

ఆర్థిక సర్వే అరణ్య రోదన

నాకు గుర్తు ఉన్నంతవరకు, రాజకీయ లక్ష్యాలతో రూపొందిన నిర్మలా సీతారామన్ 8వ బడ్జెట్ లాంటిది మరొకటి మరెన్నడూ లేదు. ఆర్థిక వ్యవస్థను సంస్కరణలతో పునర్వ్యవస్థీకరించేందుకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఘోరంగా విఫలమైన బడ్జెట్ మరొకటి లేనేలేదని కచ్చితంగా చెప్పగలను. తదుపరి దశ ఆర్థిక సంస్కరణలకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం విఫలయింది. ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించింది.

2024లో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఒకసారి సింహావలోకనం చేసుకోండి. భారతీయ జనతా పార్టీకి ప్రజలు వరుసగా మూడోసారి అధికారమిచ్చారు. అయితే ఒక హెచ్చరిక స్పష్టంగా చేశారు. మీకు తగినంత మంది ఎంపీలు ఉన్నారు. అయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన పూర్తి మెజారిటీ మీకు లేదు. రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు మీరు ప్రయత్నించకూడదు. ఏకాభిప్రాయ సాధనతో మీరు పరిపాలన చేయాలి. నిరుద్యోగిత, పేదరికం, అసమానతలు, ద్రవ్యోల్బణం, రైతుల దురవస్థ, మౌలిక సదుపాయాల కొరత మొదలైన సమస్యల పరిష్కారానికి మీరు శ్రద్ధ చూపాలి.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

సరిగ్గా ఇటువంటి పరిస్థితులనే కాదూ 1991లో ప్రధాని పీవీ నరసింహారావు, ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎదుర్కొన్నది? కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధానమంత్రి ఆర్థికమంత్రి ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని నవ పథనిర్దేశక ఆర్థిక సంస్కరణలు ప్రకటించారు. జూలై 1, 1991న ప్రారంభమైన ఆ సంస్కరణల తొలి దశ ఆగస్టు 15, 1991న ముగిసింది (రూపాయి విలువ తగ్గింపు, వాణిజ్య సంస్కరణలు, ద్రవ్య రంగ సంస్కరణలు, పన్నుల సంస్కరణలు, నూతన పారిశ్రామిక విధానం మొదలైనవి ఆ తొలి దశలో అమలయ్యాయి.

2024 సార్వత్రిక ఎన్నికల తరువాత జూలై 23, 2024న నరేంద్ర మోదీ–సీతారామన్ ప్రథమ బడ్జెట్‌ను ఎవరినీ ఉత్సాహపరచలేకపోయింది. ఆర్థికాభివృద్ధిని వేగిరపరిచే ప్రభావాన్ని చూపడంలో విఫలమయింది. పాలకులు అందుకు ఎన్నో సాకులు చూపారు. ఆ బడ్జెట్ సంవత్సరం ముగిసేలోగా ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించింది. వేతనాలు స్తంభించిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోయాయి విదేశీ కంపెనీలు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. వ్యాపార సంస్థలు, వ్యాపారవేత్తలు సింగపూర్, దుబాయి, అమెరికాకు వలస వెళ్లారు. 'ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం ఎందుకు పూనుకోవడం లేదు? తక్షణమే పటిష్ఠ చర్యలు చేపట్టాలని పాలకులను గట్టిగా కోరేదెవరు?' అనే ప్రశ్నలను ప్రతి ఒక్కరూ అడిగారు.

అదృష్టవశాత్తు ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) 'ఆర్థిక సర్వే–2024–25' మున్నుడిలో ఒక అర్థవంతమైన, కార్యసాధక సలహా ఇచ్చారు. 'ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై నియంత్రణలు ఎత్తివేయాలి' అన్నది ఆయన సలహా. సముచితమైన సలహా, సందేహం లేదు. ఆర్థిక సర్వేలో 13 అధ్యాయాలు ఉన్నాయి. సీఈఏ సలహాలు, సిఫారసులు ఏమిటి, వాటికి ప్రభుత్వ ప్రతిస్పందన (లేదా స్పందనా రాహిత్యం) ఏమిటో వివరించేందుకు నాలుగు అధ్యాయాల గురించి ప్రస్తావిస్తాను మొదటి అధ్యాయం (ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు)లో ఆర్థికాభివృద్ధి మందగతిలోకి జారిపోవడానికి కారణాలను నొక్కి చెప్పారు. పోటీ తత్వాన్ని మెరుగుపరిచేందుకు నియంత్రణలు ఎత్తివేయాలని, సంస్థాగత సంస్కరణలు అమలుపరచాలని సీఈఏ సిఫారసు చేశారు. ఆర్థికమంత్రి ఆ సిఫారసుకు పూర్తిగా విరుద్ధమైన చర్యలు చేట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలకు మరిన్ని నిధులు కేటాయించారు. సరికొత్తగా 7 స్కీమ్‌లు, 8 మిషన్‌లు, 4 ఫండ్స్‌ను ప్రకటించారు! డీరెగ్యులేషన్‌కు నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ లేదు. ఏ రంగంలోనూ పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు తోడ్పడే చర్యలు ఏవీ ప్రకటించలేదు.



సమస్యలు, సవాళ్లు ఉన్నాయి. ఒక ప్రభుత్వమూ ఉన్నది. అయితే పాలన లోపించింది!. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు ఆర్థిక సర్వేలో వివేకవంతమైన సూచనలు చేశారు. తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టవలసిన చర్యలు నిష్కర్షగా చెప్పారు. మరి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ఎనిమిదవ వార్షిక బడ్జెట్‌లో వాటికి సమంజసమైన రీతిలో ప్రతిస్పందించారా? లేదు.

ప్రస్తుతం దేశాన్ని పట్టి పీడిస్తున్న విషమ సమస్య నిరుద్యోగిత. ముఖ్యంగా పిల్లలు నిరుద్యోగులుగా ఉండిపోయిన కుటుంబాల వెతలు మాటల్లో చెప్పలేనివి. 12వ అధ్యాయం (ఉద్యోగిత, నైపుణ్యాల అభివృద్ధి)లో నిరుద్యోగిత రేటు 2023–24లో 3.2 శాతానికి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి రావడంలో 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్)పై ఆర్థిక సర్వే ఆధారపడింది. నిరుద్యోగిత రేటు అంత తక్కువగా ఉంటే దాన్ని పూర్తి ఉద్యోగితగా అర్థశాస్త్ర సిద్ధాంతాల్లో పరిగణిస్తారు. ఆ నిర్ణయంతో ఎదురయ్యే ప్రమాదాన్ని గుర్తించి కాబోలు 2030 సంవత్సరం దాకా వ్యవసాయేతర రంగాలలో ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టించవలసిన అవసరమున్నదని ఆర్థిక సర్వే పేర్కొంది. 2030 నాటికి పనిచేసే వయసులో ఉండే జనాభా 96 కోట్లకు పెరుగుతుందని అంచనా.

మరి పీఎల్ఎఫ్ఎస్, ఆర్థిక సర్వేలు వెల్లడించిన విషయాలతో ఆర్థికమంత్రి ఏకీభవిస్తారా? ఆమె మౌనం వహిస్తున్నారు. అంటే ఆ సర్వేలు వెల్లడించిన వాస్తవాలను ఆమె నిరాకరించడమే కాదూ? 'డి రెగ్యులేషన్ డ్రైవ్స్ గ్రోత్' అనే శీర్షికన ఒక అధ్యాయానికి అధ్యాయమే (5వ అధ్యాయం) ఉన్నది. ప్రస్తుత పెట్టుబడుల రేటు 31 శాతం కంటే తక్కువగా ఉన్నది. వృద్ధిరేటు 6.5 శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ మదుపుల రేటు, వృద్ధి రేటుతో స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి మనం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఆవిర్భవించడం అసాధ్యమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది.

సరే, 'మేక్ ఇన్ ఇండియా' గురించి ప్రభుత్వం నిర్విరామంగా ఘోషిస్తూనే ఉన్నది. అయినప్పటికీ మన తయారీరంగం పురోగతి గొర్రె తోక బెత్తెడేనన్న రీతిలో ఉన్నది. ఈ రంగం ఎంతకూ సుస్థిరంగా, శీఘ్రగతిన పురోగమించడంలేదు. ఏడవ అధ్యాయం 'ఇండస్ట్రీ : ఆల్ ఎబౌట్ బిజినెస్ రిఫార్మ్స్' కొన్ని చేదు వాస్తవాలను వెల్లడించింది. ప్రపంచ వస్తూత్పత్తిలో మన వాటా 2.8 శాతం మాత్రమే. మరి చైనా వాటా 28.8 శాతం. దీన్ని బట్టి తయారీరంగంలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో అర్థమవుతుంది. జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో మన తయారీరంగం వాటా 2011–12లో 17.4 శాతం నుంచి 2023–24లో 14.2 శాతానికి తగ్గిపోయింది. తయారీరంగానికి అవసరమైన సమస్త యంత్రాలనూ మనం దిగుమతి చేసుకుంటున్నాం. పరిశోధన అభివృద్ధి రంగంలో మనం చేస్తున్న వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 1 శాతం కంటే తక్కువ! ఈ అవరోధాలు అన్నిటినీ అధిగమించి ముందుకు పోవడానికి మార్గం నియంత్రణల ఎత్తివేత, పరిశోధన అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడమేనని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరి ఆర్థిక సర్వేకు బడ్జెట్ ఎలా ప్రతిస్పందించింది? సరికొత్త పథకాలు, కార్యక్రమాలు ప్రారంభించింది! సమస్యలు, సవాళ్లు ఉన్నాయి. ఒక ప్రభుత్వమున్నది. అయితే పాలన లోపించింది! పాలన వర్తమానంలో జరగాల్సిన వ్యవహారం కదా! ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వివేకవంతమైన సూచనలు చేశారు. తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టవలసిన చర్యలను నిష్కర్షగా చెప్పారు. మరి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ఎనిమిదవ వార్షిక బడ్జెట్‌లో వాటికి సమంజసమైన రీతిలో ప్రతిస్పందించారా? లేదు. ఆర్థిక సలహాదారు వివేకవాణి మరో అరణ్యరోదనే అయింది!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చారిత్రక చీకటి వెలుగుల్లో లాహోర్

చాలా సంవత్సరాల క్రితం నా పరిశోధనా వ్యాసంగంలో, యాదృచ్ఛికంగా ఒక టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తా కథనాలను చూడడం, చదవడం తటస్థించింది. 1955లో లాహోర్‌లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ అది. ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన సామాజిక సందర్భం చాలా ఆసక్తికరమైనది. తన బహుళ–సంస్కృతీమయ గతాన్ని పునర్దర్శించడానికి, ఆ స్ఫూర్తిదాయక చరిత్రను అవాహన చేసుకోవడానికి లాహోర్‌ను 1947 తరువాత ప్రప్రథమంగా అనుమతించిన సందర్భమది. టెస్ట్ మ్యాచ్‌ను చూసేందుకు వాఘా సరిహద్దుకు ఈవల ఉన్న అమృత్‌సర్ నుంచి రోజూ ఉదయం వచ్చి రాత్రికి తిరిగి వెళ్లిపోయే భారతీయ పౌరులకు పదివేల టిక్కెట్లు ప్రత్యేకంగా విక్రయించారు. 'దేశ విభజన అనంతరం భారత్ నుంచి పాకిస్థాన్‌కు జరిగిన అతిపెద్ద సామూహిక వలస' అని భారతీయ క్రికెట్ అభిమానుల వెల్లువను ప్రత్యక్ష సాక్షి ఒకరు అభివర్ణించారు.

29 జనవరి 1955న ఆ టెస్ట్ మ్యాచ్ ప్రారంభమయింది. మరుసటి రోజు 'డాన్'లో వెలువడిన ఒక వార్తా కథనం టిక్కెట్ల కొనుగోలుకు వాఘా అవల నుంచి వచ్చినవారు ఎలా బారులు తీరిందీ పేర్కొంది. 'స్టేడియం వద్ద కోలాహలం షాలిమార్ మేలాను జ్ఞప్తికి తెచ్చింది. కాకపోతే ఈ గుంపుల్లో ఉన్న వారందరూ కులీన వర్గాలకు చెందినవారు. భారతీయ సందర్శకులలో ముఖ్యంగా సిక్కులు అందరినీ ఆకర్షించారు. వారు ఎక్కడకు వెళ్లినా సాదర స్వాగతం లభించింది. పాకిస్థానీయులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు అనుకోకుండా తమ పాత స్నేహితులను చూసినప్పుడు ఆనంద బాష్పాలు రాల్చారు' అని 'డాన్' వార్తా కథనం పేర్కొంది. ఈ వార్త రాసిన విలేఖరి లాహోర్‌లోని పాకిస్థానీ ముస్లిం అయి ఉంటాడనేది స్పష్టం. సరిగ్గా ఇటువంటి మనోభావాలనే సుదూర మద్రాసులోని హిందూ పాత్రికేయుడు ఒకరు వ్యక్తం చేశారు. 'ఈ టెస్ట్ మ్యాచ్ రోజుల్లో పాకిస్థానీయులు, భారతీయుల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది' అని ఆ పాత్రికేయుడు రాశారు.

ఇటీవల ప్రచురితమైన మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకం 'Disrupted City : Walking the Pathways of Memory and History in Lahore'ను చదువుతున్నప్పుడు ఎనభై ఏళ్లనాటి ఆ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తాకథనాలు జ్ఞప్తికి వచ్చాయి. అసిఫ్ లాహోర్‌లో పెరిగాడు. ముప్పై ఏళ్ల క్రితం ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లిపోయాడు. తరచు కన్న ఊరుకు వస్తుంటాడు. లాహోర్ కథను పాకిస్థాన్‌కే పరిమితం చేయకుండా ఆ నగర విశాల చరిత్రను చెప్పడమే తన ధ్యేయమని అసిఫ్ తన పుస్తకంలో పేర్కొన్నాడు. నగరానికి సంబంధించి తన వ్యక్తిగత స్మృతులను పర్షియన్, ఉర్దూ, పంజాబీ, అరబిక్ భాషా గ్రంథాలలో విద్వత్ శోధనలతో మేళవించి ఆ పురానవ నగర చరిత్రను అసిఫ్ వెలయించాడు. '1947కు పూర్వం లాహోర్ జన జీవనంలోని భిన్నత్వం, బహుళత్వం, హిందూ, సిక్కు మతస్థుల సామూహిక నిష్క్రమణ, ముస్లిం శరణార్థుల రాకతో అంతరించి పోయాయని' అసిఫ్ పేర్కొన్నాడు. 'దేశ విభజనతో సంభవించిన ఆ విచ్ఛిన్నంతో లాహోర్ తన సొంత గతం నుంచి బలవంతంగా బహిష్కృతమయింది' అని అసిఫ్ నిట్టూర్చాడు.


అసిఫ్ పుస్తకంలో క్రికెట్ గురించి సందర్భవశాత్తు ప్రస్తావనలు మినహా ఏమీలేదు. 1955 టెస్ట్ మ్యాచ్ గురించి అసలు ఏమీ లేదు. అయినప్పటికీ ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన రోజుల్లో క్రికెట్ అభిమానుల కోలాహలం గురించి ఆయన ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. వారి సందడి షాలిమార్ మేలాను గుర్తుకు తెచ్చిందని ఆయన అభివర్ణించాడు. షాలిమార్ మేలా (మేలా చిరాఘన్‌గా కూడా సుప్రసిద్ధం) ఒకప్పుడు లాహోర్ నగర ప్రధాన పండుగలలో ముఖ్యమైనది. 16వ శతాబ్ది సూఫీ సాధువు షా హుస్సేన్ జీవితం, వారసత్వానికి సంబంధించిన ఉత్సవమది. అసిఫ్ ఇలా రాశాడు: 'ఆచారాలకు ప్రాధాన్యమిచ్చే వారిని ఆయన తీవ్రంగా విమర్శించేవాడు. మద్యపాన ప్రియుడు. మత్తు పదార్థాలను సేవించేవాడు. ఆనంద తాండవం చేసేవాడు, తరచు నగ్నంగా'. షా హుస్సేన్ సన్నిహితుడు, ఆంతరంగికుడు ఒక హిందూ యువకుడు. బహుశా అతడి లైంగిక భాగస్వామి కావచ్చు. ఆ ఇరువురిని ఖననం చేసిన స్థలం హిందువులు, ముస్లింలు, సిక్కులకు పుణ్యక్షేత్రం. ఏటా అక్కడ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దేశ విభజన అనంతరం లాహోర్ జన జీవనంలో ఈ బహుళత్వం అంతరించింది. 1955లో టెస్ట్ మ్యాచ్‌ను చూడడానికి వచ్చిన జనసందోహాన్ని చూసి చాలా మంది ఆ సంప్రదాయ ఉత్సవాన్ని గుర్తుచేసుకున్నారు. లాహోర్ బహుళస్తరిత, బహుళ మత, బహుళ భాషా గతాన్ని అర్థం చేసుకునేందుకు అసిఫ్ పుస్తకం మనకు విశేషంగా తోడ్పడుతుంది. షా హుస్సేన్ గురించే కాకుండా నర్తకి అనార్కలి, మార్మిక సాధువు గంజ్ బక్ష్, మహారాజా రంజిత్ సింగ్ మొదలైన నగర ప్రముఖుల చరిత్రనుకూడా క్లుప్తంగానే అయినప్పటికీ ఆసక్తికరంగా వివరించాడు. రుడ్యార్డ్ కిప్లింగ్‌ను సామ్రాజ్యవాది అని ఆక్షేపించాడు. అది నిజమేకాని కిప్లింగ్ తన 'కిమ్' నవలలో లాహోర్ నగర సామాన్యుల జీవితాలను ఎంతో సహానుభూతితో వర్ణించాడు.

లాహోర్ వాస్తుకళా వైభవాన్ని కూడా అసిఫ్ విపులంగా అభివర్ణించాడు సుప్రసిద్ధ చారిత్రక కట్టడాలనే కాకుండా అనామక మసీదుల గురించి కూడా చెప్పాడు. ఇప్పుడు మసీదులతో పాటు శిథిలమైన దేవాలయాలు, గురుద్వారాలు ఎన్నో కనిపిస్తుంటాయి. సుదూర గతంలో లాహోర్ దిగ్మండలంలో హిందూ, సిక్కు పూజా మందిరాలు ప్రముఖంగా కనిపించేవని ఆయన విపులంగా వివరించాడు. 1947కు పూర్వం లాహోర్ నగర ఆర్థిక జీవనంలో హిందువుల, సిక్కుల కీలక పాత్ర గురించి కూడా అసిఫ్ ప్రముఖంగా వర్ణించాడు. 1970లు, 1980లలో లాహోర్‌లో తన బాల్య, కౌమార దశల గురించి గూడా ఆయన రాశారు. రోజూ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతూ ఒక పాత భవనం ద్వార ఫలకంపై దేవనాగరి లిపిలో రాసి ఉన్న పదాలను చూస్తుండేవాడినని పేర్కొన్నాడు. తాను ఆ అక్షరాలను అలా చూసి ఇలా వెళ్లిపోతుండేవాడినని. ఎప్పుడూ ఆ భవనం ముందు అట్టే తచ్చాడలేదని అసిఫ్ గుర్తుచేసుకున్నాడు. ఆ దేవనాగరి లిపిలోని మాటలను చదవలేకపోయేవాడినని, ఆ లిపి నేర్చుకునే ప్రయత్నం కూడా తాను చేయలేదని అసిఫ్ తెలిపాడు. ఇంకా ఇలా వ్యాఖ్యానించాడు: 'దేవనాగరి లిపి 'హిందూ మతానికి సంబంధించినది అని నాకు తెలుసు. మా సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకాల ప్రకారం హిందువు అంటే ముస్లింను వెన్నుపోటు పొడవడానికి ప్రయత్నించేవాడు మరి'. ఈ వాక్యాలు చదువుతున్నప్పుడు హిందుత్వ వాదుల పాలనలో హిందూ బాలలు వక్రీకరించిన చరిత్రను చదువుతున్న విషయమై ఆలోచనా మగ్నుడినయ్యాను. ఉర్దూ పూర్తిగా ముస్లింల భాష అని దశాబ్దాలుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఎంతో మంది గొప్ప గొప్ప హిందూ, సిక్కు రచయితలు ఉర్దూ భాషకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సాధించినప్పటికీ ఆ భాష పూర్తిగా ముస్లింలదేనని ప్రచారం చేయడమేమిటి?

ఇండియా ప్రధానంగా 'హిందూ' దేశం అనే వివరణను, బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు నిర్దేశిస్తున్న చరిత్ర, సాంఘిక శాస్త్ర పాఠ్యగ్రంథాలు మరింతగా బలపరుస్తున్నాయి. ఈ మెజారిటీవాద ప్రపంచ దృక్పథాన్ని హిందుత్వ సామాజిక మాధ్యమ శ్రేణులు విపులీకరిస్తున్నాయి. సమస్త హిందువులు, ముస్లింలు అందరినీ ఎటువంటి మినహాయింపు లేకుండా అనుమానించాలని ఆ శ్రేణులు నిత్యం పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాయి. ఒకప్పుడు ప్రజలు అందరూ ఎటువంటి తరతమ భేదాలు లేకుండా పాల్గొన్న మేలా చిరాఘన్, బసంత్ మొదలైన పండుగలు లాహోరీల ఉమ్మడి స్మృతిపథం నుంచి ఎలా బహిష్కృతమయిందీ అసిఫ్ పేర్కొన్నారు. సైనిక పాలకుడు జియా ఉల్ హఖ్ ప్రోత్సహించిన వహాబీ ఇస్లాం సిద్ధాంతాలకు ఆ వేడుకలు విరుద్ధమైనవి కావడంతో లాహోర్ నగర జీవితంలో వాటికి స్థానం లేకుండా పోయిందని అసిఫ్ వివరించారు.

1980ల నాటి నుంచీ పాకిస్థాన్‌లో 'సంతోషం, సద్యోజనిత ప్రేరణలు, సాముదాయికతను అనుమానాస్పద కార్యకలాపాలుగా శంకించడం ఆరంభమయింది. అదే సమయంలో న్యాయమైన, ధర్మబద్ధమైన ఆగ్రహం, మనస్తాపం, విద్వేషం సంస్మరణ కార్యకలాపాలకు ఆధారాలుగా మారాయి'.. హైందవీకరణ అయిన భారత్ పాకిస్థాన్ పోకడలను అనుసరిస్తున్నట్టుగా కనిపించడం లేదూ? సమష్టి సంతోషాలు, సద్యోజనిత ప్రేరణల స్థానంలో మత విద్వేషాలు, ప్రతీకారాత్మక ఆగ్రహావేశాలు విజృంభిస్తున్నాయి.

లాహోర్ చారిత్రక గతం నుంచి హిందూ, సిక్కు ప్రభావాలు, ఆనవాళ్లను పూర్తిగా చెరిపివేసేందుకు ఇస్లామిక్ పాకిస్థాన్ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంది. పాకిస్థాన్‌ను ద్వేషించమని బాహాటంగా ప్రకటిస్తున్న హిందుత్వ వాదులు చారిత్రక ఆనవాళ్లను రూపుమాపే తమ ఎడతెగని ప్రయత్నాలలో బద్ధశత్రువులనే అనుకరిస్తున్నారు! గత యుగాలలో ఉత్తర భారతావనిలోని ముస్లిమేతరుల రాజకీయ పరాధీనతనే కాకుండా మత విశ్వాసాల రీత్యా ముస్లింలు అయిన రచయితలు, కళాకారులు, సంగీతవేత్తలు భారతీయ సమాజం, సంస్కృతి సమున్నతికి అందించిన అజరామర సేవలను కూడా మనం మరచిపోవాలని కోరుతున్నారు. అయితే అవి మన ఉమ్మడి, సమ్మిళిత, బహుళత్వ భారతీయ సంస్కృతిలో అపరిహార్యమైన భాగం కదా. హిందుత్వను వ్యతిరేకించే వారందరూ ఆ సమున్నత సమ్మిళిత సంస్కృతిని స్వీకరించి, స్థిరపరచాలి. మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకాన్ని పాకిస్థాన్‌లో విస్తృతంగా చదువుతారని, ఉర్దూ, పంజాబీ భాషలలో దాని అనువాదాలు వెలువడగలవని ఆశిస్తున్నాను. ఒక గొప్ప, అయితే వ్యాకులతకు గురిచేస్తున్న నగర ప్రశస్త చరిత్ర అది. వాఘాకు అవలే కాదు, ఈవల సైతం ఉన్న వారికి కూడా అసిఫ్ పుస్తకంలో విలువైన పాఠాలు ఉన్నాయి.



పాకిస్థాన్ చరిత్రకారుడు మనాన్ అహ్మద్ అసిఫ్ కొత్త పుస్తకం 'Disrupted City : Walking the Pathways of Memory and History in Lahore' లాహోర్ కథను పాకిస్థాన్‌కే పరిమితం చేయకుండా దేశ విభజనకు పూర్వం ఆ నగర విశిష్ట చరిత్రను విశాల దృక్పథంతో వివరించింది. వాఘా అవలే కాకుండా, ఈవల ఉన్న వారికి సైతం ఆ పుస్తకంలో విలువైన పాఠాలు ఉన్నాయి.



■ రామచంద్ర గుహ


గతానుగతం

(వ్యాసకర్త చరిత్రకారుడు)

దళిత, బహుజన బంధువు రేవంత్

స్వతంత్ర భారతదేశంలో ఏ పాలకుడు చేయని సాహసం సీఎం రేవంత్‌రెడ్డి చేశారు. బ్రిటిష్ పాలనలో 1931లో చేసిన కుల గణన తర్వాత, 2025 వరకు మళ్లీ కుల గణన జరగలేదు. ఒక రకంగా ఆలోచిస్తే ఆశ్చర్యం... అణగారిన వర్గాలు కోల్పోయిన హక్కుల పరంగా ఆలోచిస్తే పంటి బిగువున దాచిన సత్యాగ్రహం.

కులగణనను రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేసింది. మొదటగా 2024 నవంబర్ 6 నుంచి 8 వరకు తెలంగాణలోని ప్రతి ఇంటికీ స్టిక్కరింగ్ చేసింది. నవంబర్ 9న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే గవర్నర్ ప్రారంభించారు. సర్వే పూర్తికి 50 రోజులు పట్టింది. 1,15,71,457 కుటుంబాలను లిస్ట్ చేస్తే, 1,12,15,134 కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయి, 3,56,323 కుటుంబాలు సర్వేకు దూరంగా ఉన్నాయి. జనాభా ప్రకారం సర్వేలో పాల్గొన్నవారు 3,54,77,554 మంది ఉంటే.. బీసీలు 1,64,09,179 (46.25 శాతం), ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనార్టీ బీసీలు 35,76,588 (10.08 శాతం), ముస్లిం మైనార్టీ ఓసీలు 8,80,424 (2.48 శాతం), ఓసీలు 47,21,115 (13.31 శాతం). ఇందులో బీసీలు, బీసీ మైనార్టీలు కేటగిరీల వారీగా A నుంచి E వరకు కలిసి 1,99,85,767 (56.33 శాతం) మంది ఉన్నారు. ఇక ఓసీలు, మైనార్టీ ఓసీలు కలిసి 56,01,539 (15.79 శాతం) మంది. ఒకసారి 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు కూడా పరిశీలిస్తే.. బీసీలు 1,85,61,856 (51 శాతం) మంది, ఎస్సీలు 63,60,158 (18 శాతం) మంది, ఎస్టీలు 36,02,888 (10 శాతం) మంది, ఓసీలు 78,12,858 (21 శాతం) మంది ఉన్నారు. దీన్నిబట్టి, 2014లో ఓసీ జనాభాను పెంచి బీసీ జనాభాను కేసీఆర్ సర్కార్ తగ్గించే ప్రయత్నం చేసిందని స్పష్టంగా అర్థమవుతుంది. రేవంత్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా కులగణన చేస్తే, గతంలో పెద్దపెద్ద మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసినవాళ్లు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం సిగ్గుచేటు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఆశయంతో బీసీ కమిషన్, బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటు వంటి పనులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం.



రేవంత్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా కులగణన జరిగితే, గతంలో పెద్దపెద్ద మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసినవాళ్లు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం సిగ్గుచేటు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఆశయంతో బీసీ కమిషన్, బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటు వంటి నిర్ణయాలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటాయి.

ఇక, ఎస్సీ వర్గీకరణ డిమాండ్ ఈనాటిది కాదు. మూడు దశాబ్దాల పోరాటం. అనేక మంది దళితులు తమ హక్కుల కోసం అసువులుబాసిన సందర్భం. అందుకే న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ అనేక చర్యలు తీసుకుంది. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, తదితరులతో కలిపి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. కేబినెట్ సబ్ కమిటీ ఎస్సీ ఉపకులాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు పంజాబ్, హర్యానా, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో పర్యటించింది. అనేక సమావేశాల తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడంలో భాగంగా జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్ 2024 అక్టోబర్ 11న ఏర్పాటైంది. ఈ కమిషన్ రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించింది. మొత్తం 8,681 విజ్ఞప్తులు అందాయి. అన్నింటినీ కూలంకషంగా పరిశీలించి ఎస్సీలలోని 59 కులాలకు న్యాయం జరిగే విధంగా కమిషన్ గ్రూప్ 1, 2, 3 కేటగిరీలుగా విభజించి అనేక అంశాలను పొందుపరిచి సిఫార్సులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. గ్రూప్–1 కింద సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చింది. ఎస్సీల్లో వీరు 3.288 శాతం, వీరికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫార్సు చేసింది. గ్రూప్–2లో మధ్యస్థంగా రిజర్వేషన్ల ఫలాలు పొందిన 18 కులాల్లోని 62.74 శాతం మందికి 9 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, గ్రూప్ 3లో రిజర్వేషన్ల ప్రయోజనం పొందిన 26 కులాలకు చెందిన 33.96 శాతం మందికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. ఈ మూడు గ్రూపుల్లో ఉద్యోగాల భర్తీకి అర్హులు లేకపోతే క్యారీ ఫార్వర్డ్ అవుతాయి. కమిషన్ సూచించిన నాలుగు సిఫార్సుల్లో మూడింటికి పచ్చజెండా ఊపిన రేవంత్ సర్కార్.. క్రీమీలేయర్ విధానాన్ని అమలుచేయాలన్న సిఫార్సులను తిరస్కరించింది. మూడు దశాబ్దాలకు పైగా సాగిన పోరాటం.. తమ జాతి హక్కుల కోసం ఉద్యమించి, జీవితాలను పణంగా పెట్టిన త్యాగధనులకు సముచిత న్యాయం జరిగింది. అంతకు ముందు సుప్రీంకోర్టులో ఎస్సీ రిజర్వేషన్ల అంశంపై వచ్చిన తీర్పులోను సీఎం రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనతి కాలంలోనే అన్ని వర్గాల ప్రశంసలు అందుకున్నారు. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో కాస్మోటిక్ డైట్ చార్జీల పెంపుదల, 5000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం, రైతు కమిషన్, విద్యా కమిషన్, మహిళా కమిషన్, నూతన ఉస్మానియా దవాఖానా, చేనేత రుణమాఫీ, రైతు రుణమాఫీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వంటి వాటితో పాటు ఉపకులపతుల నియామకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు అవకాశాలు, 55వేల ఉద్యోగాల భర్తీ, ఆర్ఆర్ఆర్ వంటి రోడ్ల నిర్మాణాలు, ఫ్యూచర్ సిటీ పేరుతో మరో నూతన నగర నిర్మాణం... ఇలా తన దూరదృష్టితో తెలంగాణ దళిత బహుజన బతుకులు మారటానికి కృషి చేస్తున్నారు. పది తరాలు గుర్తుండేలా రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న దళిత బహుజన సంక్షేమాలు ముమ్మాటికీ మేలుమలుపు. అందుకే మా జాతులకు సీఎం రేవంత్‌రెడ్డి దళిత బహుజన బంధువే. ఫిబ్రవరి 4 సోషల్ జస్టిస్ డేగా పాటిస్తాం.

• పున్న కైలాష్ నేత
టీపీసీసీ జనరల్ సెక్రటరీ

ప్రరవే 16వ వార్షిక సదస్సు

లౌకిక ప్రజాస్వామిక విలువలని కార్పొరేట్ ఫాసిస్ట్ శక్తుల నుంచి కాపాడుకోడానికి కావలసిన నైతిక ధైర్యాన్ని పోగుచేసుకొనటానికి అంబేడ్కర్ ఆలోచనలు ఉపయోగపడతాయన్న నమ్మకంతో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) అంబేడ్కర్ రచనల అధ్యయనం మొదలుపెట్టింది. గత డిసెంబర్ 22 నుంచి ప్రతి ఆదివారం 'అంబేడ్కర్ ఆలోచనల తాత్వికతపై రెండు ప్రసంగాలతో అంతర్జాల కార్యక్రమం ప్రారంభించింది. ఇది 2025 జూన్ వరకూ సాగుతుంది. ఈ ప్రయత్నం మరింత సమగ్రం కావడం కోసం ప్రరవే 16వ వార్షిక సదస్సు 'తెలుగు సాహిత్యం–అంబేడ్కర్ ప్రభావం' అన్న అంశాన్ని ఎంచుకుంది. అంబేడ్కర్ ఆలోచనల వెలుగులో తెలుగు సాహిత్యాన్ని విలువకట్టటం అంటే అది ఎంత ప్రజాస్వామికం అయిందో తెలుసుకొనటమే అవుతుంది. ఈ నెల 8, 9 తేదీలలో సిద్దిపేటలోని విపంచి కళానిలయం, బోయి విజయ భారతి ప్రాంగణంలో సదస్సు జరగనున్నది. తొలిరోజు నందిని సిధారెడ్డి, అల్లం నారాయణ, ఆచార్య మధుజ్యోతి, సిద్దెంకి యాదగిరి, ఆచార్య బన్న అయిలయ్య, డా. కోయి కోటేశ్వరరావు, డా. గంధం అరుణ, డా. గుంటూరు లక్ష్మీనరసయ్య, కాత్యాయనీ విద్మహే, తిరునగరి దేవకీదేవి పాల్గొంటారు. మరుసటి రోజు పసునూరి రవీందర్, కె. రంగాచార్య, నరేష్ కుమార్ సూఫీ పాల్గొంటారు.

–ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



'స్థానికం'లో బీసీల హవా!



కులగణన పూర్తయింది. 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,46,955మంది జనాభా ఉండగా.. అందులో బీసీలు 14,28,043మంది ఉన్నట్టు గుర్తించారు. నాడు బీసీ జనాభా 40శాతానికి పైగా ఉన్నట్టు లెక్కల్లో తేలగా.. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో ఆ సంఖ్య మరింత పెరిగి.. 45శాతానికిపైగా బీసీ జనాభా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర సర్కారు వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెబుతోంది. అందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా బీసీలకు ఇచ్చిన స్థానికసంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల హామీ అమలుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అదే సమయంలో తమకిచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ బీసీ సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటిన విషయాలపై విస్తృత చర్చ జరుగుతోంది. నాడు 22శాతమే రిజర్వేషన్ ఉన్నా.. కేటాయించిన స్థానాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లోనూ వారు పైచేయి సాధించారు. ఇక ఈసారి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీల ప్రాతినిథ్యం మరింత పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో వారిదే పైచేయి

- పెరిగిన జనాభాతో ఈ సారి రెట్టింపు కానున్న రిజర్వేషన్ కోటా
- నాడు 22శాతం సీట్లు.. ఇప్పుడు 42శాతం అమలైతే పెరగనున్న ప్రాతినిథ్యం
- పోయిన ఎన్నికల్లో పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నెగ్గిన వైనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల్లో సత్తా
- మానుకోటలో జడ్పీటీసీ రిజర్వుకాకున్నా రెండు జనరల్ స్థానాలు కైవసం
- గిరిజనులు అధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీ సీట్లకు కోత

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కుల గణన పూర్తయి.. బీసీ జనాభా లెక్కలు తేలడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. కులగణన నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభాలో సగానికి పైగా బీసీలున్నారని స్పష్టత రాగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ సారి కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. అయితే గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో 22శాతమే రిజర్వేషన్ అమలు చేసినా.. వారిదే హవా కనిపించింది. చాలా జనరల్ స్థానాల్లో బీసీ సామాజిక వర్గ అభ్యర్థులు సత్తా చాటి విజయం సాధించారు. నాటి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ చైతన్యం ప్రదర్శించిన బీసీలు.. ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నిలిచారు. పంచాయతీలతో పాటు మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో విజయం సాధించి సత్తా చాటారు.

స్థానికంలో కోటాపై బీసీల ఫైట్..

వచ్చే నెలలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కాగా, తాజాగా మునిసిపల్ పాలక వర్గాల గడువు కూడా తీరింది. దీంతో స్థానిక సంస్థలు అన్ని కూడా ఇంచార్జ్ అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం మార్చి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో బీసీ కులాల నుంచి రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ కులగణన కూడా పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. బీసీ ఈ గ్రూపుతో కలిపి బీసీలు రాష్ట్రంలో 50శాతానికి పైగా ఉండటంతో 42శాతానికి పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను బీసీ సంఘాలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 36,46,955మంది జనాభా ఉండగా, ఇందులో

మిగతా 7వ పేజీలో...



విచారణ జరుపుతున్న కమిటీ సభ్యులు

ఉదయం నుంచి సాయంత్రం దాకా..

ఎంజీఎంలో విచారణ కమిటీ తనిఖీలు

పరిపాలన అధికారి వ్యవహారాలపై ఆరా

వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశం

'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఎంక్వైరీ

6

కులగణన సర్వేపై చర్చకు సిద్ధమా?

- బీఆర్ఎస్ పార్టీవి దుష్ప్రచారాలు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ముల్కనూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపనలో మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేపై అసెంబ్లీలో చర్చకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమా..? అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. శుక్రవారం ముల్కనూర్‌లో పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహప్రతిష్టాపక కార్యక్రమానికి మంత్రి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని ప్రతీ ఇంటికి వెళ్లి కుల గణన సర్వే చేశామన్నారు. లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు కుల గణన సర్వేలో పాల్గొని 1.12కోట్ల ఇళ్లకు సర్వే నిర్వహించారన్నారు. రాష్ట్రంలో 51శాతం బీసీలు ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ చెబుతోందని, ఈ విషయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి బీఆర్ఎస్ నాయకులు రావాలని డిమాండ్ చేశారు. బీసీ అయినందుకే ఈటల రాజేందర్‌ను పార్టీ నుంచి గెంటివేశారని మంత్రి పొన్నం ఆరోపించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్, శాసనసభ పక్ష మంత్రిగా హరీష్‌రావులు పదవులు అనుభవించారన్నారు. ఒక్క బీసీ కూడా వారు దగ్గరకు తీయలేదన్నారు. కనీసం బీసీలకు న్యాయం చేయని బీఆర్ఎస్ నాయకులు ఏ హక్కుతో మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జరిగితీరుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒక కమిషన్ వేసి నివేదిక తెప్పించుకొని ఎస్సీ వర్గీకరణ జరుపుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి కోసం ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉంటే అక్కడి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఇట్టబోయిన నాగరాజు, చుంచు చంద్రమౌళి, అయిలయ్య, కూన పెద్ద కనకయ్య, కూన చిన్నకనకయ్య, పీసర రాజు, పీసర కనకయ్య, దొంతరవేణ స్వామి, దొంతరవేణ రవి, రాంబాబు తదితరులు శాలువాతో సన్మానించారు.



డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ సోదాలు

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు

అద్దె ఇల్లు, ఆఫీసు, జగిత్యాల, హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు

పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణా శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉప కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని పలివేల్పుల రోడ్డులోని దుర్గాకాలనీలో నివాసం ఉండే కిరాయిఇంటితో పాటు భీమారంలోని ఆర్టీఏ కార్యాలయంలోని తన చాంబర్, హైద్రాబాద్‌లోని సొంత ఇళ్లు, స్వగ్రామమైన జగిత్యాల, కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో ఉదయం 6 గంటల నుంచే సోదాలు నిర్వహించినట్లు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని విల్లాలతో పాటు ప్లాట్స్, ఇతరత్రా పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని, అన్నింటినీ పరిశీలిస్తున్నామన్నారు. పరిశీలన తర్వాత ఏసీబీ డీజీపీ స్వయంగా వివరాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు.

కాగా, పుప్పాల శ్రీనివాస్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా, ఎంవీఐగా పనిచేసినట్లుగా రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే శ్రీనివాస్ ఉద్యోగ విరమణ ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, డీటీసీ ఇంట్లో సోదాలతో రవాణా శాఖలోని ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ కార్యాయాల్లో ఎక్కడ చూసినా ఏసీబీ అధికారుల సోదాలపైనే అధికారులు, సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.

నగరంలో భూగర్భ నీటి వనరుల స్థాయి గుర్తించండి

- సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ అడిషన్ సెక్రెటరీ తారా
- ఢిల్లీ నుంచి బల్దియా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బల్దియా అధికారులు, ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో భూగర్భనీటి వనరుల స్థాయి గుర్తించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎంవోహెచ్‌యూఏ) అడిషనల్ సెక్రెటరీ తారా కోరారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ క్యాంపు కార్యాలయం నుంచి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తారా మాట్లాడుతూ.. గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎంవోహెచ్‌యూఏ, కేంద్ర ప్రభుత్వ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఎన్ఆర్ఎస్‌సీ, ఇస్రో సహకారంతో దేశంలో 10 నగరాలను ఎంపిక చేశామన్నారు. విజయనగరం, భువనేశ్వర్, ఈటానగర్, బుర్హాన్ కోబ్రా, భోపాల్, వరంగల్, ఉన్నావ్, మైసూర్, నాగ్‌పూర్ పట్టణాలలో అమృత్ 2.0 ఎఎస్ఎంఎస్ సిస్టం కింద మొదటి దశని ఇప్పటికే పూర్తి చేశామన్నారు. నగరం యొక్క ఆధారిత శాస్త్రీయ డేటాబేస్ కొరవతో అమృత్ నగరాల్లోని పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల కోసం అంతరిక్ష ఆధారిత డేటాబేస్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా పట్టణ జలశయాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ రీచార్జ్ పాయింట్లను గుర్తించాలని తారా చెప్పారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. బల్దియాకు చెందిన ఇంజనీర్లు, పబ్లిక్ హెల్త్ అధికారుల ద్వారా పోర్టల్‌ను ఉపయోగిస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు రంగారావు, రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డితో పాటు పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థుల పరస్పర దాడులు

ఇంటిగ్రేటెడ్ స్టూడెంట్స్ మధ్య గొడవ

ఆస్పత్రికి బాధిత విద్యార్థుల తరలింపు

పోలీసుల అదుపులో పలువురు విద్యార్థులు

సమీక్షించిన రిజిస్ట్రార్ రామచంద్రం

22 మందిపై కేయూ పీఎస్‌లో కేసులు

6



హాస్టల్ ఎదుట విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం, ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, సీఐ రవికుమార్



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, కళాశాల గాయకులు

సంగీతంలో ఓలలాడిన కళాక్షేత్రం

7

ఘనంగా విద్యారణ్య సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ సంబురం

వేడుకలు ప్రారంభించి కీర్తనలు ఆలపించిన కలెక్టర్ ప్రావీణ్య

సంగీతం, నృత్య మేళవింపులతో హోరెత్తిన కాళోజీ ఆడిటోరియం

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి

6



వెంకటమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్‌రెడ్డి

అరూరికి ఎమ్మెల్యేల పరామర్శ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను శుక్రవారం వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కెఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లులో ఆమె చిత్ర పటం వద్ద వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలతో పాటు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగల్ జిల్లా రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకన్న, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీం - మసూద్, తదితర నేతలు నివాళులర్పించారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి జైలు శిక్ష

ధర్మసాగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై భార్యను హత్య చేసిన కేసులో నేరం రుజువైనందున నిందితుడిని 8ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి సీహెచ్ రమేష్‌బాబు శుక్రవారం తీర్పును చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన అలకుంట రాజు.. అదే మండలం ముప్పారం గ్రామానికి చెందిన గట్టమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. అయితే రాజు మద్యానికి బానిసై భార్య గట్టమ్మను నిత్యం వేధిస్తుండేవాడు. మద్యం కోసం డబ్బులు కావాలని ఆమెను విచక్షణారహితంగా కొట్టేవాడు. ఈ క్రమంలో పలుమార్లు గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు చేశారు. అయినప్పటికీ రాజులో మార్పు రాలేదు. ఇదిలా ఉండగా, 2019 ఆగస్టు 7న నారాయణగిరిలో రాజు తన భార్య గట్టమ్మను మద్యానికి డబ్బులు కావాలని అడిగాడు. గట్టమ్మ తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఆమె మెడలో ఉన్న తాళిని ఇవ్వాలని వేధించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజు ఆగ్రహంతో ఇంట్లో ఉన్న మంచం కోడుతో తన భార్య తలపై బలంగా కొట్టాడు. దీంతో గట్టమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిపై హత్యానేరం కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున జిల్లా జడ్జి నిందితుడు రాజుకు 8 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

వివిధ నేరాల్లో పలువురి అరెస్టు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ పీఎస్ పరిధిలోని హోల్‌సేల్ కాంప్లెక్స్ లారీ అడ్డాలో 18 మంది మట్కా ఆ డుతూ పట్టుబడ్డట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.22,435 నగదు, 18 సెల్‌ఫోన్‌లను స్వాధీ నం చేసుకొని తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. అలాగే సంగెం పీఎస్ పరిధిలోని పల్లారిగూడ శివా రులో పేకాటడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి నుంచి రూ.14,540 నగదును స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించామని ఏసీపీ మధు సూదన్ తెలిపారు. కాగా, పరకాల పీఎస్ పరిధిలోని నర్సక్కపల్లి శివారులో రూ .1,56,000 విలువ చేసే 60 క్వింటాళ్ల పీడీ ఎస్ రైస్‌ను పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా పోచారం శివారులో 26 క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హనుమకొండ పీ ఎస్ పరిధిలోని న్యూరాయపురలో 7 క్వింటా ళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

16మంది విద్యార్థులకు అస్వస్థత

- మానుకోట జిల్లా దామరవంచ గురుకులంలో ఘటన
- రాత్రి భోజనం తర్వాత కడుపునొప్పి, వాంతులు
- తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురిని గూడూరు ఆస్పత్రికి తరలింపు
- విద్యార్థులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు



గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సపొందుతున్న విద్యార్థులు

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో డైట్ చార్జీలు పెంచి.. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ మార్చినప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పురాలేదు. నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందక మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు శుక్రవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. అందులో నలుగురు తీవ్రంగా, 12 మంది స్వల్ప అనారోగ్యానికి గురవగా.. వారిని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాంతో తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం గురుకులంలోని సుమారు 530మంది విద్యార్థులకు స్నాక్స్ కింద గుడాలు.. రాత్రి భోజనంలో అన్నంతో పాటు కాకరకాయ కూర, సాంబారు వడ్డించారు. వారిలో 16 మంది విద్యార్థులకు అర్ధరాత్రి దాటాక కడపునొప్పి, వాంతులు, వీరేచనాలు కావడంతో విషయం తెలుసుకున్న గురుకుల జూనియర్ సీనియర్ ప్రిన్సిపాల్ రమేష్, జూనియర్ ప్రిన్సిపాల్ రాజమౌళి, వార్డెన్ అప్పారావు, ఏఎన్ఎం, ఉపాధ్యాయుల సహాయంతో తీవ్ర అస్వస్థతకు గురైన లాకావత్ రాహుల్, గుగులోతు సాయిప్రసాద్, బానోత్ యాకూబ్, బానోత్ అనిల్‌ను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కలుషిత ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న వెల్లడించారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ గూడూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆయనే స్వయంగా స్టెతస్కోప్‌తో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కూడా విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకులాలలో ఫుడ్‌పాయిజన్ పరంపర కొనసాగుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు గురుకులాల బాట పట్టినా వసతిగృహాల్లో ఎలాంటి మార్పురావడం లేదని మండిపడ్డారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు..

దామరవంచ గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, ఎంపీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ఆర్‌ఐ మల్లయ్య వేర్వేరుగా గురుకులాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను పరామర్శించారు. ఇక గురుకుల పాఠశాలలో అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, గురుకుల పరిసరాలను పరిశీలించారు. అయితే సదరు గురుకుల ప్రిన్సిపాల్ హేమంత్ సెలవులో ఉన్నారు.

కేయూలో విద్యార్థుల పరస్పర దాడులు

- ఇంటిగ్రేటెడ్ స్టూడెంట్స్ మధ్య గొడవ
- పలువురికి గాయాలు
- ఆస్పత్రికి బాధిత విద్యార్థుల తరలింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, సీఐ రవికుమార్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం కేయూ కామన్ మెస్‌లో భోజనం చేసే సమయంలో ఇంటిగ్రేటెడ్ మొదటి, రెండో ఏడాది విద్యార్థుల మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దిగారు. దీంతో వర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో పాటు చేతికందిన వస్తువులతో దాడులు చేసుకోవడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మొదటి ఏడాది విద్యార్థి కన్నుపై, రెండో ఏడాది విద్యార్థి వీపుపై, మరో విద్యార్థికి కడుపు, కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలాయి. అలాగే మొదటి ఏడాది స్టూడెంట్ గొడవ దాటికి మూర్చకు గురై కుప్పకూలాడు. పక్కనే ఉన్న విద్యార్థులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో అతడు కాస్త ఉపశమనం పొందాడు.

అయితే గొడవ కామన్ మెస్‌లో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగింది. ఓ విద్యార్థి మరో విద్యార్థిని 'ఏందిరా బే.. అంటూ తీవ్రస్వరంతో బెదిరించడంతో ముదిరింది. కోపోద్రిక్తులైన విద్యార్థులు అక్కడే పరస్పరం ఘర్షణ పడి పిడిగుద్దులకు దిగారు. అక్కడున్న మెస్ సిబ్బందితో పాటు తోటి విద్యార్థులు వారిని అడ్డుకుని శాంతింప చేశారు. అనంతరం కామన్ మెస్‌లో భోజనం చేస్తుండగా సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి చోటు చేసుకున్న ఘర్షణ సాయంత్రం వారుంటున్న జీడీ-2 హాస్టల్‌కు చేరింది. అక్కడ మళ్లీ విద్యార్థులు ఘర్షణ పడ్డారు. మెస్‌లో జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకుని వారుంటున్న జీడీ-2 హాస్టల్‌లో తమ తోటి విద్యార్థులను కలుపుని మళ్లీ రెండోదఫా హాస్టల్ ఎదుట విద్యార్థులు ఘర్షణకు దిగారు. కోపంతో పిడిగుద్దులకు పాల్పడ్డారు. దాడుల్లో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు కన్నుకు, కడుపులో, కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలాయి. విద్యార్థుల గొడవ విషయం తెలుసుకున్న వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి హుటాహుటిన జీడీ-2 హాస్టల్‌కు చేరుకున్నారు. గొడవలో గాయపడిన విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి ఘర్షణ వివరాలను విచారించారు. బాధిత విద్యార్థులను పరామర్శించారు. దాడులు వద్దంటూ వారిని అక్కడికక్కడే తీవ్రంగా హెచ్చరించారు. గొడవకు దిగిన ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు 15 మందితో పాటు మరో నలుగురు స్టూడెంట్ యూనియన్లకు చెందిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేయూ వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే దాడుల్లో గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గొడవలకు బాధ్యులైన విద్యార్థులలో ఇంటిగ్రేటెడ్ మొదటి సంవత్సరానికి చెందిన 8 మంది, సెకండ్ ఇయర్‌కు చెందిన 6మందితో పాటు మరో నలుగురు స్టూడెంట్ లీడర్లకు కేయూ సీఐ ఎస్.రవి కుమార్ నేతృత్వంలో వర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కాగా, పరస్పర దాడుల నేపథ్యంలో క్యాంపస్‌లో పోలీసులను మోహరించారు. వర్సిటీ క్యాంపస్‌లో గొడవలు పునరావృత్తం కాకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల గొడవలు, పరస్పర దాడులు, ఘర్షణలకు కారణమైన విద్యార్థులపై వర్సిటీ అధికారులు కఠిన చర్యలకు దిగనున్నారు. గొడవలు, దాడులకు బాధ్యులైన విద్యార్థులను శనివారం వర్సిటీ ఉన్నతాధికారుల విచారణ అనంతరం సస్పెండ్ చేసే అవకాశాలున్నాయి.

22 మందిపై కేసులు


కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు పరస్పరం ఘర్షణ పడి దాడులకు దిగిన ఘటనలో 22 మంది విద్యార్థులపై కేసులు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్, ఎస్సై డి.రవీందర్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ కోర్సు మొదటి ఏడాది విద్యార్థులు 11మందితో పాటు ఏబీవీపీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు, ఇంటిగ్రేటెడ్ రెండో ఏడాదికి చెందిన 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పరస్పరం దాడుల ఘటనలో విద్యార్థులు ఒకరిపై మరొకరు చేసిన ఫిర్యాదుల మేరకు రెండు వర్గాల విద్యార్థుల మీద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.



పాలకుర్తిలోని ఫంక్షన్ హాల్‌లో విరిగిపడిన కుర్చీలు

పెళ్లి విందులో ఘర్షణ

భోజనం వద్ద గలాటా..
కుర్చీలు విసురుకున్న బంధువులు
పలువురికి గాయాలు.. పాలకుర్తిలో ఘటన



ఘటనలో గాయపడిన బాధితులు

పాలకుర్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పెళ్లి భోజనాల వద్ద జరిగిన ఘటనలో వధూవరుల బంధువులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నఘటన శుక్రవారం పాలకుర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జఫర్‌గడ్ మండలంలోని ఓటులాపురంనకు చెందిన సొర్రి స్వరూప, వీరస్వామి కూతురు మాధవిని రాయపర్తి మండలంలోని కేశవాపురంనకు చెందిన తాళ్లపల్లి ఉమ, శ్రీనివాస్ గౌడ్ కుమారుడు శ్రావణ్ గౌడ్‌కు వివాహం జరిగింది. కాగా, భోజనాలు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో ప్రారంభమయ్యాయి. విందు ఆలస్యం కావడంతో ఒకేసారి బంధువులంతా భోజనం చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో స్వల్పవాగ్వాదం జరిగింది. ఇరుబంధువుల మధ్య మాటామాటా పెరగడంతో సమస్య మరింత పెరిగింది. ఆగ్రహంతో ఒకరిపై ఒకరు కుర్చీలు తీసుకున్నారు. బెంచీలను కాళ్లతో తన్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని బంధువులు పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల బంధువులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి
- 14న రాష్ట్ర బంద్‌కు పిలుపు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమేనని, వర్గీకరణ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దండ్రె రమేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీరణ అంశాన్ని వెనక్కి తీసుకోకపోతే మాల సామాజిక వర్గం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతుగా నిలిస్తే.. మాల సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిందని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 14న తెలంగాణ రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తున్నట్లు రాంమూర్తి ప్రకటించారు. మాల ఉద్యోగులు, మేధావులు, యువకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నేతలు మన్నె కరుణాకర్, పసుల అశోక్ చక్రవర్తి, సాదు రాజశేఖర్, ఉసిల్ల రాంబాబు, కొత్తపల్లి యాదగిరి, జక్కుల రజాక్, దాసరి సాగర్, సాదనపల్లి వేణు, బండెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న డాక్టర్ పసుల రాంమూర్తి

'తెలుగు వెలుగు' అధ్యక్షుడిగా డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు సాహితీ వేదిక, జాతీయ స్వచ్ఛంద సంస్థకు వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లను నియమించినట్లు సంస్థ అధ్యక్షుడు పాలోజు రాజ్‌కుమార్ ప్రకటించారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు తెలుగుభాషోపాధ్యాయ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కవి, రచయిత అయిన వెంకటేశ్వర్లను ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ గడ్డం వెంకన్న, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్‌తోపాటు అనేకమంది సాహితీ, భాషాప్రియులు అభినందించారు.

రౌడీషీటర్లలో మార్పు రాకపోతే కఠినంగా శిక్షిస్తాం..

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లలో మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలోని 11 మంది రౌడీషీటర్లకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తమ పిల్లలు, తండ్రి అడుగుజాడల్లో నడిచే నేరస్తులుగా తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. భూకబ్జాలు, ప్రజలను భయ పెట్టడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వ్యక్తులను చట్ట పరంగా శిక్షిస్తామన్నారు. ప్రతీ ఒక్క రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందని, మార్పు కోసం ప్రయత్నం చేసే వారికి సమాజ సేవ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. మార్పు వచ్చిన వారిపై రౌడీషీట్ తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సార్ల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయం నుంచి సాయంత్రం దాకా..

ఎంజీఎంలో విచారణ కమిటీ తనిఖీలు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఓ పరిపాలన అధికారిపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. విచారణ కమిటీ సభ్యులు శుక్రవారం ఉదయం ఎంజీఎం చేరుకున్నారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో బాధితుల నుంచి లిఖితపూర్వకంగా స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ విచారణ కొనసాగింది. నర్సింగ్ అధికారులు, పారామెడికల్ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు, మినిస్టీరియల్ ఉద్యోగులను విచారించారు. ఆంధ్రజ్యోతి కథనంలోని ప్రతీ అంశంపై ఫైళ్లను పరిశీలించారు. మందుల కొనుగోలు, అభ్యుదయ సొసైటీ జీతాలు చెల్లించని విధానంపై ఆరా తీశారు. ఈ నివేదికను రాష్ట్ర వైద్య విద్య సంచాలకులకు అందించనున్నారు. విచారణ కమిటీ చైర్మన్, అడిషనల్ డీఎంఈ, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్ దాస్, సభ్యులు జనగామ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాల్‌రావు, జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ డైరక్టర్ బాలాజీ విచారణలో పాల్గొని వివరాలు సేకరించారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆంధ్రజ్యోతి కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణకు ఆదేశించడంతో విచ్చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇల్లందలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన లేల్లల యాకానాథం(38) మద్యానికి బానిసై తరుచూ ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. దీంతో భార్య తన కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో మనస్తాపానికి గురై మద్యం మత్తులో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2303	2100
పల్లికాయ (సూక)	6500	4600
పల్లికాయ (పచ్చిది)	4450	3100
కందులు	6921	5540
పెసళ్లు	6859	5645
పత్తి	6980	5800
పసుపు (కాడి)	8118	7425
పసుపు (గోల)	7002	6703
తేజ మిర్చి	13400	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14800	11500
యూఎస్341ఏసీ	14000	11500
యూఎస్ 341 కొత్తది	-	-
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మహా ఘట్టానికి అంకురార్పణ

- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- 42 ఏళ్ల తర్వాత ఘనంగా వేడుకలు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వరం ఆధ్యాత్మిక శోభితంగా మారింది. 42 ఏళ్ల తర్వాత జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు ఈ మహాఘట్టం జరగనుండగా తొలిరోజైన శుక్రవారం వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అర్నాపురం వేద పండితుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు తెల్లవారుజామున మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య కలశాలతో కాళేశ్వరాలయం నుంచి బయల్దేరి త్రివేణి సంగమం గోదావరికి చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి సన్నిధానికి చేరుకున్నారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంగళవాయిద్యాలతో వేద స్వస్తి వాచకాలు, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, చతుర్లింగ భద్ర సర్వతో భద్ర మండప దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీపారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం 3.30నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, చండీ సప్తశతి పారాయణం, నవర్తన మూల మంత్ర జపాలు, సహస్ర ఘటస్థాపన పూజలు, ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి పారాయణం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రోచ్చారణలతో మార్మోగిన ఆలయ పరిసరాలు

కాళేశ్వరాలయంలో 1982 కుంభాభిషేకం జరిగింది. 42 ఏళ్ల తర్వాత ఈ వేడుకలు వైభవంగా జరుగుతుండగా.. మంచిర్యాల జిల్లా అర్నాపురం గ్రామానికి చెందిన మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు, కాళేశ్వరాలయ అర్చకులతో మహా కుంభాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత ఇలాంటి కార్యక్రమం జరగడం ఆలయానికి, ఊరికి శుభసూచకమని భక్తులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా కుంభాభిషేకం



గోదావరి నుంచి కలశాల్లో జలాలు తీసుకొస్తున్న అర్చకులు, వేద పండితులు

నేడు తుని పీఠాధిపతి రాక

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాషేకానికి ఆదిశంకరాచార్యుల ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని తపోవనానికి చెందిన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి హాజరుకానున్నారు. శనివారం జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.



వేద మంత్రాలతో క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

పటిష్ఠ చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. 9న జరిగే మహా కుంభాభిషేక ముగింపు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, రద్దీకి తగట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి ఘాట్ వద్ద స్నాన ఘట్టాలను పరిశీలించిన కలెక్టర్ భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించనున్న దృష్ట్యా వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల వాహనాల గోదావరి ఘాట్ వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పార్కింగ్‌లోనే భక్తులు వాహనాలను తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కుంభాబిషేకంలో పారిశుధ్య నిర్వహణకు 70 మంది కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. నాలుగు సెక్టార్లుగా విభజించి పారిశుధ్య నిర్వహణను చేపడుతున్నట్టు చెప్పారు. అత్యవసర సమయంలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షించాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు మహదేవ పూర్‌లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బెడ్లు కేటాయించినట్లు తెలిపారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పటిష్ఠ బందోబస్తును నిర్వహించాల న్నారు. నిర్దేశిత ప్రాంతం దాటి భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా నియంత్రించాలన్నారు. 9వ తేదీన ఆలయ ప్రధాన ద్వారం వద్దకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకావం ఉందని, అందుకు తగిన బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈవో మహేష్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

మహా కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రుల రాక

రేపు జరిగే కార్యక్రమాలకు హాజరు



మంత్రి పొన్నం ప్రభాకర్ | మంత్రి కొండా సురేఖ | మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో జరుగుతున్న కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రులు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు ఈ వేడుక జరుగుతుండగా చివరి రోజు ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మంత్రులతోపాటు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరుకానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి ఉండగా మంత్రులు, ఎంపీ నిబంధనలకు కట్టుబడే ఈ వేడుకల్లో పాల్గొనన్నుట్టు తెలిపారు.

50 ఏళ్లకు కలుసుకున్నారు..

నిట్‌లో 1970- 75 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 1970-75 సంవత్సరం స్వర్ణోత్సవ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిట్ క్యాంపస్‌లోని బోస్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో 50 ఏళ్ల కిందట చదువుకున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి తమ కళాశాల మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కళాశాలలో చదువు ముగించుకొని బయటకు వచ్చిన తర్వాత అయిదు దశాబ్దాల్లో తాము సాధించిన విజయాలను పరస్పరం పంచుకున్నారు. ఆ నాడు తాము చదువుకున్న తరగతి గదులను, క్యాంపస్‌లో తాము తిరిగిన ప్రదేశాలను మరోసారి సందర్శించారు. కళాశాల అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించిన ప్రముఖులు రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ ఎస్. శిరీష్ డీన్ (సంశోధన, అభివృద్ధి) ప్రొఫెసర్ ఎ.వేణు వినోద్ (డీన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్) వరంగల్ నిట్ అల్యూమినీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రామ తదితరులను ఈ సందర్భంగా సత్కరించారు.



వరంగల్ నిట్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 50ఏళ్ల నాటి స్నేహితులు

స్థానికంలో బీసీల హవా!

5వ పేజీ తరువాయి



బీసీలు 14,28,043మంది ఉన్నట్లుగా గుర్తించారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అత్యధికంగా గిరిజనులున్నారు. అయినా ఉమ్మడి జిల్లాల్లో బీసీలు 40శాతానికి పైగా ఉన్నట్టు తేలింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కల గణనలో ఉమ్మడి జిల్లాలో బీసీల జనాభా మరింత పెరిగిందని, 45శాతానికి పైగా ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతున్నాయి. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 22శాతం రిజర్వేషన్ కల్పించారు. అయినా అవకాశాన్ని బట్టి జనరల్ స్థానాల్లో పోటీ చేసి, 35 నుంచి 40శాతం వరకు బీసీలు ఎన్నికల్లో సత్తా చాటారు. రాజకీయ చైతన్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తోనే గత ఆదివారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

2019 ఎన్నికల్లో పెరిగిన బీసీల ప్రాతినిథ్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీలు రాజకీయంగా చైతన్యం అవుతున్నారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కేవలం 22శాతమే రిజర్వేషన్లు కల్పించింది. అయినప్పటికి జనరల్ స్థానాల్లో పోటీ చేసి బీసీలు సత్తా చాటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,167 జీపీలకు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా అధారంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినా ఈ రిజర్వేషన్‌తో అవకాశం వచ్చిన సర్పంచ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. మొత్తం 1,167 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. అదనంగా 200 జనరల్ స్థానాల్లో బీసీలు పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరమయ్యాయి. అలాగే ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 764 స్థానాలుండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. తమకు కేటాయించిన స్థానాలకంటే రెండింతలు అధికంగా విజయం సాధించారు. మొత్తంగా 36.3శాతం సీట్లను బీసీలు కైవసం చేసుకుని రాజకీయంగా ఎంతో చైతన్యవంతులో చాటి చెప్పారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70జడ్పీటీసీలు ఉండగా, 9జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20మంది జడ్పీటీసీలు బీసీలు ఎన్నికయ్యారు. కోటకంటే అధనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు.

జనరల్ కోటాలో బీసీల పట్టు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు తమ కోటాకు మించి విజయం సాధించారు. గిరిజనులు అధికంగా ప్రాంతాల్లో అధిక సీట్లు గిరిజనులకే కేటాయించారు. దీంతో ఆ జిల్లాల్లో బీసీల జనాభా ఆధారంగా సీట్లు లభించాయి. మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా గిరిజన జనాభే ఉంది. ఈ జిల్లాలో 16మంది జడ్పీటీసీ స్థానాలున్నాయి. అయితే ఈ జిల్లాలో అధికంగా ఎస్టీలు ఉండటంతో పాటు ఆరు మండలాల్లో పెసా చట్టం అమల్లో ఉంది. గిరిజన ప్రాబల్య ప్రాంతం కావటంతో 2019లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వేషన్ లేదు. అయినప్పటికి ఇక్కడ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. ఇదే జిల్లాలో ఎంపీటీసీల్లోనూ బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు ఐదు స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, అప్పటి ఎన్నికల్లో మరో 32ఎంపీటీసీ జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. దాంతో మహబూబాబాద్ గిరిజన జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు.

వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వుడు చేశారు. మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీ సర్పంచ్‌లు విజయం సాధించారు. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల్లోనూ బీసీలు అధికంగా ఉన్నారు.

2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీసీల ప్రాతినిధ్యం ఇలా

	వరంగల్	హనుమకొండ	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు
గ్రామ పంచాయతీలు	325	210	281	461	240	150
బీసీ రిజర్వుడు	48	46	39	22	51	06
మొత్తం బీసీలు నెగ్గినవి	63	68	95	67	100	29
మొత్తం ఎంపీటీసీలు	134	130	128	198	102	72
బీసీ రిజర్వుడు	35	30	17	5	23	25
మొత్తం బీసీలు నెగ్గినవి	53	63	55	37	43	26
మొత్తం జడ్పీటీసీలు	11	12	12	16	11	08
బీసీ రిజర్వుడు	01	03	01	00	02	02
మొత్తం బీసీలు నెగ్గినవి	05	05	01	02	04	03

సంగీతంలో ఓలలాడిన కళాక్షేత్రం

- ఘనంగా విద్యారణ్య సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవం
- వేడుకలు ప్రారంభించి కీర్తనలు ఆలపించిన కలెక్టర్ ప్రావీణ్య
- సంగీతం, నృత్య మేళవింపుతో హోరెత్తిన కాళోజీ ఆడిటోరియం

నేత్ర పర్వం



భద్రకాళి శేషును సత్కరిస్తున్న కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం నగరంలోని సంగీత ప్రియులతో ఓలలాడింది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన వేడుకల పరంపర.. రాత్రి 9గంటల వరకు కొనసాగుతూనే ఉంది. కళాకారులు, కళాభిమానులతో ఆడిటోరియం కిక్కిరిసింది. వరంగల్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య లాంఛనంగా జ్యోతి వెలిగించి స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం సంగీత ప్రపంచంలో ప్రముఖులైన వారి పంచరత్న కీర్తనల గోష్ఠి గానంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొనడమే గాక.. గాయనీ గాయకులతో కలిసి 'దుడుకు గల నన్నే దొర కొడుతూ..' అనే కీర్తనతో శృతి కలిపి అద్భుతంగా ఆలపించారు. ఆమె రెండు గంటల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న కలెక్టర్ పి. ప్రావీణ్య

స్వర్ణోత్సవాల వేళ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు, పండిట్ నారాయణ్ భాత్ఖండే, పండిట్ విష్ణు దిగంబర్ పలుస్కర్ ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పంచరత్న కీర్తలను ఆలపించిన ప్రముఖులలో జిల్లా కలెక్టర్‌తోపాటు ఆచార్య తిరుపతయ్య, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రముఖ విద్వాంసుడు వాసా గోపీనాథ్, భద్రకాళిశేషు, సింగారపు భాస్కర్, వొద్దిరాజు నివేదిత, సుహిత, ఉమ్మడి లక్ష్మణాచార్య, లాయక్, జియాహుద్దీన్, చిన్న, కుంట రాజు, పద్మజ తదితర అనేక మంది గాయకులు సంగీత కళాశాల కర్ణాటక గాత్ర ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పాల్గొని సంకీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా విద్యారణ్య సంగీత కళాశాల విద్యార్థులు ప్రభుత్వ గురుకులాల్లో ఉద్యోగాలు సంపాదించుకున్న సుహిత, శివలీల, నవ్య తదితర 8మందిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల పరంపరలో భాగంగా నగరంలోని ప్రముఖ నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌కుమార్, తాడూరి రేణుక, వెంపటి శ్రావణి, ఝాన్సీ, జయశ్రీ, పరమేశ్వర్, రుద్రవేణి, చైతన్య తదితరుల శిష్య బృందంతో ఒకదానివెంట ఒకటి సంప్రదాయ కూచిపూడి, భరత నాట్యాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. ఈ సందర్భంగా సంగీత కళాశాల పేరిణి నాట్యాచారులు గజ్జెల రంజిత్, నవ్యజ శిష్య బృందంచే అద్భుత పేరిణి నృత్య ప్రదర్శన కూడా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు సితార్ విద్వాంసులు జక్కు సత్యనారాయణ, హిందుస్థానీ గాత్ర విద్వాంసురాలు అనుమలు యోష, మృదంగ విద్వాంసులు ఏడిద భీంశంకర్, వయోలిన్ విద్వాంసులు చిన్ని కృష్ణ, కర్ణాటక గాత్ర విద్వాంసులు ఎస్.భాస్కర్ శిష్య బృందం కూడా ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.

కళాకారులు అభినందనీయులు

కళలకు కాణాచి అయిన ఓరుగల్లు నగరంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల కళాకారుల పాలిట గొప్ప వరమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కొనియాడారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులందరినీ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పేరుగడించిన ఈ కళాశాల విద్యార్థులెందరో జాతీయ స్థాయిలోనూ గొప్ప కళాకారులుగా పేరు గడించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఎంతో భాగ్యం

ఎందరెందరో ఉద్ధండులైన విద్వాంసుల ఆధ్వర్యంలో 52 వసంతాలు పూర్తి చేసుకున్న ఓరుగల్లు విద్యారణ్య సంగీత కళాశాలకు స్వర్ణోత్సవ వేళ తాను ప్రిన్సిపాల్‌గా ఉండడం ఎంతో భాగ్యమని ఈ కార్యక్రమాలను రూపొందించిన ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్ అన్నారు. తమ కళాశాలకు అన్ని వసతులు సమకూర్చితే మరింతగా కళాకారులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్, సాంస్కృతిక శాఖ సంచాలకుల సంపూర్ణ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్‌తోపాటు నగరంలోని సంగీత, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమ్మ రమాబాయి అంబేద్కర్ జయంతిని శుక్రవారం హనుమకొండ అశోక కాలనీలోని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) కార్యాలయంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మ రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. వెలివాడల తొలిపొద్దు అమ్మ రమాబాయి అంబేద్కర్ అన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, మేకల అనిత, అబ్రహం, బాబు, కవిత, సాగర్, రవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ శ్రేణులు

ప్లాస్టిక్ షాపులపై కొరడా

- హోల్‌సేల్, రిటైల్ షాపుల్లో విస్తృత తనిఖీలు
- రూ 1.20 లక్షలకు పైగా జరిమానాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వరంగల్‌లో ప్లాస్టిక్ షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న సీఎంహెచ్‌వో రాజారెడ్డి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ట్రైసిటీస్‌లో బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణాలపై మూకుమ్మడి దాడులు నిర్వహించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ప్లాస్టిక్ కట్టడి జరిగేనా?' అనే వార్తకు బల్దియా అధికారులు తీవ్రంగా స్పందించారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు శానిటేషన్ విభాగం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బొమ్మన రాజిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌ల పర్యవేక్షణలో రెండు ప్లాస్టిక్ నియంత్రణ బృందాలతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు రంగంలోకి దిగారు. కొన్నిచోట్ల సీఎంహెచ్‌వో రాజారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేశారు. కొందరు షాపుల యజమానులకు అవగాహన కల్పించడంతోపాటు మరి కొందరికి జరిమానా విధించారు. వరంగల్ చౌరస్తా నుంచి హనుమకొండ, కాజీపేట వరకు ప్రధానరహదారిపై ఉన్న ప్లాస్టిక్ దుకాణాలలో బల్దియా సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చాలాచోట్ల షాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నట్టు గుర్తించారు. వరంగల్ పిన్నవారిస్ట్రీట్, హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లో కొందరు షాపుల యజమానులు టన్నులకొద్దీ సరుకు దిగుమతి చేసి అక్రమంగా నిలువ చేసినట్టు గుర్తించారు. నగరం నుంచి గ్రామీణ ప్రాంతాలకు విక్రయించే షాపుల యజమానులను గుర్తించి హెచ్చరించారు. ప్లాస్టిక్ కట్టడి చేయకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శుక్రవారం ఒక్కరోజే ప్లాస్టిక్ షాపుల యజమానులకు రూ.1.20లక్షల జరిమానా విధించినట్టు రాజారెడ్డి తెలిపారు. ఈ తనిఖీలలో రెండు ప్రత్యేక ప్లాస్టిక్ నియంత్రణ బృందాలతోపాటు శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పోలెపాక అనిల్‌కుమార్, శ్యాంరాజు, సంపత్‌రెడ్డి, బాషానాయక్‌లతో పాలు జవాన్లు ఉన్నారు.



హనుమకొండలో షాపు యజమానికి జరిమానా విధిస్తున్న సిబ్బంది

బీసీ కుల గణనలో తప్పులను సవరించాలి

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీసీ కుల గణనలో తప్పులు జరిగాయని, వాటిని సవరించి కచ్చితమైన బీసీ జనాభా వివరాలను చెప్పాలని కేయూ జేఏసీ స్కాలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కందకట్ల శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. బీసీ కులగణన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అయితే గణన రిపోర్టులో బీసీ జనాభా తక్కువగా చూపడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల కిందట చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉండగా, తాజాగా ఇప్పుడు 46 శాతంగా పేర్కొందన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా తగ్గినట్లు చూపారని ఆవేదన వ్యక్తం చేశారు బిహార్ తర్వాత దేశంలో తెలంగాణలోనే బీసీ కుల లెక్కలు తీశారని పేర్కొన్నారు. బీసీలకు అనుకూలమైన రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని హనుమకొండ రూరల్ టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ బి.సామ్యనాయక్ తెలిపారు. ఎల్లాపూర్, మల్లారెడ్డిపల్లి, దేవన్నపేట ప్రాంతాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతు పనుల దృష్ట్యా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కేడీసీ విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించుకోవాలి



ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజిరెడ్డి

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చదువులు పూర్తికాగానే ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కేడీసీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం కేడీసీలో తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్, టాస్క్ సంయుక్తంగా జెన్‌ప్రాక్టు సంస్థ ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. జెన్‌ప్రాక్టు హోంటౌన్‌లో ఉద్యోగాలు సాధించాలని అన్నారు. వరంగల్ జెన్‌ప్రాక్టు ప్రతినిధులు జస్టిన్ శ్యాంసన్, రామక్ రూషన్ హాజరై విద్యార్థులకు ఉద్యోగాల వివరాలను తెలిపారు. 150 మందికిపైగా విద్యార్థులు ఉద్యోగ మేళాలో ప్రతిభ చూపినట్లు వెల్లడించారు. కళాశాల టీఎస్‌కేసీ ఇన్‌చార్జి డాక్టర్ డి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 10 నుంచి కళాశాలలో కామర్స్ స్టూడెంట్స్‌కు ఫైనాన్షియల్ అకౌంటింగ్‌పై 10 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు జెన్‌ప్రాక్టు సంస్థలో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కె.రజనీలత, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.అనిల్‌కుమార్, మెంటర్ పి.సాగర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ కార్యక్రమాలను విస్తృతం చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తెస్తామని ఆ సంస్థ నూతన అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ వెల్దండి రవికుమార్, మండల పరుశరాములు అన్నారు. శుక్రవారం కేయూ ఎకనామిక్స్ విభాగంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ కార్యవర్గ సమావేశంలో ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంస్థ చేపట్టనున్న అనేక విషయాలపై విస్తృతంగా చర్చించారు. బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా, పూర్వ ఉమ్మడి జిల్లాల ఆధ్వర్యంలో కమిటీలను నియమిస్తామని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాకు అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ వెల్దండి రవికుమార్, మండల పరుశరాములు, మహిళ విభాగానికి అధ్యక్షులుగా పొన్నాల సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా పగడాల సరళలను నియామిస్తూ సంస్థ చైర్మన్ మహమ్మద్ సిరాజుద్దీన్, ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. సొసైటీ నిబంధనలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు. అలాగే మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో కోశాధికారి డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, నేతలు ప్రొఫెసర్ కె.విజయబాబు, గంటా రామిరెడ్డి, పొన్నాల రామ్మోహన్, కాజీపేట పురుషోత్తం, ప్రగళ్ళపాటి రాజ్‌కుమార్, బిట్టవరం శ్రీమన్నారాయణ, మైస ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీకి బాధ్యతలు ఇస్తున్న సీరాజుద్దీన్, సురేశ్‌లాల్ ఇతర బాధ్యులు

ట్రైసిటీ ఆటోయూనియన్ ఎన్నిక

కాజీపేట, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): కాజీపేట ట్రైసిటీ ఆటోడ్రైవర్ యూనియన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అధ్యక్షుడిగా గడప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నరమట మధూకర్, కోశాధి కారిగా జేరుపోతుల వెంకటేశ్వర్లు, ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని యూనియన్ గౌరవ అధ్యక్షులు మైసారపు సిరిల్ లారెన్స్ ముఖ్య సలహాదారులు బండి విజయ్ భాస్కర్, మర్యాల కృష్ణ, దుప్పటి శివలు ఘనంగా సన్మానించారు.



నూతనంగా ఎన్నికైన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

రిటైర్డ్ హోంగార్డుకు సత్కారం

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా విధుల నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు సుదర్శన్‌ను శుక్రవా రం సీపీ అంబర్ కిషోర్ ఝా జ్ఞాపికతో సత్కరించారు. భవిష్యత్‌లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, హోంగార్డ్స్ ఏసీపీ నాగయ్య, ఆర్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డును సత్కరిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

రాంపూర్ డంప్ యార్డులో పొగ నియంత్రణకు చర్యలు

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవ రి 7 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ డంపింగ్ యార్డులో ఉద్గారాల (ఉత్పన్నాలు) నియంత్రణకు పటిష్ట చర్యలు చేప ట్టనున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. రాంపూర్ డంపింగ్ యార్డ్ వల్ల చు ట్టుపక్క ప్రాంతాల ప్రజలు పొగతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈనెల 1న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఊళ్లను కమ్మేస్తోంది' అనే వార్త ప్రచురితమైంది. దీంతో కమిషనర్ స్పందించి పరిష్కార మార్గాన్ని వెతికి శనివారం వివరాలను వెల్లడించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇకపై పొగ రాకుండా ఉండేందుకు ప్రత్యేక నీళ్లట్యాంకర్లతో మంటలను చల్లార్చి పొగరాకుండా చేస్తామన్నారు. కాజీపేట ఫిల్లింగ్ స్టేషన్ నుంచి డంపింగ్ యార్డు ప్రదే శానికి ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇకపై డంపిం గ్‌యార్డు వద్ద ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మంటలను చల్లార్చడం చేస్తామన్నారు. యార్డులో వాహనాలు సులభంగా తిరిగేందుకు రోడ్లను వేస్తామని తెలిపారు. అదనపు బయో మైనింగ్ ద్వారా రీసైకిల్ ప్రక్రియ చేపడతా మన్నారు. బయోమైనింగ్ ప్రాజె క్ట్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఇకపై రాంపూర్ డంపింగ్ యార్డులో ప్రస్తుతానికి తడి, పొడి చెత్తను వేరుగా వేస్తామని కమిషనర్ వెల్లడించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పన్నాల గోపాల్‌రెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తన గెలుపు కోసం మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుతో పాటు పెన్షన్ వర్తింపచేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరి ంచేందుకు ఉద్యమిస్తానని అన్నారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు గుండబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, కట్ల జగన్నాథం గౌడ్, పెద్దురి పెద్దయ్య, కందిమల్ల సుధాకర్, యాదగిరిరావు, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమమైన అలవాట్లే ఉన్నత స్థాయికి చేరుస్తాయి..

కాజీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ అలవాట్లు అలవర్చు కుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. కాజీపేట సెయింట్ ఆన్స్ స్కూల్‌లో శుక్రవారం సంస్కార వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దామోదర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ నాశనం చేసే తప్పుడు మార్గాలకు వెళ్లకూడదన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, టీచర్ ఫాతిమా థామస్, అసోసియేషన్ సభ్యులు కె. రాజేందర్, ఎం.రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్

హేమచంద్ర ప్రతిభతో బంగారు పతకం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హనుమకొండ విలియం కేరీ పాఠశాలకు చెందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పాశికంటి హేమచంద్ర ప్రతిభతో అండర్-17 తెలంగాణ జట్టు బంగారు పతకాన్ని సాధించింది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో 68వ ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో హేమచంద్ర అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో తెలంగాణ జట్టు పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో శుక్రవారం విలియం కేరీ పాఠశాల ఇన్‌చార్జి విద్యాకర్ ఆధ్వర్యంలో హేమచంద్రకు అభినందన కార్యక్రమం జరిగింది. హేమచంద్రను పూలమాలతో అభినందించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ దేవయ్య, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హేమచంద్రను అభినందిస్తున్న విలియం కేరీ పాఠశాల ఇన్‌చార్జి విద్యాకర్ తదితరులు

బడ్జెట్‌పై కాంగ్రెస్ అర్థంలేని విమర్శలు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు అర్థరహితమని, ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని బీజేపీ గోపాల్‌పూర్ జోన్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ ముదిరాజ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ - జవహర్‌కాలనీ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో బీజేపీ గోపాల్‌పూర్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీలో కేయూకు చోటు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీకి కాకతీయ యూనివర్సిటీ స్కాలర్లు, విద్యార్థులు వివిధ హోదాల్లో ఎంపికయ్యారు. ఈ మేరకు భద్రాచలంలో ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సదస్సులో వీరి ఎంపిక జరిగినట్లు పీడీఎస్‌యూ నేతలు ప్రకటించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బి.నరసింహరావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అలువాల నరేశ్, కావ్య, బొట్ల రాకేశ్, పి.అనూషలను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా అందరికీ సమాన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలన్నారు. సమానత్వ స్థాపనే ధ్యేయంగా పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. కుల, మతోన్మాద భావజాలన్ని అడ్డుకుని శాస్త్రీయ ఆలోచనలను పెంచుతామన్నారు. వర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన స్టూడెంట్స్‌కు హస్టల్, మెస్‌తో పాటు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని అన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ వర్సిటీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు నిధులను పెంచాలన్నారు. తమను రాష్ట్ర కమిటీలో ఎంపికయ్యేందుకు సహకరించాలని పీడీఎస్‌యూ జాతీయ, రాష్ట్ర నేతలు పెద్దింటి రామకృష్ణ, నామాల అజాద్, కంపాటి పృథ్వీ ఎస్.అనిల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపికైన నరసింహరావు, నరేశ్, రాకేశ్, అనూష తదితరులు

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంపకం చేప ట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూ చించారు. బల్దియా ఆధ్వర్య ంలోని రాంపూర్ ప్రాంతాల్లో సూర్యకుటీర్, వెస్ట్ సిటీ ప్రాంతాల్లో నిర్వహి ంచబ డుతున్న నర్సరీలో శుక్రవారం కమిషనర్ తనిఖీ లు చేపట్టి మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వనమ హోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు సరిపడా మొక్కలను ఇప్పటినుంచే ప్రణాళికా బద్ధంగా నర్సరీలలో పెంచాలన్నారు. ప్రజలకు అందజేయడానికి పూలు, పండ్ల మొక్కలను లక్ష్యం మేరకు పెంచాలన్నారు. హార్టికల్చర్ అధికారి పలాస రమేష్ పాల్గొన్నారు.

సీఏ పట్టా అందుకున్న పృథ్వీరాజ్

రెడ్డికాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జీఎంసీ బాల యోగి ఆడిటోరియంలో జరిగి న స్నాత కోత్సవంలో సంస్థ అధ్యక్షుడు సీఏ రజత్‌కు మార్ చేతుల మీదుగా ప్రముఖ వ్యాపా రవేత్త, జీఎన్‌ఆర్ సూపర్‌మార్కెట్ అధినేత గుండా నాగేశ్వర్‌రావు కుమారుడు గుండా పృథ్వీరాజ్ సీఏ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్స్ గుండా పృథ్వీరాజ్‌ను అభినం దించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసి యేషన్ చార్టర్డ్ అకౌంటెంట్ పలువురు అభినందనలు తెలిపారు.



తల్లిదండ్రులతో గుండా పృథ్వీరాజ్

లక్ష్య సాధనకు నిరంతర పోరాటం చేయాలి

ప్రముఖ సినీ దర్శకుడు అట్లూరి వెంకీ

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన కోసం విద్యార్థులు నిరంతర పోరాటం చేయాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సినీ దర్శకుడు అట్లూరి వెంకీ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి స్టూడెంట్ కల్చరల్ కార్నివాల్ సంస్కృతి-25 వినోదం ఉత్సాహభరితంగా కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు వెంకీ ముఖ్య అతిథిగా హాజరై సంస్కృతి-25పై నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్‌తో పాటు బ్రోచర్‌ను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి సమాజానికి ఉపయోగపడే గొప్ప ఇంజనీర్లుగా తీర్చిదిద్దే అవకాశం ఒక ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో సమాజంలో నిలదొక్కుకొని ఉన్నతంగా రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లక్కీ భాస్కర్, జ్ఞాపకం, ఇట్స్ మై లవ్ స్టోరీ, కేరింత, తొలిప్రేమ, స్నేహ గీతం, సర్, మిస్టర్ మజ్నూ వంటి సినిమాలకు దర్శకత్వం వహించి మంచి దర్శకుడిగా నిలబడడానికి చేసిన కృషిని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా లైవ్ పెయింటింగ్, టాటూస్, ఫొటోబూత్, ఫేస్ పెయింటింగ్, షార్ట్ మేకింగ్, కన్ఫెషన్స్ వంటి 20కిపైగా స్పాట్ ఈవెంట్లు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఏకశిల ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, రిటైర్డ్ జడ్జి కె.దేవీప్రసాద్, పాలక మండలి సభ్యులు ఇ.వెంకట్రాంరెడ్డి, వివిధ విభాగాధిపతులు ఎం.శ్రీలత, ఎం.నర్సింహరావు, డాక్టర్ డి.ప్రభాకరాచారి, పి.రక్షిత్, గౌరీజాహ్నవి, ఎం.సాకేత్, ప్రవర్ష్, ఆసీఫ్, అబూబాకర్, నయన, యాస్మిన్, స్నేహంకిత, స్నేహ, రిషిత, రాహుల్, అనిరుద్, వనలక్ష్మీ, సుఫియన్, రియాన్, శశి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు అట్లూరి వెంకీ తదితరులు

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

బల్దియా అదనపు కమిషనర్ జోనా

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): బల్దియాకు బకాయి ఉన్న పన్నులు చెల్లించి వరంగల్ నగరాభివృద్ధికి సహకరించాలని బల్దియా అదనపు కమిషనర్ ఈసం పెల్లి జోనా సూచించారు. శుక్రవారం బల్దియా పరిధిలోని హంటర్‌రోడ్డులో గల కాసం ప్యాషన్స్ యాజమాన్యం జోనాను బల్దియా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. షాపునకు సంబంధించిన పన్ను రూ.11.91 లక్షల చెక్కును జోనాకు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి షహజాదిబేగం, ఆర్‌ఐ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కాసం యాజమాన్యం నుంచి చెక్కును స్వీకరిస్తున్న జోనా

పది రకాల కూరగాయలు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా!
త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిధం స్మృతమ్!

ఆహారంలో శాకాలది అంటే కూరగాయలది ప్రధాన భాగస్వామ్యం. కూరగాయలు మొత్తం పది రకాలున్నాయి. దుంపకూరలు, ఆకుకూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు... ఇలా పది రకాలుగా ఉన్న శాకాల్ని మనం తరచూ వండుకుంటూ ఉండాలి. ధాన్యాన్ని నానబెట్టి ఉంచితే మొలకలొస్తాయి. మొలకెత్తిన ధాన్యం కూరగాయగా మారిపోయి, అదనపు పోషకాలిస్తుంది. వరిధాన్యం, పప్పు ధాన్యం, కూరగాయలు, నెయ్యి, నూనె సుగంధ ద్రవ్యాలు కలబోసినదే నిజమైన భోజనం. మాంసాహారులు మాంస ద్రవ్యాలను వీటికి అదనంగా చేర్చుకోవచ్చు. చిక్కుడులాంటి గింజలు కూడా అదనపు రుచినిస్తాయి.

పురుగు మందుల తాకిడి లేని కూరగాయలను ఎంచుకుని, జీర్ణశక్తిని అనుసరించి కూరగాయల్ని తగిన రీతుల్లో వండుకోవాలి. శరీరానికి సరిపడేవాటినే ఎంచుకోవాలి. ఎక్కువ పోషకాలుండి తక్కువ ధరకు తేలికగా దొరికేవాటిని తెచ్చుకోవడం మేలు. కూరగాయలనేవి ఆరోగ్యవంతులకే కాదు, అనారోగ్యంతో బాధపడేవారికీ, పిల్లలకూ అందరికీ ఉపయోగించేవిగా ఉండాలి. శరీరానికి ఎలాంటి ఇబ్బందీ కలిగించనిదే ఆరోగ్యదాయక శాకం.



పైన చెప్పిన పది రకాల కూరగాయల్ని తరచూ మార్చి మార్చి తింటూ ఉండాలని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం), నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్రనాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవ కణాల్ని నశింపచేయటం), ప్రజ్ఞాక్షయం (మేథశక్తిని హరించడం), పాలిత్యకారక (జుట్టు నెరిసిపోవడం), స్మరణ శక్తి నాశక (జ్ఞాపకశక్తిని నశింప చేయడం) అని 'భావప్రకాశ' అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి, ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకుకూర, ఒకరోజు కాయగూర... ఇలా పది రకాల్నీ మార్చిమార్చి తినాలనేది సూచన. ఒక ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంటు ఇటుక అన్నీ కావాలి. కేవలం ఇసుకతోనో ఇటుకతోనో నిర్మాణం సాగదు. ఆహారం అయినా అంతే! పది రకాల శాకాలలో ఏదో ఒకటి రోజూ అన్నంలో ఉండేలా ఆహార ప్రణాళిక ఉండాలి! కేరెట్, ముల్లంగి, కీరా, టమోటాలాంటి శాకాల్ని వండకపోయినా తేలికగానే అరుగుతాయి. తక్కిన కూరగాయల్ని సుపక్వంగా అంటే చక్కగా వండుకొని తినటమే మంచిది.

శాకాహారుల భోజనం పేరుకే గానీ, అందులో శాకాల పాత్ర తక్కువగా ఉంటోంది. చింతపండు లేదా మసాలా గ్రేవీలు ఎక్కువగా, కూర తక్కువగా ఉండేలా వండుకుంటున్నారు. గరిటెడు సొరకాయ పులుసు కూరలో రెండో మూడో సొరకాయ ముక్కలుంటే, మిగతాదంతా పులుసు ఉంటోంది. ఆ రెండు ముక్కలతోనే శాకాహారం అంటే సరిపోదు. కూర ఎక్కువగా, అన్నం తక్కువగా తినగలిగేలా వండుకోవాలి. శాకములు 50 శాతం, పప్పు ధాన్యాలు 25 శాతం, అన్నం 25 శాతం ఉండేట్లు తింటే మధుమేహం, బీపీ సహా ఏ జబ్బులూ రాకుండా ఉంటాయి. కూర, పప్పు, పచ్చళ్లను అతిగా చింతపండు రసం కలిపి, లేదా అల్లం వెల్లుల్లి పేస్టు కలపివండటంవలనే మన ఆహారం శాకములు లేని శాకాహారంగా మారిపోతోంది.

● గంగరాజు అరుణాదేవి

ఇంటి తోట పెంచాలంటే..!

చాలామంది ఇంటి పరిసరాల్లో చిన్నపాటి తోటను పెంచుకోవాలని అనుకుంటారు. పూలు, కూరగాయల మొక్కలతో కూడిన అందమైన తోటను సృష్టించడానికి నిపుణులు అందిస్తున్న సూచనలు ఇవే...

- మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే ఎక్కువసేపు సూర్యకాంతి నిలుస్తూ ధారాళంగా గాలి వీచే ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇంటి వెనక, బాల్కనీ, విండోలు తోట పెంపకానికి అనువుగా ఉంటాయి.
- తోట కోసం కేటాయించిన స్థలాన్ని దృష్టిలో ఉంచుకుని తోట విస్తరణలో భాగంగా పళ్ల మొక్కలు, ఔషధ మూలికలు పెంచవచ్చు.
- తోట పెంచడానికి అవసరమైన మట్టి, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, నీళ్ల పిచికారీ చేసే డబ్బాలు, ఆవుపేడ, మట్టితో తయారు చేసిన కుండీలు, నీటి సదుపాయం తదితరాలను సమకూర్చుకోవాలి. వంటగది వ్యర్థాలు, పళ్ల తొక్కలు, ఎండిన ఆకులతో కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు.
- మొక్కలు పెరుగుతున్నప్పుడు ప్రాథమిక సంరక్షణ అత్యవసరం. అదనంగా పెరిగిన కొమ్మలను కత్తిరించాలి. ఎండిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేయాలి. తెగుళ్లు సోకకుండా రసాయనాలకు బదులు వేపనూనెని నీళ్లలో కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కలకు రోజూ కనీసం నాలుగు గంటలు ఎండ తగిలేలా చూసుకోవాలి. అంత వేడి అవసరం లేని మొక్కలకు ఎండ తగలకుండా చుట్టూ పరదా కట్టాలి. మొక్క స్వభావాన్నిబట్టి నీరు పోయాలి.



కాలీఫ్లవర్‌తో కొత్తగా...

వంటిల్లు

కాలిఫ్లవర్ అంటే ఇష్టపడనివారు ఉండరు. దీంతో మంచూరియా, పకోడీ లాంటి స్నాక్ ఐటమ్స్ మాత్రమే కాదు... రుచికరమైన కూరలు కూడా చేసుకోవచ్చు. అలాంటి కొన్ని కూరల తయారీ మీ కోసం...



ఆలూ గోబీ మసాలా

కావాల్సిన పదార్థాలు

- ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన కాలీఫ్లవర్ ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన పచ్చి బఠానీలు- అర కప్పు, నూనె- మూడు చెంచాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, అల్లం తరుగు- రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఆమ్‌చూర్- ఒక చెంచా, ఇంగువ- తగినంత, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

జాగ్రత్తలు

- ఆలుగడ్డ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు వేసిన తరవాత అవి చిదమకుండా జాగ్రత్తగా కలపాలి.
- కూర గ్రేవీలా రావాలనుకుంటే చివరలో కమ్మని పెరుగు కలుపుకోవచ్చు.

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇంగువ, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు వేసి బాగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. మిశ్రమం నుంచి నూనె పైకి తేలుతున్నప్పుడు ఆలుగడ్డ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు, బఠానీలు వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ వేసి కలిపి మూతపెట్టి పది నిమిషాలు మగ్గించాలి. తరవాత కొత్తిమీర చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూరని పిల్లలు ఇష్టంగా తింటారు.

కాలీఫ్లవర్ చికెన్ కర్రీ



కావాల్సిన పదార్థాలు

- బోన్‌లెస్ చికెన్ ముక్కలు- అర కేజీ, కాలీఫ్లవర్- అరకేజీ, పెద్ద సైజు ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిరపకాయలు- మూడు, టమాటాలు- రెండు, తరిగిన అల్లం- రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, గరం మసాలా పొడి- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, కారం- అర చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, నూనె- మూడు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు

జాగ్రత్తలు

- కాలీఫ్లవర్ కొనేముందు బాగా తెల్లగా గట్టిగా ఉన్నదాన్ని ఎంచుకోవాలి.
- ఈ వంటకం రుచిని పెంచడానికి చికెన్ ముక్కలు ఉడికేటప్పుడు పావు కప్పు కొబ్బరిపాలు చేర్చుకోవచ్చు.
- చికెన్ ముక్కలు తొందరగా మెత్తబడతాయి. అవి ఉడుకుతున్నప్పుడు మధ్యమధ్యలో మూత తీసి చూసుకుంటూ ఉండాలి. మరీ ఎక్కువగా ఉడికితే కూర అంత రుచిగా ఉండదు.

తయారీ విధానం

- ముందుగా చికెన్ ముక్కలు, కాలీఫ్లవర్‌లను మంచినీళ్లతో శుభ్రంగా కడగాలి. కాలీఫ్లవర్‌ను పువ్వుల మాదిరి కోయాలి. పచ్చిమిరపకాయలు, టమాటాలు, ఉల్లిగడ్డలను కూడా చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. వెల్లుల్లి రెబ్బలను పొట్టు తీసి కచ్చాపచ్చాగా దంచి ఉంచుకోవాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ముందుగా ఉల్లిపాయ ముక్కలు వేసి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత పచ్చిమిరపకాయ ముక్కలు, పసుపు, అల్లం తరుగు, వెల్లుల్లి మిశ్రమం వేసి కలపాలి. అవి రెండు నిమిషాలు వేగాక టమాటా ముక్కలు, ఉప్పు, కారం, గరం మసాలా, చికెన్ ముక్కలు వేసి కలిపి గిన్నెమీద మూత పెట్టి మగ్గనివ్వాలి. చికెన్ ముక్కలు కొద్దిగా మెత్తబడిన తరవాత కాలీఫ్లవర్ ముక్కలు వేసి కలిపి కొన్ని నీళ్లు చల్లి మూతపెట్టాలి. పది నిమిషాల తరవాత ధనియాల పొడి కలపాలి. చివరలో కొత్తిమీర చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.

కాలీఫ్లవర్ మసాలా బుర్జీ



కావాల్సిన పదార్థాలు: కాలీఫ్లవర్- పావు కేజీ, పచ్చి బఠానీలు- ఒక కప్పు, నూనె- మూడు చెంచాలు, లవంగాలు- అయిదు, యాలకులు- మూడు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, జీలకర్ర- అర చెంచా, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమాటాలు- మూడు, పచ్చిమిరపకాయలు- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, కసూరీ మేథీ- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- ఒక కప్పు

తయారీ విధానం: ముందుగా కాలీఫ్లవర్‌ను పెద్ద ముక్కలుగా విడదీయాలి. వీటికి కాడ ఉండేలా చూసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు గ్లాసుల నీళ్లు పోసి అర చెంచా ఉప్పు, చిటికెడు పసుపు వేసి బాగా మరిగించి దించాలి. ఇందులో కాలీఫ్లవర్ ముక్కలు వేసి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత ముక్కలను పళ్లెంలోకి తీసి చల్లారనివ్వాలి. పచ్చి బఠానీలను కూడా నీళ్లు పోసి సగం వరకు ఉడకనివ్వాలి.

- లావుపాటి పెద్ద రంధ్రాలు ఉన్న గ్రేటర్ సహాయంతో కాలీఫ్లవర్ ముక్కలను తురిమి బుర్జీని సిద్ధం చేసుకోవాలి. టమాటాలను ముక్కలుగా కోసి మెత్తగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జీలకర్ర వేసి దోరగా వేపాలి. తరవాత ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత టమాటా పేస్టు, ఉప్పు, పచ్చి బఠానీలు, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి బాగా కలపాలి. మిశ్రమం నుంచి నూనె తేలే వరకు వేగనివ్వాలి. తరవాత ఇందులో పసుపు, కారం, ధనియాల పొడి వేసి కలిపి రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచాలి. తరవాత కాలీఫ్లవర్ బుర్జీని కూడా వేసి బాగా కలిపి ఒక కప్పు నీళ్లు పోసి మూత పెట్టి ఆరు నిమిషాలు ఉడికించాలి. గిన్నెలో మిశ్రమం దగ్గరకు వచ్చాక కసూరి మేథీ, గరం మసాలా పొడి, కొత్తిమీర తరగు వేసి కలిపి రెండు నిమిషాలు ఉంచి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మసాల బుర్జీని వేడి అన్నంలో కలుపుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- కూరలో బఠానీలు మెత్తగా ఉండాలనుకుంటే ముందుగానే ఎక్కువసేపు ఉడికించుకోవాలి. ఫ్రోజెన్ బఠానీలు తెచ్చుకుంటే వాటిని నేరుగా వాడుకోవచ్చు.
- కూరలో ఒక చెంచా పెరుగు కలిపితే దాని రుచి పెరుగుతుంది.

పర్యావరణహితంగా ఉపాధి మార్గంగా

స్వయంకృషి

స్వశక్తితో ఎదగాలన్న తపన ఆమెను కుదురుగా కూర్చోనివ్వలేదు. ఆ తపనతోనే లక్షల రూపాయలు తెచ్చిపెట్టే కొలువు వదిలేసి... భర్త, సోదరుడితో కలిసి అంకుర సంస్థను నెలకొల్పారు. ఆహార పదార్థాల కోసం ప్లాస్టిక్ రహిత కంటైనర్ల తయారీతో... పర్యావరణహిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఐదున్నరేళ్లలో కంపెనీని ఐదు కోట్లకు పైబడిన టర్నోవర్‌కు తీసుకువెళ్లి... తనలాంటి ఎంతోమంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ధన్విత సత్యానంద్ కథ ఇది.



"చదువుకొనే రోజుల్లో నాకంటూ ప్రత్యేకమైన లక్ష్యాలేవీ లేవు. మంచి మార్కులు తెచ్చుకోవాలి. అందరు అమ్మాయిల్లా మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. ఇవే నా కోరికలు. కానీ ఒక్కసారి కొలువులో కుదురుకున్నాక... నా గురించి నేను ఆలోచించడం మొదలుపెట్టాను. అప్పుడే అర్థమైంది... ఇది కాదు నేను కోరుకున్న జీవితం అని. నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలి. కష్టపడి పని చేసి మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరుకున్నా. ఇదే విషయం మావారు శ్రీనిధి రాఘవన్, నా సోదరుడు భరత్ సత్యానంద్‌లకు చెప్పాను. వారూ అందుకు మద్దతునిచ్చారు. అలా ముగ్గురం కలిసి పలు బిజినెస్‌లు చేసి, చివరకు 'ఏకాజ్' స్టార్టప్‌ను నెలకొల్పాం. ఈ కంపెనీ ద్వారా మేం కోరుకున్నట్టే మరికొందరికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలుగుతున్నాం. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ, త్యాగాలు ఉన్నాయి. కర్ణాటక టుమ్కూరు జిల్లా మధుగిరి మాది. పాఠశాల విద్యాభ్యాసం తరువాత డిగ్రీ కోసం బెంగళూరుకు వచ్చాను. 2007లో 'మహావీర్ జైన్ కాలేజీ' నుంచి బీఎస్సీ డిగ్రీ, 2010లో పూణె 'సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' నుంచి 'ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్'లో పీజీ పట్టాలు అందుకున్నాను. పీజీ అవ్వగానే బెంగళూరు 'ఆడెన్ పబ్లిక్ స్కూల్'లో అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్‌గా చేరడంతో నా ఉద్యోగ జీవితం ప్రారంభమైంది.

ఉద్యోగాలు మారినా...

స్కూల్లో ఎక్కువ కాలం పని చేయలేకపోయాను. ఏడాది తిరక్కుండానే ఓ ఫైనాన్సియల్ కంపెనీలో రెండేళ్లకు పైగా సేవలు అందించాను. కార్పొరేట్ కొలువు, దానికి తగిన జీతం... అన్నీ బానే ఉన్నాయి. జీవితం సంతోషంగానే సాగిపోతోంది. కానీ ఏదో వెలితి. రాఘవన్, భరత్‌లదీ అదే పరిస్థితి. ఐటీ కంపెనీల్లో మంచి హోదాల్లో ఉన్నారు. కానీ రొటీన్ పని... ఒక మూస పద్ధతికి అలవాటుపడిపోయాం. మాకు అలా ఉండడం నచ్చలేదు. ఉద్యోగాలు మారినా సంతృప్తి లేకపోవడంతో ముగ్గురం రాజీనామా చేసేశాం. సొంతంగా ఏదైనా వ్యాపారం మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాం. అలా 2015లో బెంగళూరులోనే 'కార్టియర్ హోటల్స్' పేరుతో ఫోర్ స్టార్ హోటల్ ఒకటి ప్రారంభించాం. అయితే అందులో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

అప్పుడే తెలిసింది...

ఆతిథ్య, ఆహార రంగాల్లో ముడిసరుకు సేకరించడం, వినియోగించడం మధ్యన అంతరంవల్ల ఎంతో సమయం, వనరులు వృథా అవడాన్ని గమనించాం. సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నాం. ఈ ఆలోచనతోనే మా రెండో వెంచర్... 'అగ్రెస్ట్ సొల్యూషన్స్' సంస్థను నెలకొల్పాం. ముడిసరుకు కొనుగోలులో వృథాను సాధ్యమైనంత తగ్గించడంపై దృష్టి పెట్టాం. చీజ్, బటర్ తదితర 450 రకాల ఉత్పత్తులను సరఫరా చేసేవాళ్లం. అదే సమయంలో కొవిడ్ విజృంభించడంవల్ల డిమాండ్ తగ్గి, నష్టాలు పెరిగాయి. అవి భరించలేక, సంస్థను పక్కన పెట్టేశాం. అయితే దిగులు పడలేదు. మరో వినూత్న ఆలోచనతో 2020 చివర్లో 'ఏకాజ్ బయోవేర్'ను ప్రారంభించాం. ఆహార పరిశ్రమకు ప్యాకింగ్ కంటైనర్లను సరఫరా చేసే సంస్థ ఇది.

పర్యావరణ హితం...

మన దగ్గర ప్లాస్టిక్ నిషేధం అంటున్నారు కానీ... అది పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. దానివల్ల భూమికి భారం పెరిగిపోతోంది. పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని బయోడీగ్రేడబుల్ ప్యాకింగ్ మెటీరియల్స్ తీసుకువస్తున్నాం. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్‌తో కప్స్, బౌల్స్, డబ్బాలు తయారు చేస్తున్నాం. ఫుడ్ డెలివరీ సమయంలో ఇవి లీకవుతాయనే సందేహాలు మా కస్టమర్ల నుంచి ఉత్పన్నమయ్యాయి. అయితే మేం రూపొందించేవాటికి ఆ సమస్య లేదు. దీని కోసం కంటైనర్లకు ప్రత్యేక కోటింగ్ వేస్తాం. వాడిపడేసిన ఆరు నెలల్లో ఇవి మట్టిలో కలిసిపోతాయి. మా ఉత్పత్తులు 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' (సిపెట్) ధ్రువీకరించినవి."

ఐదు కోట్లు దాటిన ఆదాయం...

మా సంస్థ నెలకొల్పి ఐదేళ్లు పూర్తయింది. ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా, క్రమంగా అనుభవం గడించి, సమష్టి కృషితో నిలదొక్కుకున్నాం. ప్యాకింగ్ కంటైనర్ల తయారీకి ప్రత్యేక మిషన్లు ఏర్పాటు చేశాం. ఒక్కో మిషన్ నిమిషానికి నలభై నుంచి నలభై ఐదు డబ్బాలు ఉత్పత్తి చేస్తుంది. 50 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్ వరకు కాగితం డబ్బాలు సరఫరా చేస్తున్నాం. ఇప్పటివరకు కప్స్, బౌల్స్, కంటైనర్లు, మూతలు, బాక్స్ తదితర అన్నీ కలిపి నాలుగు కోట్ల యూనిట్స్ విక్రయించాం. 5.2 కోట్ల రూపాయల వార్షిక ఆదాయాన్ని రాబట్టగలిగాం. అన్నిటికంటే ముఖ్యంగా నాలుగు లక్షల కిలోల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలిగాం. తద్వారా ఆహార పరిశ్రమ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని కొంతవరకు అరికట్టగలిగాం. అందుకే ఈ ప్రయాణం మాకు లాభాలనే కాదు, ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోంది.

మేకప్

వేడి వాతావరణంలో చెక్కుచెదరకుండా

ఎండ వేడి పెరుగుతోంది. కాబట్టి చలి కాలం మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

- **ప్రైమర్:** గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పనిచేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె... సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.
- **పౌడర్:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.



- **ఫౌండేషన్:** వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్ వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.
- **మస్కారా:** ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.
- **లిప్ టింట్:** టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

లైటు పురుగులతో ఇబ్బందా..!

సాయంత్రం పూట ఇంట్లో బల్బులు వెలగగానే వాటి చుట్టూ రకరకాల పురుగులు, కీటకాలు చేరుతుంటాయి. కిటికీలు, తలుపులు మూసినప్పటికీ ఏదోవిధంగా ఇంట్లోకి చొరబడుతూనే ఉంటాయి. వీటి వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. వీటిని నివారించడానికి రసాయనాలతో కూడిన స్ప్రేలు, కాయిల్స్ ఉపయోగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో ఉండే వాటితోనే కొన్ని చిట్కాలు పాటించి ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు.

- వేపనూనె వాసన ఘాటుగా ఉంటుంది. ఈ వాసన కీటకాలకు నచ్చదు. ఒక స్ప్రే బాటిల్ తీసుకుని అందులో నాలుగు చెంచాల వేపనూనె వేసి బాటిల్ నిండుగా నీరు పోసి బాగా కలపాలి. వెంటిలేటర్లు, కిటికీ ఊచలు, ఇంటి తలుపుల వద్ద ఈ నీటిని పిచికారీ చేస్తే పురుగులు లోపలికి రావు. వేపనూనెకు బదులు లావెండర్ నూనె లేదా పిప్పరమెంట్ నూనె ఉపయోగించుకోవచ్చు.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోయాలి. అందులో పన్నెండు వెల్లుల్లి రెబ్బలను బాగా దంచి వేసి మరిగించాలి. ఈ నీళ్లు కొద్దిగా చల్లారాక స్ప్రే బాటిల్‌లో పోసి పురుగులు, దోమలు వచ్చే ప్రదేశాల్లో పిచికారీ చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒక గ్లాసు నీళ్లలో పది హారతి కర్పూరం బిళ్లలు వేసి కరిగించాలి. ఈ నీళ్లను స్ప్రే బాటిల్‌లో పోసి ఇంట్లోని అన్ని మూలల్లో పిచికారీ చేయాలి. కర్పూరం వాసనకు దోమలు, ఈగలు, ఇతర లైటు పురుగులు ఇంట్లో నుంచి పారిపోతాయి. గది మూలల్లో మట్టి ప్రమిదలు ఉంచి వాటిలో ఒకటి లేదా రెండు హారతి కర్పూరం బిళ్లలు వేసి వెలిగించినా మంచి ప్రయోజనం ఉంటుంది.
- అయిదు లవంగాలను కొద్దిగా వేడిచేసి మెత్తగా నూరి ఒక గ్లాసు నీళ్లలో కలపాలి. ఈ నీటిని ఇంటి గడప ముందు, కిటికీ తలుపుల వద్ద చల్లితే లవంగాల ఘాటుకి పురుగులు లోపలికి రావు.
- ఒక స్ప్రే బాటిల్‌లో కొన్ని నీళ్లు, రెండు చెంచాల బేకింగ్ సోడా, నాలుగు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని ఇంట్లో ట్యూబ్‌లైట్లు, బల్బుల చుట్టూ పిచికారీ చేస్తే పురుగులు దూరంగా వెళ్లిపోతాయి.

చేరదీసి చదివిస్తూ.. అవసరమైన ధ్రువపత్రాలిస్తూ..!

- అనాథ పిల్లలకు అండగా హైదరాబాద్ ఐసీడీఎస్ అధికారులు
- గత ఏడాది 1,088 మందికి జనన, ఆధార్, కుల ధ్రువీకరణ సహా పలు పత్రాల జారీ.. కలెక్టర్ ప్రత్యేక చొరవ


చిన్నారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు, పేదరికంతో కుటుంబానికి దూరమైన పిల్లలకు హైదరాబాద్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారులు తమ వంతు తోడ్పాటునందిస్తున్నారు. రోడ్ల వెంట భిక్షాటన చేస్తూ ఇబ్బందులు పడుతున్న వారిని చేరదీస్తూ మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. ఆటపాటలతో కూడిన బోధనలు అందిస్తుండడంతోపాటు వారి భవిష్యత్తు చదువులకు బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నారు. పుట్టిన తేదీ, ఏ కులమో తెలియక సతమతమవుతున్న వారికి నిర్దేశిత సర్టిఫికెట్లను జారీ చేస్తూ అండగా ఉంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 6 ప్రభుత్వ, 44 ప్రైవేట్ శిశు సంరక్షణ కేంద్రాలున్నాయి. ఇందులో ప్రస్తుతం 2,350 మంది పిల్లలున్నారు. అయితే వీరిలో ఎక్కువ మంది ఎవరూ లేని అనాథలే కావడంతో జనన, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాల వంటి వాటి విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గత ఏడాది డిసెంబరు 2 నుంచి 9 వరకు 8 శిశు సంరక్షణ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. మొత్తం 7 రకాల (జనన, అనాథ గుర్తింపు, కుల ధ్రువీకరణ, ఆదాయం, నివాసం, ఆధార్, సదరం) సర్టిఫికెట్లను పిల్లలకు అందించారు. అనాథ పిల్లల జనన ధ్రువీకరణ పత్రంలో సంరక్షకుడిగా ప్రస్తుతం వారుండే శిశు సంరక్షణ కేంద్రం (సీసీఐ) అధికారి పేరు చేర్చి ఇచ్చారు. వయసు నిర్ధారణ కోసం గాంధీ, ఉస్మానియా డాక్టర్లను సంప్రదించి వేశారు. ఇక.. ఆధార్ కార్డులో అడ్రస్ ప్రస్తుతం ఉంటున్న కేంద్రాన్ని పొందుపరచ్చారు. కులం సర్టిఫికెట్‌లో అనాథ పిల్లలకు బీసీ-ఏ కింద ఇవ్వగా.. తల్లిదండ్రులు లేదా బంధువులున్న పిల్లలకు వారి కులాన్ని చేర్చి ఇచ్చారు. ఇలా మొత్తం.. ఆ వారం రోజుల్లో 1,330 వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కాగా, రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా హైదరాబాద్ జిల్లాలో అనాథ పిల్లలకు జనన, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తుండటంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అభినందించారు. గతే డాది సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో అనుదీప్ చొరవను ప్రశంసించారు.

డీటీసీ ఇంట్లో ఏసీబీ సోదాలు

వరంగల్ క్రైం, జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) డాక్టర్ పుప్పాల శ్రీనివాస్‌పై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టి పెట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై శ్రీనివాస్ నివాసంతోపాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ బృందాలు శుక్రవారం ఏకకాలంలో సోదాలు చేశాయి. హనుమకొండ, దుర్గాకాలనీలో శ్రీనివాస్ నివాసముంటున్న అద్దె ఇంటితోపాటు, భీమారంలోని ఆర్‌టీఏ కార్యాలయం, హైదరాబాద్‌లోని సొంతిల్లు, స్వస్థలం జగిత్యాలతోపాటు కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో ఉదయం నుంచి సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని విల్లాలతోపాటు పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

స్నేహం నటించి.. సామూహిక అత్యాచారం

- 9వ తరగతి బాలికపై.. నలుగురు మైనర్ల అఘాయిత్యం
- ఆరేళ్ల చిన్నారి పట్ల బస్సు డ్రైవర్ అసభ్య ప్రవర్తన
- విహారయాత్రకు వెళ్లిన సమయంలో లైంగికదాడికి యత్నం!
- ఆలస్యంగా వెలుగులోకి


స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నార్సింగ్, శంషాబాద్ రూరల్/మంచాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక పట్ల స్నేహం నటించి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు నలుగురు మైనర్లు. ఈ ఘటన ఈ నెల 5న జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర భారతానికి చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం కొంతకాలం క్రితం నగరానికి వచ్చి హైదర్షాకోట్‌లో నివాసం ఉంటోంది. వారికి 9వ తరగతి చదువుతున్న కూతురు ఉంది. స్థానికంగా ఉండే కొందరు మైనర్లు ఆమెతో స్నేహం చేసేవారు. స్నేహాన్ని అడ్డం పెట్టుకొని ఈ నెల 5న ఆ అమ్మాయిని ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నలుగురు మైనర్లపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేశారు. కాగా, విహార యాత్రకు వెళ్లిన సమయంలో ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించాడో కామాంధుడు. ఈ ఘటన మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇన్‌ఫాంట్ జీసెస్ స్కూల్‌కు చెందిన 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులను పాఠశాల యాజమాన్యం బస్సుల్లో టూర్‌కు తీసుకెళ్లింది. వికారాబాద్ జిల్లా మంచాల మండలంలోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్‌కు వెళ్లారు. అక్కడ వాష్‌రూమ్‌కు వెళ్లిన ఆరేళ్ల బాలికపై బస్సు డ్రైవర్ జోసఫ్ రెడ్డి లైంగికదాడికి యత్నించాడు. ఇంటికి వచ్చిన తరువాత జరిగిన విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు వెళ్లి బస్సు డ్రైవర్‌ను చితకబాదేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. జోసఫ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

సిక్కోలు వ్యథే.. తండేల్ కథ!

జిల్లాలో 104 మత్స్యకార గ్రామాలు.. స్థానికంగా ఉపాధి లేక తంటాలు.. ఏటా దూరప్రాంతాలకు వలస

- పొరపాటున గీత దాటినా పొరుగు దేశాల జైలులో మగ్గాల్సిందే!
- 2018లో పాకిస్థాన్ బందీలుగా పలువురు జాలర్లు
- 13 నెలల పాటు జైల్లో నరకయాతన
- అదే ఇతివృత్తంగా సినిమా నిర్మాణం


పాకిస్థాన్‌లో బందీలుగా ఉన్న సిక్కోలు మత్స్యకారులు (ఫైల్)

(రణస్థలం - ఆంధ్రజ్యోతి)

కనుచూపు మేరా సముద్రం! సరిహద్దుల గీతలు కనిపించని జలాలు! ఆ 'కనిపించని గీత'ను వాళ్లు దాటారు! పాకిస్థాన్ చెరలో చిక్కారు! 13 నెలలపాటు పాక్ జైళ్లలో మగ్గారు! ఈ యథార్థ వ్యథ... 'తండేల్'గా వెండితెరపైకి ఎక్కింది! ఇది... శ్రీకాకుళం జిల్లాకు చెందిన అనేకమంది మత్స్యకారుల దయనీయ పరిస్థితికి అద్దంపట్టే కథ! స్థానిక మత్స్యకారులు ఇక్కడ చేపల వేట గిట్టుబాటుకాక.. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి నానా కష్టాలు పడుతున్నారు. అందులో యువకులే ఎక్కువ. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో గుజరాత్‌లోని వీరావల్ ప్రాంతానికి వలస వెళతారు. ఫిబ్రవరి, మార్చిలో స్వస్థలాలకు చేరుతారు.

సముద్రమున్నా... ఉపాధి లేదు!

శ్రీకాకుళం జిల్లాలో 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 104 మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేకపోవడంతో మత్స్యకారులు సంప్రదాయ వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక జిల్లా నుంచి వేలాది మంది మత్స్యకారులు చెన్నై, ముంబై, కోల్‌కతా, పారాదీప్, వీరావల్ (గుజరాత్) వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. బృందాలుగా వెళ్లి... అక్కడున్న వ్యాపారుల వద్ద పనికి కుదురుతారు. అక్కడున్నన్ని రోజులు సముద్రానికే అంకితమవుతారు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడతారు. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే. వీరి సమస్యను పరిష్కరించి... స్థానికంగా ఉపాధి కల్పించేలా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో భావనపాడు హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయింది. ఇంతలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో హార్బర్ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. తర్వాత భావనపాడు హార్బర్‌ను మూలపేటకు మార్చారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగా అప్పట్లో మంచినీళ్లపేటలో జెట్టీ, బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వైసీపీ నేతలు శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది.

ఇదీ అసలు కథ..

2018లో కె.మత్స్యలేశం గ్రామం నుంచి మత్స్యకారులు పదుల సంఖ్యలో గుజరాత్‌లోని వీరావల్‌కు వలస వెళ్లారు. ఆ ఏడాది నవంబరు 30న పొరబాటున పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించారు. వెంటనే ఆ దేశ భద్రతా దళాలు వారిని నిర్బంధించాయి. పాకిస్థాన్ జైల్లో వారు 13 నెలల పాటు మగ్గిపోతూ అష్టకష్టాలు పడ్డారు. ఆ సమయంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అప్పటి విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు ఈ విషయాన్ని తరచూ విన్నవించేవారు. అప్పట్లో ఆమె పాకిస్థాన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. దాంతో 2020 జనవరి 6న మత్స్యకారులు విడుదలయ్యారు. ఇదే ఇతివృత్తంగా తండేల్ సినిమా వచ్చింది.

ప్రాణాలపై ఆశలు వదులుకున్నాం!



వీరావల్ ప్రాంతంలో జెట్టీ నుంచి చేపలవేటకు వెళ్లాం. దాదాపు వేట పూర్తయింది. మరో అరగంటలో బయలుదేరుతామనగా.. మాకు చెందిన మూడు బోట్లు పొరపాటున పాకిస్థాన్ జలాల్లోకి చేరాయి. దీంతో అక్కడి కోస్టుగార్డులు గాల్లో కాల్పులు జరిపారు. దీంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాం. ప్రాణాలపై ఆశలు వదులుకున్నాం. మమ్మల్ని జైల్లోకి తీసుకెళ్లేసరికి 300 మంది విదేశీ మత్స్యకారులు ఉన్నారు. జైల్లో నరకయాతన పడ్డాం.

- రామారావు, బోటు డ్రైవర్ (తండేల్), కె.మత్స్యలేశం.

రైలులో గర్భిణిపై అత్యాచారయత్నం

- ప్రతిఘటించడంతో కదిలే రైలు నుంచి తోసివేత
- చిత్తూరు జిల్లా యువతికి తీవ్ర గాయాలు
- తమిళనాడుకు చెందిన నిందితుడి అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీలో ఒంటరిగా ఉన్న గర్భిణిపై అత్యాచారానికి ప్రయత్నించాడో యువకుడు. తాను గర్భిణినని, వదలిపెట్టాలని వేడుకున్నా వినిపించుకోకుండా లైంగిక దాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి పెద్దగా కేకలు వేయడంతో.. ఆమెపై దాడి చేసి కదిలే రైలు నుంచి కిందకి తోసేశాడు. ఈ ఘటనలో చిత్తూరు జిల్లాకు చెందిన మహిళ తీవ్రంగా గాయపడి, వేలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, లైంగిక దాడికి ప్రయత్నించిన తమిళనాడుకు చెందిన హేమరాజ్‌ను జోలార్‌పేట రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని తిరుప్పూరుకు చెందిన జమిన జోసెఫ్ భార్య నాలుగు నెలల గర్భవతి. చిత్తూరు సమీపంలోని మంగసముద్రం ఆమె పుట్టినిల్లు. గురువారం ఆ యువతి (36) కోయంబత్తూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో పుట్టింటికి బయల్దేరింది. వేకువజామున తిరుప్పూరులో మహిళా బోగీ ఎక్కగా.. అందులో ఉన్న మరో నలుగురైదుగురు మహిళలు జోలార్‌పేట స్టేషన్ వచ్చేసరికి దిగిపోయారు. వేలూరు జిల్లా కేవీ కుప్పంకు చెందిన హేమరాజ్(28) జోలార్‌పేటలో మహిళా బోగీ ఎక్కాడు. అక్కడ గర్భిణి ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. తీవ్రంగా ప్రతిఘటించిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో.. ఆమె జుట్టుపట్టుకుని తీవ్రంగా దాడిచేశాడు. అనంతరం ఆమెను కదిలే రైలు నుంచి బయటకు తోసేశాడు. ఈ ఘటనలో ఆమె కాళ్లు, చేతులు, తలకు బలమైన గాయాలయ్యాయి. రైలు పట్టాల పక్కన అపస్మారక స్థితిలో పడివున్న ఆమెను రైల్వే సిబ్బంది గమనించి.. ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు జోలార్‌పేట స్టేషన్‌లో సీసీ కెమెరాల ఆధారంగా హేమరాజ్‌ను గుర్తించి.. శుక్రవారం ఉదయం అతడిని కేవీ కుప్పంలో అరెస్టు చేశారు. హేమరాజ్ ఓ యువతి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965



అక్కినేని తరతరాలకు గుర్తుండిపోయే నటుడు

- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జీవితం కొన్ని తరాల పాటు ప్రజలు, సినీ కళాకారులు, నిర్మాతలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. శుక్రవారం అక్కినేని నాగార్జున తన తండ్రిపై మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన పుస్తకాన్ని మోదీకి బహూకరించారు. అక్కినేని జయంతి సందర్భంగా 'మహాన్ అభినేత అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ' అనే పుస్తకాన్ని లక్ష్మీప్రసాద్ రచించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులందరినీ మోదీ కలుసుకున్నారు. ఆయన కుమార్తె సుశీల, నాగార్జున సతీమణి అమల, కుమారుడు నాగచైతన్య, శోభిత దంపతులు మోదీని కలిసిన వారిలో ఉన్నారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అక్కినేనిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టాంపు ముద్రిస్తుందని మోదీ ప్రకటించారు. తన మన్ కీ బాత్ 117వ ఎపిసోడ్ లో అక్కినేని సేవలను స్మరించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. సినిమా రంగంతోపాటు విద్య, సాహిత్యం, సామాజికసేవా రంగాల్లో అక్కినేని కృషి ఎనలేనిదని ఆయన ఒక నటుడి కంటే ఒక సంస్థ లాంటి వాడని మోదీ కొనియాడారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్‌లో పాల్గొనవలసిందిగా నాగార్జునను ఆహ్వానించారు. నాగ చైతన్య మోదీతో మాట్లాడుతూ... శుక్రవారం విడుదలైన తండేల్ సినిమాలో పాకిస్థాన్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం మత్స్యకారులను అప్పటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ విడిపించేందుకు నిర్వహించిన పాత్రను దృశ్యీకరించామని చెప్పినప్పుడు తాను ఈ సినిమా తప్పకుండా చూస్తానని మోదీ ఆయనకు తెలిపారు.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

నాగ చైతన్య

నాగ చైతన్య, సాయి పల్లవి నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ 'గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. వారి ఆదరణ చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ రోజు నుంచి పండగ మొదలవుతుంది. ఆదరించిన వారందరికీ కృతజ్ఞతలు. చిత్రాన్ని మరో లెవల్‌కి తీసుకెళ్లిన మీడియాకు ధన్యవాదాలు' అని అన్నారు. నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ ' ఈ కథ వెనుక చాలా మంది ఉన్నారు. వారందరికీ ఒక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ 'మంచి చిత్రానికి సంగీతం అందించినందుకు చాలా ఆనందంగా ఉంది. సాయి పల్లవి అద్భుతంగా నటించారు' అని ప్రశంసించారు.





నా బాధ్యతను మరింత పెంచింది

నందమూరి బాలకృష్ణ

'పద్మభూషణ్ పురస్కారం లభించడం నా బాధ్యతను మరింత పెంచిది. నాకూ, మా కుటుంబానికి మాత్రమే కాదు యావత్ తెలుగు సినీ పరిశ్రమకు దక్కిన గౌరవమిది' అని టాలీవుడ్ కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయనకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో పలువురు తెలుగు సినీ ప్రముఖులు శుక్రవారం నందమూరి బాలకృష్ణను ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడు పి. భరత్‌భూషణ్, కోశాధికారి తుమ్మల ప్రసన్నకుమార్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ సహా ఇండస్ట్రీకి చెందిన పలు అసోషియేషన్లు, సంఘాల ప్రతినిధులు బాలకృష్ణకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. 'సినీ, సేవారంగంలో నందమూరి బాలకృష్ణ చేసిన కృషికి గుర్తింపుగా పద్మభూషణ్ పురస్కారం దక్కడం గర్వించదగిన విషయం, త్వరలో చిత్ర పరిశ్రమ తరపున నందమూరి బాలకృష్ణను ఘనంగా సన్మానించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం' అని వారు తెలిపారు.



శివరాత్రికి మజాకా

సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మన్మథుడు ఫేమ్ అన్షు, రావు రమేశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. శివరాత్రి సందర్భంగా ఈనెల 26న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్, రీతూవర్మ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ప్రసన్నకుమార్ కథ, సంభాషణలు అందిస్తున్న ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు.

ఇద్దరమ్మాయిలతో ప్రేమకథ

తనదైన నటనతో ఇంటిల్లిపాదిని ఆకట్టుకుని ప్రేక్షక హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాడు యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ. శుక్రవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా సిద్ధు కథానాయకుడిగా నటిస్తున్న 'తెలుసుకదా' చిత్రం నుంచి యూనిట్ కొత్త పోస్టర్స్‌ను విడుదల చేసింది. ఇద్దరు అమ్మాయిలతో హీరో ప్రేమకథ నేపథ్యంలో సాగే చిత్రమిది. రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ఒక పోస్టర్‌లో సిద్ధు, కథానాయిక శ్రీనిధి శెట్టి మంచి రొమాంటిక్ మూడ్‌లో కనిపించగా, మరో పోస్టర్‌లో రాశీ ఖన్నా నుదుటిపై సిద్ధు ముద్దాడుతూ కనిపించారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. థమన్ ఎస్. సంగీతం అందిస్తున్నాడు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ బాబా, ఎడిటర్: నవీన్ నూలి



అందుకే హ్యాపీగా ఉన్నా

శివ కార్తికేయన్



'అమరన్' సినిమాతో మన విజయాన్ని అందుకొన్నారు కోలీవుడ్ హీరో శివకార్తికేయన్. ఈ చిత్రం మూడు వందల కోట్ల రూపాయలు వసూళ్ల చేసి శివకార్తికేయన్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయికగా నటించారు. కమల్ హాసన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో కూడా విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా శివకార్తికేయన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్ అనవసరమైన విషయాలు పట్టించుకొని బాధపడటం నాకిష్టం లేదు. అందుకే రెండేళ్లుగా వాటికి దూరంగా ఉన్నా. అప్పటినుంచి ఎంతో హ్యాపీగా ఉన్నా' అని తెలిపారు. కాగా, ప్రస్తుతం శివకార్తికేయన్ 'పరాశక్తి' అనే బయోపిక్‌లో నటిస్తున్నారు.

దర్శకుడిగా ఎన్. శంకర్ తనయుడు



శ్రీరాములయ్య, ఎన్‌కౌంటర్ లాంటి పలు హిట్ చిత్రాలను అందించి ప్రేక్షకులను మెప్పించారు దర్శకుడు ఎన్ శంకర్. ఇప్పుడు ఆయన తనయుడు దినేష్ మహేంద్ర కూడా తండ్రిబాటలోనే నడుస్తూ దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. తొలిసారి ఆయన దర్శకత్వంలో ఓ రొమాంటిక్ ఫీల్ గుడ్ మూవీ రూపుదిద్దుకోనుంది. పూర్తిగా కొత్త నటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాణ సంస్థ ఆరెక్స్ క్రియేషన్స్ తెలిపింది. ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం పాటల రికార్డింగ్ జరుగుతోంది. మరిన్ని వివరాలు త్వరలోతెలియజేస్తామని నిర్మాణ సంస్థ తెలిపింది.

మరోసారి 'జురాసిక్ పార్క్'



వేల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన డైనోసార్స్ తిరిగి భూమ్మీదకు వస్తే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ చిత్రం 'జురాసిక్ పార్క్'. 1993లో స్పీల్ బర్గ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ప్రపంచ వ్యాప్తంగా వసూళ్ల సునామీని సృష్టించింది. ఆ తరవాత 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీలో వచ్చిన సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేదు. అయితే చివరి సారిగా 2022లో వచ్చిన 'జురాసిక్ వరల్డ్ డొమినియన్' పర్వాలేదనిపించింది. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా వస్తున్న సినిమానే 'జురాసిక్ వరల్డ్ రీ బర్త్'. 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీలో గరేత్ ఎడ్వర్డ్స్ దర్శకత్వంలో 7వ సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఒక పరిశోధన బృందం తమ అన్వేషణలో భాగంగా జురాసిక్ పార్క్ ఉన్న ఐలాండ్‌కు వెళ్తుంది. డైనోసార్స్ నుంచి డీఎన్‌ఏను సేకరించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు ఎదురయ్యాయి, వాటి బారినుంచి పరిశోధన బృందం తప్పించుకుందా లేదా అనేదాన్ని ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రం జూలై 2న ఇంగ్లీష్, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల కానుంది.

మురిపించని తగ్గింపు
సెన్సెక్స్ 198 పాయింట్లు డౌన్

ముంబై: సుదీర్ఘ విరామం అనంతరం ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించినప్పటికీ ఇన్వెస్టర్లు అంతగా మురిసిపోలేదు. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, పవర్ రంగాల షేర్లలో లాభాల స్వీకారానికి విదేశీ నిధుల తరలింపు జోడు కావడంతో తీవ్ర ఆటుపోట్లకు లోనైన ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా నష్టాల్లో ముగిసింది. శుక్రవారం ఇంట్రాడేలో 582.42 పాయింట్లు నష్టపోయి 77,475.74 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 197.97 పాయింట్లకు కుదించుకుని 77,860.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 43.40 పాయింట్ల నష్టంతో 23,559.95 వద్ద క్లోజైంది.

ఎల్ఐసీ లాభం రూ.11,056 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో రూ.11,056 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.9,444 కోట్లు)తో పోల్చితే లాభం 17 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికంలో వ్యయ నిష్పత్తి తగ్గటం ఎంతగానో కలిసి వచ్చిందని ఎల్ఐసీ పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో నికర ప్రీమియం ఆదాయం రూ.1,17,017 కోట్ల నుంచి రూ.1,06,891 కోట్లకు తగ్గింది. మరోవైపు మొత్తం ఆదాయం కూడా రూ.2,12,447 కోట్ల నుంచి రూ.2,01,994 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో వ్యయాలు రూ.18,194 కోట్ల నుంచి రూ.14,416 కోట్లకు తగ్గాయి. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తుల్లో మార్పులు చేయటంతో పాటు వ్యూహాత్మకంగా వ్యవహరించటం ఎంతగానో కలిసివచ్చిందని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు.

24% తగ్గిన నవ లిమిటెడ్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నవ లిమిటెడ్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 24 శాతం క్షీణించి రూ.353.30 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.465 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 11.7 శాతం తగ్గి రూ.995 కోట్ల నుంచి రూ.878.10 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక కాలంలో మాంబా ఎనర్జీ రూ.546.80 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.291.30 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.295.8 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.47.4 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	443
చిత్తూరు	493	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	93	విజయవాడ	109
వరంగల్	93	గుంటూరు	104
కరీంనగర్	93	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	86
కర్నూలు	93	నెల్లూరు	91
విశాఖపట్నం	101	అనంతపురం	91
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,550 ▲	79,350 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	80,500 ▼	97,500 ▼
విశాఖపట్నం	84,710 ▲	77,650 ▼	96,020 ▲
రాజమండ్రి	86,510 ▲	79,300 ▲	98,800 ▼
ప్రొద్దుటూరు	86,200 ▲	79,820 ▼	96,500 ▲
ముంబై	84,699 ▲	77,584 ▲	95,391 ▲

రుణగ్రహీతలకు రిలీఫ్

ఐదేళ్ల తర్వాత తొలిసారిగా కీలక వడ్డీ రేటు 0.25% తగ్గింపు


ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో డిప్యూటీ గవర్నర్లు

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు ● ఈఎంఐల భారం కూడా..

- 6.25 శాతానికి తగ్గిన రెపో రేటు
- 2025-26 వృద్ధి అంచనా 6.7 శాతం
- ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గొచ్చు..
- ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- ఏప్రిల్ 7-9 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లతో పాటు ఇప్పటికే తీసుకున్న రెపో ప్రామాణిక రుణాలపై ఈఎంఐల భారం కూడా తగ్గనుంది. ఎందుకంటే, కీలక వడ్డీ (రెపో) రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. దాంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగివచ్చింది. రెపో రేటును తగ్గించడం ఐదేళ్ల (2020 మే) తర్వాత ఇదే తొలిసారి. రెండున్నరేళ్ల సుదీర్ఘ యథాతథ స్థితి తర్వాత రెపోను సవరించడం కూడా ఇదే మొదటిసారి. అంతేకాదు, ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన తొలి ద్రవ్యపరపతి సమీక్షలోనే రేటు తగ్గింపునకు శ్రీకారం చుట్టడం మరో విశేషం.

ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజులపాటు సమావేశమైంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు వడ్డీ రేటును పావు శాతం తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవంగా ఓటేశారు. పరపతి విధానంపై తటస్థ వైఖరిని మాత్రం అలాగే కొనసాగించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. అత్యెసరు ఆదాయం, ధరాఘాతంతో సతమవుతున్న మధ్య తరగతి వర్గాలపై కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో వరాల జల్లు కురిపించింది. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి రూ.12 లక్షల వరకు వార్షికాదాయంపై పన్ను ఊరట కల్పించింది. తాజాగా ఆర్‌బీఐ సైతం రుణగ్రహీతల కోసం వడ్డీ భారాన్ని తగ్గించింది. ఈ ఏడాది ఏప్రిల్ 7-9 తేదీల్లో తదుపరి సమీక్షను నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

ధరలు తగ్గుముఖం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సగటు 4.2 శాతానికి తగ్గవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2024-25 ద్రవ్యోల్బణం అంచనాను మాత్రం యథాతథంగా 4.8 శాతంగా కొనసాగించింది. సరఫరా అవాంతరాలు ఎదురుకాని పక్షంలో, మెరుగైన ఖరీఫ్ దిగుబడితో ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ సుంకాల దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీలు, ఇంధన ధరల పెరుగుదల అవకాశాలు, వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులతో ధరలు మళ్లీ పెరిగే ప్రమాదం లేకపోలేదన్నారు.

చాలాకాలంగా ఎదురుచూస్తున్న రుణగ్రహీతలకు రెపో తగ్గింపుతో కొంత ఉపశమనం లభించనుందని, ఆర్థిక వృద్ధికి సైతం ఈ నిర్ణయం దోహదపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ నిర్ణయాన్ని పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. మున్ముందు రెపో మరింత తగ్గేందుకు పునాదులు వేసిందన్నారు. పన్ను ఊరట ద్వారా వినియోగం పెంచేందుకు బడ్జెట్లో ప్రకటించిన చర్యలకు రెపో తగ్గింపు మరింత తోడ్పడనుందన్నారు. ఆర్థిక పునరుద్ధరణకు దోహదపడనుందన్నారు. రెపో పావు శాతం తగ్గింపుతో రియల్టీ రంగానికి ప్రత్యక్ష ప్రయోజనం కొంతేనని.. గృహాలకు డిమాండ్ పుంజుకునేందుకు వడ్డీ రేట్లు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని క్రెడాయ్ అభిప్రాయపడింది. వాహన రంగం మాత్రం సంతోషం వ్యక్తం చేసింది. టూవీలర్లు, చిన్న కార్ల విక్రయాలు పెరిగేందుకు తోడ్పడవచ్చని అభిప్రాయపడింది.

7 శాతానికి పైగా వృద్ధి సాధ్యమే..

భారత్ 7 శాతానికి పైగా వృద్ధిని సాధించగలదని, మనం అందుకోసం ఆకాంక్షించాలని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతానికి పెరగవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. మెరుగైన రబీ దిగుబడితో పాటు పారిశ్రామికోత్పత్తిలో పునరుద్ధరణ ఇందుకు దోహదపడనున్నాయని మల్హోత్రా అన్నారు. అలాగే, ఈసారి బడ్జెట్లో ప్రకటించిన పన్ను ఊరటతో ప్రైవేటు వినియోగానికి ఊతం లభించనుందని, ఇది కూడా వృద్ధికి చోదకంగా పనిచేయనుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో మాత్రం వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కావచ్చని ప్రభుత్వం ఈ మధ్యనే అంచనాలను విడుదల చేసింది.

బ్యాంకులకు ప్రత్యేక డొమైన్ నేమ్స్

దేశీయ ఆర్థిక సేవల రంగంలో భారీగా పెరిగిన డిజిటల్ మోసాలకు మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత బ్యాంకులకు 'బ్యాంక్.ఇన్', నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) 'ఫిన్.ఇన్' ప్రత్యేక డొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ ఏప్రిల్ నుంచి బ్యాంకులకు బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుందని, ఆ తర్వాత ఎన్‌బీఎఫ్‌సీలకు ఫిన్.ఇన్ డొమైన్ నేమ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. కాగా, కార్డు లేకుండా ఆన్‌లైన్‌లో జరిపే అంతర్జాతీయ చెల్లింపుల్లో అదనపు ధ్రువీకరణను ప్రవేశపెట్టాలని కూడా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జారీ చేసిన కార్డులతో జరిపే అంతర్జాతీయ చెల్లింపులకు అదనపు ధ్రువీకరణ ఇప్పటికే అమలులో ఉంది.

జలాన్ కమిటీ సిఫారసులపై అంతర్గత సమీక్ష

ఆర్‌బీఐ మిగులు నిధుల బదిలీకి సంబంధించి ఎకనామికల్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్)పై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ చేసిన సిఫారసులపై అంతర్గత సమీక్ష కొనసాగుతోందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం ఈ ఫ్రేమ్‌వర్క్‌లో ఆకస్మిక అవసరాలు, నష్టాల కోసం బ్యాలెన్స్‌షీట్‌లో గరిష్ఠంగా 6.5 శాతం వరకు నిల్వను కేటాయించవచ్చు. గత ఏడాది ఆర్‌బీఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల మిగులు నిధులను ప్రభుత్వానికి బదిలీ చేసింది.

కేవలం ఈసారే పాలసీ సడలింపు!

ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కేవలం ఈ సమావేశంలో ద్రవ్య పరపతి విధానాన్ని కాస్త సడలించడం జరిగిందని, తద్వారా రెపో రేటును 0.25 శాతం తగ్గించగలిగామని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. మున్ముందు సమీక్షల్లోనూ ఇదే వైఖరి ఉండబోదన్నారు. వృద్ధికి మద్దతిస్తూనే ద్రవ్యోల్బణాన్ని లక్ష్యం మేరకు నియంత్రించే దిశగా పరపతి విధాన వైఖరి ఉంటుందన్నారు. దీర్ఘకాలంపాటు ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆందోళనకరం

రూపాయి విలువ క్షీణత కూడా ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. రూపాయి విలువ 5 శాతం క్షీణిస్తే, దిగుమతుల భారం పెరిగి ద్రవ్యోల్బణం 0.30 శాతం మేర పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే, రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గుల కంటే అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఆర్‌బీఐ పాలిట అతిపెద్ద ఆందోళనకర అంశంగా మారిందన్నారు. ఎందుకంటే, అంతర్జాతీయ అనిశ్చితులు ఆర్థిక వృద్ధి, పెట్టుబడి నిర్ణయాలు, వినియోగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయన్నారు.

బడ్జెట్ భళా

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. బడ్జెట్ ప్రకటనలు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతోపాటు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యానికి తోడ్పడేలా ఉన్నాయన్నారు. భారీ పన్ను ఊరటతో మధ్యతరగతి వర్గాల చేతుల్లోకి అదనంగా రూ.లక్ష కోట్లు అందుబాటులోకి రానున్నాయని.. తద్వారా మార్కెట్లో వినియోగం పెరగనుందన్నారు.

గృహ రుణాలపై తగ్గనున్న భారం

ఐదేళ్ల తర్వాత ఆర్‌బీఐ గృహ రుణాలు తీసుకునే వారికి శుభవార్త చెప్పింది. శుక్రవారం జరిగిన భేటీలో రెపో రేటును 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. దీంతో బ్యాంకులు కూడా గృహ, ఇతర రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించనున్నాయి. రెపో రేటు తగ్గింపు ప్రభావం గృహ రుణాల ఈఎంఐలపై ఎలా ఉంటుందంటే? ప్రస్తుతం బ్యాంకులు మంచి పరపతి రేటింగ్ ఉన్న వ్యక్తులకు ఇచ్చే గృహ రుణాలపై కనీసం 9 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఇది 8.75 శాతానికి తగ్గనుంది. మంచి పరపతి రేటింగ్ ఉన్న ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి తాను తీసుకున్న రూ.30 లక్షల గృహ రుణంపై ప్రస్తుతం 9 శాతం వడ్డీ రేటు చొప్పున నెలకు రూ.26,992 ఈఎంఐగా చెల్లిస్తున్నారు. బ్యాంకులు ఈ వడ్డీ రేటును 8.75 శాతానికి కుదిస్తే ఈ ఈఎంఐ భారం రూ.26,551కు తగ్గనుంది. అంటే నెలకు చెల్లింపు భారం 1.78 శాతం (రూ.480) తగ్గనుంది.

ఏది బెటర్: ప్రస్తుతం గృహ రుణాలు తీసుకున్న వారి ముందు రెండు మార్గాలున్నాయి. అందులో ఒకటి తగ్గే వడ్డీ రేటుకు అనుగుణంగా ఈఎంఐల భారం తగ్గించుకోవడం. రెండోది ఈఎంఐ చెల్లింపు మొత్తాన్ని అలాగే ఉంచుకుని రుణ చెల్లింపు కాలపరిమితి తగ్గించుకోవడం. రెండో ఆప్షన్‌తో గృహ రుణం త్వరగా తీరిపోయి ఇల్లు పూర్తిగా సొంతమవుతుంది.

ఇది ఎలాగంటే: ఒక వ్యక్తి ఏడాది క్రితం 20 ఏళ్లలో చెల్లించేలా తొమ్మిది శాతం వడ్డీ రేటుతో రూ.50 లక్షల గృహ రుణం తీసుకున్నాడనుకుందాం. ఈ వడ్డీ రేటు ప్రకారం రుణ కాల పరిమితి తీరేసరికి అతడు చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం దాదాపు రూ.58 లక్షలు. ఇప్పుడు వడ్డీ రేటు అర శాతం తగ్గితే 20 ఏళ్లలో చెల్లించాల్సిన ఈఎంఐల మొత్తం రూ.50 లక్షలకు తగ్గుతుంది. పాత ఈఎంఐనే కొనసాగిస్తే చెల్లింపు కాలపరిమితి 240 నెలల నుంచి 222 నెలలకు తగ్గుతుంది. అదే వడ్డీ రేటు పావు శాతం మాత్రమే తగ్గి, పాత ఈఎంఐ కొనసాగిస్తే చెల్లింపుల కాలపరిమితి 240 నుంచి 230కి తగ్గుతుంది.

పన్ను ఆదాను కూడా కలిపితే: వారం రోజుల క్రితం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో వేతన జీవులకు రూ.12 లక్షల ఆదాయంపై జీరో ఆదాయపు పన్ను ప్రయోజనం కల్పించడంతో పాటు అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితులు పెంచారు. దీనికి తోడు గృహ రుణాలపై వడ్డీ మినహాయింపులు కూడా పెంచారు. ఆర్‌బీఐ రెపో రేటు కోతతో ఈ ప్రయోజనాలను కూడా జోడించినట్టయితే వారికి కలిగే లాభం మరింత అధికంగా ఉంటుంది.

రెండు అగ్రగామి బ్యాంకుల్లో ఈఎంఐల తగ్గింపు ఎంత ఉండొచ్చంటే..

బ్యాంకు	మొత్తం రుణం (రూ.)	కాలపరిమితి (సం.)	ప్రస్తుత వడ్డీరేటు (%)	ఈఎంఐ (రూ.)	కొత్త వడ్డీరేటు (%)	ఈఎంఐ (రూ.)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	50 లక్షలు	30	8.75	39,335	8.5	38,446
	1 కోటి	30	8.75	78,670	8.5	76,891
ఎస్‌బీఐ	50 లక్షలు	30	9.55	42,225	9.3	41,315
	1 కోటి	30	9.55	84,450	9.3	82,630

ఆటో రుణాలపై ఈఎంఐ తగ్గుదల ఎంతంటే.. రుణం మొత్తం (రూ.)	9.4% వడ్డీపై ఈఎంఐ	9.15% వడ్డీపై ఈఎంఐ
5 లక్షలు	10,477	10,416
7 లక్షలు	14,667	14,582
10 లక్షలు	20,953	20,831

బ్యాంకులు ఎప్పుడు అమలుపరుస్తాయి: ఆర్‌బీఐ రెపో తగ్గింపు చర్యకు స్పందిస్తూ బ్యాంకులు వడ్డీ రేటు తగ్గించడం అనేది ఆయా బ్యాంకులు అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అయితే బ్యాంకులు కొత్త రెపో రేటుకు దీటుగా తమ రుణ, డిపాజిట్ రేట్లను సవరించేందుకు గరిష్ఠంగా రెండు వారాల వరకు సమయం పడుతుంది. రేట్ల కోత ప్రకటించిన అనంతరం బ్యాంకులు తమ లిక్విడిటీ స్థితి, నిధుల సమీకరణ వ్యయం, మార్కెట్లో పోటీ అన్నింటినీ మదింపు చేసుకుని వడ్డీ రేటు తగ్గింపు నిర్ణయం తీసుకుంటాయి.

వచ్చేసింది.. 'ముక్కోణం'

నేటి తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ x న్యూజిలాండ్ ఢీ
మ.2.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..


ట్రోఫీతో కెప్టెన్లు శాంట్నర్, బవుమా, రిజ్వాన్

షెడ్యూల్
ఫిబ్రవరి 8: పాకిస్థాన్xన్యూజిలాండ్, మ.2.30 నుంచి
ఫిబ్రవరి 10: న్యూజిలాండ్xదక్షిణాఫ్రికా, ఉ.10 నుంచి
ఫిబ్రవరి 12: పాకిస్థాన్xదక్షిణాఫ్రికా, మ.2.30 నుంచి
ఫిబ్రవరి 14: ఫైనల్. మ.2.30 నుంచి

లాహోర్: హోరెత్తుతున్న టీ20 యుగంలో పూర్తిగా మసకబారిన ముక్కోణపు వన్డే సిరీస్‌కు మరోసారి రంగం సిద్ధమైంది. ఈనెల 19 నుంచి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ముక్కోణపు సిరీస్ జరుగుతుండడం ఒకింత ప్రాధాన్యతను సంతరించుకుంది. పాకిస్థాన్, న్యూజిలాండ్‌తోపాటు దక్షిణాఫ్రికా ఈ సిరీస్‌లో తలపడుతున్నాయి. మూడు జట్లు ఒక్కో మ్యాచ్‌లో తలపడతాయి. ఆపై ఫైనల్ ఉంటుంది. ఇక..శనివారం జరిగే ప్రారంభ మ్యాచ్‌లో పాకిస్థాన్-న్యూజిలాండ్ ఢీకొంటాయి. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు జరిగే వేదికలైన లాహోర్, కరాచీల్లోనే ఈ సిరీస్ కూడా జరగనుంది. ముక్కోణపు సిరీస్‌కు పాకిస్థాన్, న్యూజిలాండ్ పూర్తిస్థాయి జట్లతో బరిలోకి దిగుతున్నాయి. కానీ ఎస్ఏటీ20 లీగ్, గాయాల బెడదతో బలహీనపడిన జట్టుతో సఫారీలు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దక్షిణాఫ్రికా జట్టులో ఏకంగా అరుగురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లున్నారు. పాకిస్థాన్‌కు రిజ్వాన్, న్యూజిలాండ్‌కు శాంట్నర్, దక్షిణాఫ్రికా జట్టుకు బవుమా కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.

స్పోర్ట్స్



అజయ్.. ఆఖరి శతక అభివాదం

అంధుల క్రికెట్‌కు అజయ్ వీడ్కోలు

ఆఖరి మ్యాచ్‌లో శతకం బాదిన మాజీ కెప్టెన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల జట్టు మాజీ కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల అజయ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా మాచర్ల. అజయ్ క్రికెట్ కెరీర్‌లో వన్డే, టీ20ల్లో కలిపి 101 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అజయ్ కెప్టెన్సీలో టీమిండియా 2016 ఆసియా కప్, 2017 టీ20 వరల్డ్‌కప్, 2018 వన్డే ప్రపంచకప్, 2022 టీ20 వరల్డ్‌కప్ సాధించింది. ఇక, 28 రాష్ట్రాలు పాల్గొన్న నగేష్ జాతీయ టీ20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరు వేదికగా ఢిల్లీతో జరిగిన ఫైనల్లో ఆంధ్ర 67 పరుగుల తేడాతో నెగ్గి, ట్రోఫీ సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 251 పరుగులు చేసింది. అజయ్ 45 బంతుల్లో 104 పరుగులతో తన చివరి మ్యాచ్‌లో సెంచరీ కొట్టి కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఛేదనలో ఢిల్లీ 9 వికెట్లకు 184 పరుగులే చేసి ఓడింది. 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సహకరించిన కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

సినిమా చూస్తుండగా.. ఫోనొచ్చింది


శ్రేయాస్ అయ్యర్

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీకి గాయం కావడంతో అనూహ్యంగా బరిలోకి దిగిన శ్రేయాస్ అదిరే ఆటతో ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడాడు. హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలకమయ్యా డు. అయితే ఈ మ్యాచ్‌లో ఆడడం వెనుక ఓ ఆసక్తికర విషయాన్ని శ్రేయాస్ పంచుకున్నాడు. 'తొలి వన్డేలో ఎలాగూ చోటు దక్కదని తెలుసుకాబట్టి మ్యాచ్‌కు ముందు రోజు నేను హాయిగా సినిమా చూస్తున్నా. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ నుంచి ఫోనొచ్చింది. విరాట్‌కు మోకాలిలో వాపు వచ్చింది. నీకు మ్యాచ్ ఆడే అవకాశం రావచ్చు. సిద్ధంగా ఉండమని చెప్పాడు. అంతే.. వెంటనే నా గదికి వెళ్లి పడుకున్నా. అలా విరాట్ దూరం కావడంతోనే నాకు అవకాశం దక్కింది' అని శ్రేయాస్ తెలిపాడు.

రెండో వన్డేలో కోహ్లీ ఆడతాడు

కోహ్లీ ఫిట్‌నెస్‌పై ఆందోళన అవసరం లేదని వైస్-కెప్టెన్ గిల్ స్పష్టంజేశాడు. మోకాలి వాపు నుంచి అతడు కోలుకున్నాడని, ఆదివారం కటక్‌లో జరిగే రెండో వన్డేలో ఆడతాడని ప్రకటించాడు.

ఆశ్చర్యమే..: పాంటింగ్

చాలా రోజులుగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అన్నాడు. గతేడాది ఆరంభం నుంచి వన్డేల్లో.. 2023 చివర నుంచి టీ20ల్లోనూ శ్రేయా‌స్‌కు భారత జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు శ్రేయాస్‌లాంటి సమర్థుడైన బ్యాటర్‌ను పక్కనబెట్టడం మానుకోవాలని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా సూచించాడు. వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో నెంబర్‌లో ఆడి 500+ పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా శ్రేయాస్ నిలిచిన విషయం మరువరాదని గుర్తుచేశాడు.

స్మిత్ @36

- స్టీవ్, క్యారీ శతకాలు
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 330/3


స్టీవ్ స్మిత్ (120 బ్యాటింగ్)

గాలె: ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ (120 బ్యాటింగ్) టెస్టుల్లో 36వ శతకం పూర్తి చేశాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో ఎక్కువ సెంచరీలు బాదిన జాబితాలో ద్రవిడ్, రూట్‌లతో కలిసి ఐదో స్థానంలో నిలిచాడు. సచిన్ (51) టాప్‌లో ఉన్నాడు. మరోవైపు అన్ని ఫార్మాట్లలో కలిపి స్మిత్‌కిది 48వ శతకం కాగా.. ఇందులో ద్రవిడ్, రోహిత్ సరసన నిలిచాడు. ఇక శ్రీలంకతో జరుగుతున్న ఈ రెండో టెస్టులో స్మిత్‌కు జతగా క్యారీ (139 బ్యాటింగ్) కూడా అజేయ శతకం బాదడంతో రెండో రోజు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 330/3 స్కోరుతో నిలిచింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకు ఆలౌటైంది.

హర్షప్రదకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణకు 38వ జాతీయ క్రీడల్లో తొలి రజత పతకం లభించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం ముగిసిన తైక్వాండో 73 కిలోల కియోర్గి విభాగం ఫైనల్లో చండీగఢ్ అమ్మాయి ఇతీషా దాస్ 2-0తో తెలంగాణ ప్లేయర్ హర్షప్రదను ఓడించింది. హర్షప్రదను తెలంగాణ తైక్వాండో సంఘం అధ్యక్షుడు డి.సతీష్ గౌడ్ అభినందించారు. పతకాల పట్టికలో తెలంగాణ ప్రస్తుతం ఒక స్వర్ణం సహా మొత్తం ఆరు పతకాలతో 28వ స్థానంలో ఉంది.

ఫేవరెట్ ముంబై

- హరియాణాతో క్వార్టర్స్
- నేటినుంచి రంజీట్రోఫీ

స్పోర్ట్స్ 18లో ఉ.9 నుంచి


సూర్య

కోల్‌కతా: రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లకు వేళైంది. మొత్తం.. నాలుగు మ్యాచ్‌లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ప్రారంభం కానున్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై..హరియాణాతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే చేరికతో ముంబై అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. మేఘాలయతో గత మ్యాచ్‌లో సిద్ధేష్, ఆకాష్, షామ్స్ ములానీ సెంచరీలు చేశారు. ఈ నేపథ్యంలో ఫేవరెట్‌గా బరిలో దిగుతున్న ముంబైని ఎదుర్కోవడం హరియాణాకు సవాలే. ఇక ఇతర మ్యాచ్‌ల్లో..రాజ్‌కోట్‌లో గుజరాత్-సౌరాష్ట్ర, నాగ్‌పూర్‌లో విదర్భ-తమిళనాడు, పుణెలో కేరళ-జమ్మూ కశ్మీర్ జట్లు తలపడతాయి.

కేంద్రం జాతీయ హోదా నిరాకరిస్తే ఏం చేస్తున్నారు?

» పాలమూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు స్పందించాలి

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో సాగునీటి వనరులు పెంచేందుకు గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం తగదని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఆమె పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి కేంద్రంలోని బీజేపీ సర్కార్ వివక్ష చూపుతోందని, తెలంగాణ ప్రయోజనాలను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విస్మరించాయని ఆరోపించారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలున్నా.. రాష్ట్రానికి చేసింది సున్నా.. అని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లోనూ తెలంగాణకు అన్యాయం చేశారని, మన సంస్కృతి, పండుగలను పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, అదేవిధంగా తెలంగాణకు నిధుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై కూడా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు స్పందించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

రేవంత్, మందకృష్ణను ఏపీలో సన్మానిస్తా

» వర్గీకరణకు చంద్రబాబు మద్దతు: డొక్కా మాణిక్య వరప్రసాద్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మందకృష్ణ మాదిగ అంగీకరిస్తే.. వారిద్దరినీ ఏపీ రాజధాని అమరావతిలో సన్మానించాలని ఉందని ఏపీ మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. త్వరలోనే రేవంత్‌రెడ్డిని కలిసి ఇరు రాష్ట్రాల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తానని చెప్పారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన కుల గణన, ఎస్సీ వర్గీకరణ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. వర్గీకరణకు ఏపీ సీఎం చంద్రబాబు పూర్తి మద్దతు ఇచ్చారని తెలిపారు.

వర్గీకరణతో ఎస్సీలందరికీ న్యాయం: సంపత్

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ అమలుతో ఎస్సీలందరికీ న్యాయం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పేర్కొన్నారు. అధికారిక లెక్కలు, 2011 జనాభా సర్వే ను ప్రాతిపదికగా తీసుకోవడం ద్వారా అనుమానాలకు తావులేదన్నారు. భవిష్యత్‌లో కేంద్రం జనాభా లెక్కల సర్వే చేపడితే ఎస్సీల్లో పెరిగే జనాభా మేరకు రిజర్వేషన్లు పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో మాలలతో పోల్చితే మాదిగల జనాభా రెండింతలుందన్నారు. ఎస్సీల్లో భావ సారూప్యత, సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ 8 వేలకు పైగా అభ్యర్థనలను పరిశీలించి నివేదికను రూపొందిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ దోషులెలా అవుతారని ఆయన ప్రశ్నించారు.



గాంధీభవన్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో వి.హన్మంతరావు, ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్‌అలీ, సునీతరావు తదితరులు

ట్రంప్ అంటే మోదీకి భయం

» కేంద్ర వైఫల్యంతోనే భారతీయులకు అవమానం: కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అమెరికా చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం గాంధీభవన్‌లో భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించింది. ఈ సందర్భంగా నేతలు చేతులకు బేడీలు వేసుకుని ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత పౌరులకు బేడీలు వేసి ఉగ్రవాదుల వలే బలవంతంగా పంపివేస్తున్నప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాకు గులాంగిరి బంద్ కరో అంటూ మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం వైఫల్యం కారణంగానే 104 మంది భారతీయులను ట్రంప్ ప్రభుత్వం తిరిగి పంపివేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. భారతీయులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అమెరికాను నిలదీయడానికి విదేశాంగ మంత్రి జైశంకర్‌కు దమ్ములేదని, ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారని పేర్కొన్నారు. విశ్వ గురువులు భయపడుతారా? అని నిలదీశారు. రష్యా, ఉక్రెయిన్ దాడులను ఆపేవాళ్ళు అమెరికాలో ఉన్న మనవాళ్ళని గౌరవంగా తీసుకురాలేరా? అని ప్రశ్నించారు.

క్యారెక్టర్ ఉంది... భయం లేదు!

» అందుకే ఎవరికీ లొంగలేదు: సాయిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబులిటీ ఉండాలి. సాయిరెడ్డికైనా, ఇంకెవరికైనా ఇదే వర్తిస్తుంది' అంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. గతంలోనే వైసీపీని వీడిన మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ కూడా జగన్ వ్యాఖ్యలపై స్పందించారు. 'నేను ప్రలోభాలకు లొంగలేదు. నాకు భయం లేదు' అని సాయిరెడ్డి 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని. అందుకే ఎవరికీ, ఎలాంటి ప్రలోభాలకీ లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు అణువులోనూ లేదు. కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని... మరి రాజకీయాలనే వదులుకున్నా" అని తెలిపారు. "మేము ప్రలోభాలకు లొంగే వాళ్లం, భయపడే వాళ్లం అవునో కాదో నా నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు. అంతకంటే ముందు జగన్‌కు కూడా తెలుసు. నాకు కొత్తగా సర్టిఫికెట్ అవసరం లేదు" అని మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఒక వేళ భయపడే వాడినైతే జగన్‌తో పాటు కేసులో పెట్టినప్పుడే పారిపోయే వాడినన్నారు.

అభ్యంతరాలకు రుసుంపై విద్యార్థుల ఆగ్రహం

» రూ.500 ఫీజును తొలగించాలని డిమాండ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్, పీజీఈసెట్ తదితర ప్రవేశపరీక్షల ప్రాథమిక 'కీ'లపై అభ్యంతరాలను తెలిపేందుకు రుసుము విధించడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల పలు కామన్ ప్రవేశ పరీక్ష(సెట్)లకు షెడ్యూళ్లను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి అధికారులు.. ప్రాథమిక 'కీ'లపై అబ్జెక్షన్ తెలిపిన విద్యార్థులు రూ.500 రుసుం చెల్లించాలని ప్రకటించడాన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. తెలంగాణ సెట్‌లకు అధికంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించాలని, ప్రాథమిక కీ అభ్యంతరాలకు రూ.500 ఫీజు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డిని కలిసి విద్యార్థి సంఘాల ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. సెట్‌ల నిర్వహణ, అభ్యంతరాలకు రుసుము, పరీక్షాకేంద్రాల లొకేషన్ వంటి అంశాలపై విద్యార్థి సంఘాల విన్నపాలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. బాలకిష్టారెడ్డిని కలిసిన విద్యార్థి సంఘాల ప్రతినిధుల్లో రాహుల్, ఇంద్రాణి, హేమంత్ సిద్ధార్థ, దుర్గాప్రసాద్, బూర్గ తనూజ్, జవ్వాజీ దిలీప్ తదితరులున్నారు.

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి రూ. 251 కోట్ల ఖర్చు

» రాజ్యసభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం ఇప్పటి వరకు రూ. 251 కోట్ల పెట్టుబడి పెట్టామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. శుక్రవారం రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రామచంద్ర అడిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనుల విలువ రూ.521.36 కోట్లని, 2024 డిసెంబరు వరకు రూ. 251 కోట్ల నిధులను ఖర్చు చేశామని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 2023 జూలైలో శంకుస్థాపన చేసిన రైల్వే వ్యాగన్ పరిశ్రమ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఈ సందర్భంగా రామచంద్ర అన్నారు.

రూ.15 వేల కోట్ల నిధుల కోసం కృషి చేయండి

కాంగ్రెస్ ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి సూచన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.15 వేల కోట్ల నిధులు వచ్చేలా కృషి చేయాలని తెలంగాణకి చెందిన కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అందుబాటులో ఉన్న ఎంపీలతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో కేంద్ర పథకాలకు అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.5.50 లక్షల కోట్లు రావాల్సి ఉందని, అందులో తెలంగాణకు రావాల్సిన నిధులు రూ.15 వేల కోట్లు ఉన్నాయని ఎంపీలకు తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ నిధుల వివరాలపై వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రధానంగా కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల నుంచి రాష్ట్రానికి నిధులు రావాల్సి ఉందని ఎంపీలకు ఉపముఖ్యమంత్రి వివరించారు. కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ పనులు, నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిన బుక్‌లెట్‌లను ఈ సందర్భంగా ఎంపీలకు అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్యలతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

సర్వేలో పాల్గొనని కేసీఆర్‌కు.. అడిగే హక్కు ఎక్కడిది?

బలహీన వర్గాల గురించి ఆయన మాట్లాడడమా..

» అప్పట్లో సమగ్ర కుటుంబ సర్వే కేసీఆర్ ఇంటికే పరిమితం

» కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు పార్టీ పదవులు.. బీసీలకు ఒక్కటైనా ఇచ్చారా?

» బీసీని సీఎం చేస్తానన్న బీజేపీ... సభాపక్ష పదవిని రెడ్డికి ఇచ్చింది: పొన్నం

» ఫాంహౌస్‌లో ఉండేవాళ్లకు రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు లేదు: కోమటిరెడ్డి

సిద్దిపేట, భీమదేవరపల్లి, యాదాద్రి, హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సర్వేలో భాగస్వామి కాని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు బలహీన వర్గాల గురించి మాట్లాడే హక్కు లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు కనీసం న్యాయం చేయాలనే ఆలోచన కూడా వారికి లేదన్నారు. సర్వేపై అసెంబ్లీలో చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా? అని ప్రశ్నించారు. బీసీల జనాభా 56శాతం అని తేలిందని.. బీఆర్ఎస్ పార్టీనేమో 51శాతం అని చెబుతోందని ఈ విషయమ్మీద అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం అని చెప్పారు. బీసీ నేత అయినందునే ఈటల రాజేందర్‌ను బీఆర్ఎస్ గెంటేసిందని విమర్శించారు. శుక్రవారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో జరిగిన కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. అప్పట్లో బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వే కేసీఆర్ ఇంటికే పరిమితమైందన్నారు. సీఎంగా కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్, శాసనసభా పక్షనేతగా హరీశ్‌రావు పదవులు అనుభవించారని.. ఆ పార్టీ నుంచి బీసీలకు ఒక్క పదవైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయని బీఆర్ఎస్ నేతలు ఏ హక్కుతో బీసీల గురించి మాట్లాడతారని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే.. బీసీని సీఎం చేస్తామని బీజేపీ ఎన్నికల్లో చెప్పిందని.. అయితే ఆ పార్టీ శాసనసభా పక్ష పదవిని ఓ రెడ్డికి ఇచ్చారని, బీసీల గురించి మాట్లాడే హక్కు కమలం నేతలకు ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. బీసీలను తక్కువ సంఖ్యలో చూపిస్తే ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం ఏమిటి? అనేది బీసీ మేధావులు, నాయకులు ఆలోచించాలని కోరారు. కాగా కులగణనలో పాల్గొనకుండా ఫామ్‌హౌస్‌లో ఉన్న వాళ్లకు సర్వేలో లోపాలు, రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా హడావుడిగా సర్వే చేయలేదని, తాము చేసిన సర్వేను ప్రజల ముందు పెట్టామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 12గంటల పాటు దొంగ కుటుంబసర్వే చేసి.. 51శాతం బీసీలున్నారని తేల్చారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామన్నారు. కాగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు క్రమశిక్షణ సంఘం నోటీసు ఇవ్వడంపై మంత్రిని ప్రశ్నించగా ఆయన విషయంలో తనకు మాట్లాడేంత సమయం లేదని, మాట్లాడటం కూడా వృథా అన్నారు. మరోవైపు.. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన సమగ్ర కుల సర్వే-2024పై వెల్లువెత్తిన అభ్యంతరాలపై బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పందించారు. 3,56,323 ఇళ్లలో సర్వేనే నిర్వహించలేదని, ఆ కారణంగా గ్రేటర్ పరిధిలో బీసీల జనాభా తగ్గినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సర్వే చేసిన ఇళ్లు, చేయని ఇళ్ల వివరాలు.. ఎన్యుమరేటర్ల వివరాలను వారం రోజుల్లో అందించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.





ప్రభుత్వం ఒత్తిడిలో నివేదిక ఇస్తే అసలుకే మోసం: వకుళాభరణం

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడితో సమగ్ర అధ్యయనం చేయకుండా డెడికేటెడ్ కమిషన్ హడావుడిగా నివేదిక సమర్పిస్తే గనక అసలుకే మోసం జరిగే ప్రమాదం ఉందని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో నివేదిక కోసం డెడికేటెడ్ కమిషన్‌పై ప్రభుత్వం ఒత్తిడి పెంచుతున్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సామాజిక ఆర్థిక కుల సర్వే వివరాల్లో బీసీలతో పాటుగా ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గిందనే ఆరోపణల నేపథ్యంలో డెడికేటెడ్ కమిషన్ సమగ్ర విశ్లేషణలు, అధ్యయనాలతో నివేదిక రూపొందించాలని సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రామాణిక పద్ధతులు పాటించకుండా ప్రభుత్వం ఇచ్చే జనాభా లెక్కలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే డెడికేటెడ్ కమిషన్ నివేదిక న్యాయస్థానాల్లో వీగిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు.



బ్లాక్ ఫిలిం డ్రైవ్‌లో పాల్గొన్న నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్

సబిత కుమారుడి వాహనంపై 26 వేల పెండింగ్ చలానాలు

ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద శుక్రవారం పశ్చిమ మండలం ట్రాఫిక్ పోలీసులు బ్లాక్ ఫిలిం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. ఇదే సమయంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి రెండవ కుమారుడు కౌశిక్‌రెడ్డి కారు వచ్చింది. వాహనం నెంబర్ ఆధారంగా పరిశీలించగా 28 పెండింగ్ చలానాల్లో భాగంగా 26 వేల రూపాయలు బకాయి ఉన్నట్టు తేలింది. వెంటనే బకాయి చెల్లించాలని పోలీసులు సూచించారు. అనంతరం కారుకు ఉన్న బ్లాక్ ఫిలింను తొలగించారు. అలాగే చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వాహనం రాగా.. దాన్ని పరిశీలించగా 9 చలానాల్లో భాగంగా 3145 రూపాయల బకాయి ఉన్నట్టు తేలింది. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో ఏ ఒక్కరిని వదిలేది లేదని స్పష్టం చేశారు. పెద్ద హారన్‌లు, కనిపించని నెంబర్ ప్లేట్‌లు, బ్లాక్ ఫిలిం ఇలా ప్రతి అంశంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్ పాల్గొన్నారు.

19 మంది హైకోర్టు జడ్జిల ఫోన్ల ట్యాపింగ్

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారని తెలిపారు. వాటితోపాటు ఇతర అన్ని వివరాలతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు పిటిషనర్ ఈ-మెయిల్ పంపారని పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించడానికి పిటిషనర్ సిద్ధమని చెప్పారు. కాగా, తాను ఒక జర్నలిస్టునని, ఎవరినైనా కలిసే హక్కు తనకు ఉంటుందని, పోలీసులు పెట్టిన సెక్షన్‌లు ప్రభుత్వ ఉద్యోగులకే తప్ప.. తనకు వర్తించవని పిటిషన్‌లో శ్రవణ్‌కుమార్‌రావు అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

రెండో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి..

కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారి చక్రధర్‌గౌడ్, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం (రెండో ఎఫ్ఐఆర్)లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ కేసులో ఏ-2గా ఉన్న రిటైర్డ్ డీసీపీ రాధాకిషన్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి ఎదుట ఈ నెల 10న విచారణకు రానుంది. కాగా, ఈ కేసును కొట్టేయాలని రాధాకిషన్‌రావు ఇప్పటికే క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. ఈ నెల 12 వరకు ఆయనను అరెస్ట్ చేయరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో ఏ-1గా ఉన్న హరీశ్‌రావు సైతం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ఈనెల 12కు వాయిదా పడింది.

తీన్మార్ మల్లన్నపై కేసు నమోదుకు ఆదేశించండి

» హైకోర్టులో పిటిషన్ దాఖలు

» పోలీసులు వైఖరి తెలపాలన్న ధర్మాసనం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన బీసీ సంఘాల సభలో రెడ్డి కులస్థులపై తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీనిపై సిద్దిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని పేర్కొంటూ కె.అరవింద్‌రెడ్డి అనే న్యాయశాస్త్ర విద్యార్థి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బాధ్యత కలిగిన శాసనమండలి సభ్యుడు ఒక కులంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతికి దారితీస్తుందని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన మరుసటిరోజే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ చేయడం లేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. హోంశాఖ, డీజీపీ, ఇతర పోలీసు అధికారులు ఈ అంశంపై తమ వైఖరి చెప్పాలని పేర్కొంటూ విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

ముస్లిం బీసీ, హిందూ బీసీ ఏంటి?

(మొదటిపేజీ తరువాయి)

విలేకరులతో మాట్లాడారు. ముస్లింల ప్రాపకం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో వారిని బీసీల జాబితాలో చేర్చారని ఆరోపించారు. బీసీలకు అన్యాయం చేసే ఈ నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. కులం పేరుతో, మతం పేరుతో ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆ పార్టీకి, రాహుల్ గాంధీకి ఇది అలవాటుగా మారిందని విమర్శించారు. అంతకుముందు బొగ్గు శాఖ పురోగతిపై కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2047 వికసిత్ భారత్ లక్ష్యాల్లో బొగ్గు రంగం కీలకమన్నారు. ప్రపంచ బొగ్గు ఉత్పత్తిలో, వినియోగంలోనూ భారత్ రెండో స్థానంలో ఉందని, బొగ్గు నిల్వల్లో ప్రపంచంలో 5వ స్థానంలో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బొగ్గు గని గెవరా మన దేశంలోనే ఉందన్నారు. ఇక కోల్ ఇండియా సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని పేర్కొన్నారు. భారతదేశంలో బొగ్గు ద్వారానే 74 శాతం విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో వివిధ రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని, పారదర్శకంగా కోల్ బ్లాక్స్ వేలం, కమర్షియల్ కోల్ మైనింగ్, పాలసీ రిఫార్మ్స్, కోల్ గ్యాసిఫికేషన్, టెక్నాలజీ వంటి వినియోగం పెరిగిందని తెలిపారు. దీంతో మన బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని, 2023-24లో 998 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని వివరించారు. 2014లో విద్యుదుత్పత్తి సంస్థల వద్ద కేవలం 4 రోజులకు సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే ఉండేవని, ఎన్డీయే సర్కారు తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా.. ప్రస్తుతం 21 రోజులకు సరిపడే నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి

స్మార్ట్ సిటీల నుంచి శ్మశాన వాటికలదాకా..

అన్నింటికీ మోదీ సర్కారే డబ్బులిస్తోంది

రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసా లేదు: ఈటల



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్మార్ట్ సిటీల నుంచి శ్మశాన వాటికల నిర్మాణం వరకూ కేంద్రం ఇస్తున్న నిధులనే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి కూడా రాష్ట్ర సర్కారు దగ్గర డబ్బులు లేవని అన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సఫాయి కార్మికులకు జీతాల చెల్లింపు, చెట్ల పెంపకం, వీధి దీపాలు, రోడ్లు, శ్మశాన వాటికలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఈటల సుదీర్ఘంగా మాట్లాడారు. తెలంగాణలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్లను రూ.2 వేల కోట్లతో కేంద్రం అభివృద్ధి చేస్తోందని అన్నారు. రూ.450 కోట్లతో చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను సిద్ధం చేస్తే.. రూ.50-100 కోట్లతో మౌలిక వసతులు సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని విమర్శించారు. స్మార్ట్ సిటీలు, అమృత్ నగర్‌ల పేరుతో పట్టణ ప్రాంతాల్లో రూ.వేల కోట్ల కేంద్రం నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

క్యారెక్టర్ ఖాళీ... విలువలు సున్నా!

» జగన్‌పై సోదరి షర్మిల మండిపాటు

» ఆస్తుల కోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు

» సాయిరెడ్డితో అబద్ధాలు చెప్పించారు

» జగన్ నైజాన్ని అర్థం చేసుకున్న సాయిరెడ్డి

» ఆయనపడ్డ బాధలు నాతో చెప్పుకొన్నారు

» అబద్ధాలను నిజాలని నమ్మించడమే జగన్ నైజం: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబులిటీ' ఉండాలి అని సుద్దులు చెప్పిన వైఎస్ జగన్‌కే విలువలు, విశ్వసనీయత లేవని ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. సొంత తల్లి, చెల్లి, మేనకోడలు, మేనల్లుడికి వెన్నుపోటు పొడిచారని... నీచుడని మండిపడ్డారు. ఆస్తుల కోసం సొంత తల్లిపైనే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డికి ఇష్టంలేకపోయినా, ఆయనపై ఒత్తిడి తెచ్చి... తనను తిట్టించారన్నారు. "జగన్ క్యారెక్టర్ ఖాళీ సీసాలాంటిది. ఆయన క్యారెక్టర్ సున్నా" అని తేల్చేశారు. శుక్రవారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న షర్మిల మీడియాతో మాట్లాడారు. "జగన్‌కు విశ్వసనీయత, విలువలు ఏమాత్రం లేవు. నీతులు చెబుతారు కానీ పాటించరు. వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు చెప్పుకొని జగన్ అధికారంలోకి వచ్చి వైఎస్ ఆశయాలనే కాలరాశారు" అని విమర్శించారు. చిన్నాన్న వివేకానంద రెడ్డిని చంపించింది అవినాశ్ రెడ్డే అని సీబీఐ చెప్పిన తర్వాత కూడా... ఆయనను తన పక్కన కూర్చోబెట్టుకున్నారని ఆక్రోశించారు.

సాయిరెడ్డితో భేటీలో...



వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం విజయసాయిరెడ్డి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో షర్మిలతో భేటీ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ఆమె ఇప్పుడు ధ్రువీకరించారు. సాయిరెడ్డితో జరిగిన సమావేశంలో చాలా విషయాలు చర్చకు వచ్చాయని షర్మిల చెప్పారు. "జగన్ సొంత తల్లి మీద కేసు పెట్టించారు. నిజాలు వెల్లడిస్తూ ఆయన కుట్రను నేను బయటపెట్టాను. అయితే... అవన్నీ అబద్ధాలని చెప్పాలంటూ సాయిరెడ్డిపై జగన్ ఒత్తిడి తెచ్చారు. అందుకు ఆయన నిరాకరించినా... జగన్ ఒప్పుకోలేదు. ఆస్తుల్లో ఇద్దరు బిడ్డలకూ సమాన వాటా ఉందని మా తండ్రి జీవించి ఉన్నప్పుడే సాయిరెడ్డి చెప్పారు. తనను వదిలేయాలని సాయిరెడ్డి వేడుకోవడంతో వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడించారు. ఆ తర్వాత మళ్లీ సాయిరెడ్డి మీద జగన్ ఒత్తిడి చేశారు. తనకు ఇష్టంలేదని, కుదరదని సాయిరెడ్డి చెప్పినా జగన్ వినిపించుకోలేదు. సాయిరెడ్డి మాట్లాడాల్సిన అంశాలన్నీ స్వయంగా జగన్ నోట్ ఇచ్చారట! ఏం మాట్లాడాలో 40 నిమిషాలు డిక్టేట్ చేశారట" అని షర్మిల వివరించారు. జగన్ నైజం ఏమిటో విజయసాయిరెడ్డి అర్థం చేసుకున్నారని... ఈ విషయాలను ఆయన చెబుతుంటే తనకు చాలా బాధేసిందని అన్నారు. "క్యారెక్టర్ లేని జగన్... క్యారెక్టర్ మీద డైలాగులు చెబుతున్నారు. ఆ పదానికి అర్థం కూడా ఆయనకు తెలియదు. తనను వదిలేయాలని బతిమలాడిన సాయిరెడ్డిపై ఒత్తిడి చేయడమేనా క్యారెక్టర్?" అని నిలదీశారు. సొంత మేనల్లుడు, మేనకోడలి ఆస్తిని కాజేయాలని జగన్ చూశారని ఆరోపించారు. 'మీరు చేసిన కుట్రలేమిటో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఆస్తుల కోసం జగన్, ఆయన భార్య ఎంత దిగజారిపోయారో బైబిల్ ముందు కూర్చుని ఆలోచించాలి. అబద్ధాలు ఆడకూడదంటూనే జగన్ అబద్ధాలు చెబుతారు. అవే నిజాలని నమ్మించే ప్రయత్నం చేస్తారు" అంటూ జగన్‌పై ధ్వజమెత్తారు.

ఇదేనా క్రెడిబులిటీ...

వైఎస్ బీజేపీకి వ్యతిరేకమని... ఇప్పుడు అదే బీజేపీతో జగన్ అక్రమ సంబంధం పెట్టుకున్నారని షర్మిల అన్నారు. వైఎస్ జలయజ్ఞం ప్రాజెక్టులు మొదలు పెట్టగా... వాటిని 6 నెలల్లో పూర్తి చేస్తానని జగన్ ప్రకటించారని గుర్తుచేశారు. క్రెడిబిలిటీ ఉంటే ప్రాజెక్టుల జగన్ ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. "నాసిరకం మద్యంతో ప్రజల జీవితాలతో ఆడుకున్నప్పుడు క్రెడిబిలిటీ ఏమైంది? రుషికొండను తొలచి ప్యాలెస్ కట్టినప్పుడే ఆయన విశ్వసనీయత పోయింది. ఆయనకు క్రెడిబులిటీ లేదు. డబ్బు ఉందనే అహంకారం ఉంది" అని విమర్శించారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డుల జారీపై దృష్టి

» మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు హెల్త్ కార్డుల జారీపై దృష్టి సారించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షుడు గుడిగ రఘు, కార్యదర్శి బి.జగదీష్, కార్యవర్గ సభ్యురాలు పి.విజయ, హెచ్‌యూజే అధ్యక్షుడు అరుణ్‌కుమార్.. మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు జర్నలిస్టుల హెల్త్‌కార్డుల జారీపై దృష్టిసారించామని, ఇప్పటికే దీనిపై పలుమార్లు చర్చించామని తెలిపారు. త్వరలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. హెల్త్ కార్డుల కోసం ఒకశాతం విరాళం ఇచ్చేందుకు ఉద్యోగ సంఘాలు ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేశాయన్నారు.

విద్యుత్ బస్సులపై తప్పుడు ప్రచారం

» ఒక్క ఆర్టీసీ ఉద్యోగిని తొలగించం: సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. సంస్థలో కొత్తగా విద్యుత్ బస్సులు రావడం వల్ల ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించేది లేదని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు, ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విద్యుత్ బస్సుల వినియోగం వల్ల సమకూరే ప్రతి రూపాయి సంస్థ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఆర్టీసీలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారులతో ఎండీ సజ్జనార్ శుక్రవారం బస్‌భవన్ నుంచి వర్చువల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతికి సిబ్బంది అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. సంస్థ పనితీరును మెరుగుపరుచుకునేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కొందరు ఉద్యోగులు విద్యుత్ బస్సుల విషయాన్ని ప్రస్తావించగా.. సంస్థలో కొత్తగా ప్రవేశపెడుతున్న పర్యావరణహితమైన విద్యుత్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగానే డిపోల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యాజమాన్యం పరిష్కరిస్తుందని చెప్పారు.

గోదావరి బోర్డు సభ్యకార్యదర్శిపై చర్యలు తీసుకోండి: ఉద్యోగుల ఫిర్యాదు

గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సభ్య కార్యదర్శి ఆర్.అజగేషన్‌పై బోర్డు ఉద్యోగుల తిరుగుబాటు మరో మలుపు తిరిగింది. ఉద్యోగులంతా అజగేషన్‌పై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీకి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా సభ్యకార్యదర్శి వ్యవహారశైలిపై ఉద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. తాజాగా తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలను కలిసి సమస్యను నివేదించుకున్నారు. దాంతో అజగేషన్‌ను తప్పించాలని కోరుతూ కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ముకేష్‌కుమార్ సిన్హాకు ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ లేఖ కూడా రాశారు.

ప్రాజెక్టుల పనులకు రూ.20 వేల కోట్లు!

» ప్రభుత్వానికి నివేదించిన నీటిపారుదల శాఖ

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు 2025-26 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లను కేటాయించాలని నీటిపారుదల శాఖ కోరింది. అలాగే మరో రూ.12,500 కోట్లను రుణాలు/ఆపరేషన్ మెయింటెనెన్స్ పనులు/ఉద్యోగుల జీతాల కోసం కేటాయించాలని నివేదించింది. ఈ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలను సర్కారుకు సమర్పించింది. ఒకటి, రెండు భేటీల అనంతరం తుది కేటాయింపులపై ఓ స్పష్టత రానుంది. రానున్న ఆర్థిక సంవత్సరం(2025-26)లో ప్రధానంగా పాలమూరు ఎత్తిపోతల పథకంతో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు టన్నెల్ (ఎస్ఎల్‌బీసీ), డిండి ఎత్తిపోతల పథకానికి కీలక ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలున్నాయి. అంతేకాకుండా ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతలలో భాగంగా తుమ్మిడిహెట్టికి దిగువన రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

ప్రయాగ్‌రాజ్ విమానంలో సాంకేతిక లోపం

» శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 9 గంటల పాటు నిరీక్షణ

» ప్రయాణికుల్లో సినీ నటుడు విజయ్ దేవరకొండ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యూపీలోని ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానంలో శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మహా కుంభమేళాకు బయలుదేరిన 180 మంది విమానాశ్రయంలో తొమ్మిది గంటలకు పైగా పడిగాపులు పడ్డారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు 180 మంది ప్రయాణికులతో ప్రయాగ్‌రాజ్ వెళ్లడానికి సిద్ధమైన ఎస్‌జీ 773 స్పైస్‌జెట్ విమానం టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయింది. ప్రయాణికుల్లో సినీ నటుడు విజయ్ దేవరకొండతోపాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. అయితే, సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో వారంతా దాదాపు తొమ్మిది గంటల పాటు ఎయిర్‌పోర్టులోనే వేచి ఉన్నారు. దీంతో ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై ఐఏఎస్, ఐపీఎస్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎట్టకేలకు మరమ్మతుల అనంతరం సాయంత్రం 6 గంటలకు విమానం ప్రయాగ్‌రాజ్ బయలుదేరింది.

నేతకాని, మహర్లతో గ్రూపు పెట్టాలి

» ఆయా వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వాలి

» నేతకాని, మహర్ సంక్షేమ సంఘం డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లో మూడో అతిపెద్ద కులమైన నేతకానితో పాటు మహర్ మరి కొన్ని కులాలతో ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి, రిజర్వేషన్లు కల్పించాలని నేతకాని, మహర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ, కుల గణన నివేదికలు తప్పుల తడకగా ఉన్నాయని విమర్శించారు. కులాల జనాభాను తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అధ్యక్షతన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. అత్యంత వెనకబడిన నేతకాని కులాన్ని అభివృద్ధి చెందిన కులాల గ్రూపులో కలపడం అన్యాయమని అన్నారు. గ్రూపు 3లో ఉన్న నేతకాని, మహర్లతో పాటు మరో ఏడు కులాలతో ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాస్తవ లెక్కలను దాచి అశాస్త్రీయంగా తమను గ్రూపు 3లో చేర్చారని మాజీ ఎంపీ వెంకటేశ్ నేత మండిపడ్డారు. తమ జనాభా పది లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

నాకు, రాహుల్‌కు మధ్య

అగాధం వట్టిమాట

(మొదటిపేజీ తరువాయి)

చర్చలు జరిగాయని, మంత్రివర్గ విస్తరణపై పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటానని రేవంత్ చెప్పారు. ఎవరి పేర్లనూ తాను సిఫారసు చేయడం లేదని వివరించారు.

అర్జంటుగా జైల్లో వేయాలన్న ఆలోచన లేదు

ప్రతిపక్ష నేతలపై కేసులు, అరెస్టుల విషయంలో చట్టప్రకారం నడుచుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అర్జెంట్‌గా అరెస్టు చేసి జైల్లో వేయాలన్న యోచన తనకు లేదన్నారు. ఫార్ములా ఈ రేసు కేసులో లండన్ కంపెనీకి నోటీసు ఇచ్చామని, వారు టైమ్ అడిగారని, వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత పర్యవసానాలు ఉంటాయని తెలిపారు. కేటీఆర్ అరెస్టు ఆగిపోవడంపై మాట్లాడుతూ.. పకడ్బందీగా ఆధారాలు లేకుండా అరెస్టు అయితే బెయిల్‌పై బయటకు వస్తారని వివరించారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు ఏమి చెబుతుందో చూస్తామని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు గతంలో రహస్య స్నేహం ఉండేదని, అది ఇప్పుడు బహిరంగం అయిందని, అందుకే ఢిల్లీ వచ్చిన కేటీఆర్ ఇద్దరు మంత్రులను కలిశారని అన్నారు. సినీ నటుడు నాగార్జున ప్రధాని మోదీని కలిశారని విలేకరులు ప్రస్తావించగా.. ఆయన భూ ఆక్రమణ గురించి 2016లోనే మాట్లాడానని, అధికారంలోకి వచ్చాక చర్య తీసుకున్నానని తెలిపారు. ఆక్రమించారు కనుకే మునిసిపల్ టాక్స్ కట్టలేదని చెప్పారు.

బీసీలు పెరిగారు.. ఓసీలు తగ్గారు

తన ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వేలో బీసీలు 5.5 శాతం పెరిగారని, ఓసీలు 5.5 శాతం తగ్గారని సీఎం చెప్పారు. తమ సర్వేలో బీసీలు తగ్గి, ఓసీలు పెరిగారన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. "వందేళ్లుగా ఇలాంటి లెక్కలు లేవు. ఇప్పుడు పకడ్బందీగా కులగణన చేయించి ప్రజల ముందు పెట్టాం. ఈ వివరాలపై క్యాబినెట్ ద్వారా చట్టం చేస్తాం. ఈ వివరాల ప్రాతిపదికగా స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నాం" అని వివరించారు. వర్గీకరణకు శాసనసభ ఆమోద ముద్ర వేసిందని, ఇక చట్టం చేయడమే మిగిలిందని చెప్పారు.

పద్మ భూషణ్ రావాలనుకుంటున్నారేమో..

మాదిగలు, ఉప కులాల రిజర్వేషన్ 9 శాతానికి పెరిగిందని, గ్రూప్-1లో ఉన్న అత్యంత వెనకబడిన వర్గాల ఉప కులాలను కూడా కలిపితే 10 శాతం అవుతుందని సీఎం రేవంత్ చెప్పారు. ఎన్నడూ ఏ ఉద్యోగం చూడని వారిని కలిపి గ్రూప్-1లో చేర్చామన్నారు. ఈ సందర్భంగా మాదిగలకు 11 % రిజర్వేషన్ ఇవ్వాలని మంద కృష్ణ డిమాండ్ చేస్తున్నారు కదా అని విలేకరులు ప్రశ్నించగా.. పద్మశ్రీ తర్వాత పద్మ భూషణ్ రావాలనుకుంటున్నారేమో అని రేవంత్ రెడ్డి



ఢిల్లీలో పీసీసీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంత రాములు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ తదితరులు

చమత్కరించారు. సుప్రీం కోర్టు, జస్టిస్ షమీమ్ అఖ్తర్ కమిషన్ క్రీమీలేయర్‌ను అమలు చేయాలని చెప్పినా తాము తిరస్కరించామని తెలిపారు.

మోదీ కన్వర్టెడ్ ఓబీసీ

ప్రధాని మోదీ కన్వర్టెడ్ ఓబీసీ అని, ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన తన కులాన్ని మార్చుకున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఓబీసీల గురించి తనకు పాఠాలు చెప్పే అర్హత బీజేపీకి లేదన్నారు. "కిషన్ రెడ్డి ఓబీసీ అయిన దత్తాత్రేయ స్థానంలో పోటీ చేశారు. మరో ఓబీసీ అయిన సంజయ్ స్థానంలో పార్టీ అధ్యక్షుడిగా వచ్చారు. ఆ ఇద్దరి స్థానాలను లాక్కున్నది కిషన్ రెడ్డే" అని ఆరోపించారు. ఆంధ్రాలో కాపు అధ్యక్షుడిని తీసేసి అగ్రవర్ణానికి చెందిన వారిని నియమించారని, ఓబీసీలకు అన్యాయం జరిగిందని మాట్లాడేది వీళ్లా అని రేవంత్ మండిపడ్డారు.

కోటా కోసం కోర్టుకు వెళ్లేందుకు ముస్లింకు చాన్స్

"కేసీఆర్ ప్రభుత్వం బీసీలుగా ప్రకటించిన వారిలో ముస్లింలు కూడా ఉన్నారు. ముస్లింలను ఆయన ప్రత్యేకంగా చూపించలేదు. ముస్లింల గణాంక వివరాలు లేనందువల్ల సుప్రీంకోర్టులో కోటాపై స్టే విధించారు. ఇప్పుడు లభించిన ముస్లింల గణాంక వివరాల ఆధారంగా వారు రిజర్వేషన్ కోసం కోర్టుకు వెళ్లేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి" అని ముఖ్యమంత్రి వివరించారు. బీసీలతో సంబంధం లేకుండా వారు రిజర్వేషన్లు పొందేందుకు వీలు కలిగిందని చెప్పారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం జరిపించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం బీసీలు, 21 శాతం ఓసీలు, 18 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు ఉన్నారని, అప్పుడు ముస్లింలను బీసీల్లో పరిగణించి లెక్కించారని గుర్తు చేశారు. తాము జరిపించిన సర్వేలో బీసీలను 'ఏబీసీడీఈ'గా వర్గీకరించారని, ముస్లింలను 'ఈ కేటగిరీ'లో చేర్చామని తెలిపారు. ఏబీసీడీలకు చెందిన బీసీలు 46.25 శాతం, ముస్లింలు 10.8 శాతం ఉన్నారని, ఇద్దర్నీ కలిపితే 56.33 శాతం ఉన్నారని చెప్పారు. హిందూ ఆచారాలను పాటించే ఓసీలు 12.5 శాతం, ముస్లిం ఆచారాలను పాటించే ఓసీలు 3 శాతానికిపైగా ఉన్నారని, మొత్తం కలిపితే 15.5 శాతానికిపైగా ఓసీలు ఉన్నారని వివరించారు. ఎస్సీలు 17.45 శాతం, ఎస్టీలు 10.06 శాతం మేరకు ఉన్నారన్నారు. కేసీఆర్ హయాంలో నిర్వహించిన సర్వేలో ఓసీలు 21 శాతం ఉంటే.. తమ సర్వేలో 15.5 శాతానికి తగ్గారని, అటువంటప్పుడు ఓసీలు పెరిగారని ఎలా అంటారని రేవంత్ ప్రశ్నించారు. దళితుల్లో సగం మంది క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నారని, క్రైస్తవులుగా ఉన్నవారు తమది క్రైస్తవ మతమని చెప్పుకోలేదని తెలిపారు. కేసీఆర్ జరిపించిన సర్వే తప్పుడు తడకలుగా ఉందని, స్పెల్లింగ్ మిస్టేక్‌ను కూడా చూసుకోకుండా కులాల సంఖ్యను పెంచారని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీ ఉప కులాలు 82 ఉన్నాయని రాశారని, ఉన్నవి 59 ఉప కులాలైతే మిగతావి ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. 'మోచీ' అన్న పదం స్పెల్లింగ్ ఒకరు ఒకరకంగా రాస్తే మరొకరు ఇంకో రకంగా రాశారని, రెండింటినీ వేర్వేరు కులాలుగా పేర్కొన్నారని తప్పుబట్టారు. కేసీఆర్ మాదిరిగా ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ పిల్లలను పంపించి కేవలం 12 గంటల్లో తమ ప్రభుత్వం సర్వే జరిపించలేదని, సర్వే ఎలా చేశామో తాను అసెంబ్లీలో వివరించానని చెప్పారు. తమ సర్వే అత్యంత శాస్త్రీయమైనదన్నారు. తాను జరిపించిన సర్వేలో 33వ పేజీ తెరిచి చదువుకొమ్మని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్‌కు సభలోనే చెప్పానని, తీన్మార్ మల్లన్న ఏమి ఆశించి దాన్ని వ్యతిరేకించారో తనకు తెలియదని, బహుశా రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తాడేమోనని రేవంత్ వ్యాఖ్యానించారు.

తమ సంక్షేమాన్ని చరిత్ర రికార్డు చేస్తుంది

వీసీ నియామకాలపై యూజీసీ మార్గదర్శక సూత్రాలను వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖ రాశామని, ముఖ్యమంత్రుల సమావేశానికి శ్రీధర్‌బాబు వెళ్లారని రేవంత్ చెప్పారు. తాను తీసుకున్న సంక్షేమ చర్యలు, నిర్ణయాలను చరిత్ర రికార్డు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ఆర్టీసీ లాభాల బాటలోకి వచ్చిందన్నారు.

పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు!

» ఖర్గేతో రేవంత్, ఉత్తమ్, భట్టి చర్చలు

» వేణుగోపాల్‌తో వేర్వేరు చర్చలు

» వారంలోపు పీసీసీ కార్యవర్గం ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్.. శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు ఉపాధ్యక్షులుగా నియమించే వారి పేర్లపై చర్చించారు. మధ్యాహ్నం తొలుత ఖర్గే, వేణుగోపాల్‌తో పార్లమెంట్‌లోని ఖర్గే కార్యాలయంలో దాదాపు గంటసేపు చర్చలు జరిపిన రాష్ట్ర నేతలు.. ఆ తర్వాత వేణుగోపాల్‌ను ఒకరి తర్వాత మరొకరు కలుసుకున్నారు. పీసీసీ కార్యవర్గంపై వారి అభిప్రాయాలను ఆయన వేర్వేరుగా తెలుసుకున్నట్లు సమాచారం. అధిష్ఠానంతో తమ చర్చలు పూర్తయ్యాయని వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షుల వరకు చర్చించామని, ప్రధాన కార్యదర్శులు, ఇతర ఆఫీసు బేరర్లు రాష్ట్ర స్థాయిలో నిర్ణయిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు. వారంలోపు కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి అయినందున.. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళ వర్గాలకు చెందిన నేతలను పీసీసీ వర్కింగ్ అధ్యక్షులుగా నియమించే అవకాశాలున్నాయి. కాగా, తెలంగాణలో నిర్వహించిన కుల గణనపై ఖర్గే సంతోషం వ్యక్తం చేసినట్లు సమాచారం.

మీ సేవల్లో రేషన్ కార్డులకు దరఖాస్తులు

» నేటి నుంచి స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. శనివారం నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీలో అవలంబించాల్సిన విధానం, అర్హతల గురించి ఇప్పటికే సబ్ కమిటీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించిన విషయం తెలిసిందే. దీనిప్రకారం కొత్త కార్డులు, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను జత చేసేందుకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. కొత్త రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులను ప్రజాపాలన సేవా కేంద్రాల్లో స్వీకరించాలని ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది.

10న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఓటరు జాబితాల వెల్లడి..

» స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు

» 13న రాజకీయ పార్టీలతో సమావేశం

» 15న పోలింగ్‌స్టేషన్ల జాబితా ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్రంలోని 570 జెడ్పీటీసీ, 5817 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఓటరు జాబితాను వెల్లడించాల్సిందిగా అన్ని జిల్లాల అధికారులను ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అందించిన అసెంబ్లీ నియోజక వర్గాల వారీ ఓటరు జాబితా ఆధారంగా సంబంధిత విభాగాలు గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆ జాబితా వివరాలను సమీకరించి ఎంపీటీసీ స్థానంలో, జెడ్పీటీసీ స్థానంలో ఓటర్ల వివరాలతో జాబితాను సిద్ధం చేసి ఈనెల 10న విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామని అందుకు అనుగుణంగానే.. జాబితాను రూపొందించాలని సూచించారు. అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలో పోలింగ్ స్టేషన్లను గుర్తించి.. వాటి వివరాల డ్రాఫ్ట్‌ను 11న ప్రకటించాలని, వాటిపై 12 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలన్నారు. 13న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై.. వారి సలహాలు, అభ్యంతరాలు తెలుసుకొని.. తుది జాబితాను కలెక్టర్, జిల్లా ఎన్నికల విభాగాల అనుమతి కోసం పంపాలని పేర్కొన్నారు. ఆ తర్వాత పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను 15న విడుదల చేయాల్సిందిగా ఎస్ఈసీ కార్యదర్శి ఆదేశించారు. అలాగే ఈనెల 10లోపు గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సిబ్బందిని నియమించాలని సూచించారు. ఎన్నికల కోసం నియమించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు.. పోలింగ్‌స్టేషన్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ స్టేషన్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఈనెల 12 నుంచి 15 లోపు శిక్షకుల ద్వారా శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు.

పబ్లిసిటీ కోసమే దావోస్ వెళ్లేవారు

బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడులు తక్కువ ప్రచారం ఎక్కువ.. 2 సమావేశాల్లోనే మేమేంటో చూపించాం

» ఎంఎస్ఎంఈలకు అండగా ఉంటాం

» రాష్ట్రంలో హెచ్‌సీ రోబోటిక్స్ మరో రూ.500 కోట్ల పెట్టుబడి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా దావోస్ వెళ్లడం.. భారీ పెట్టుబడులు తెచ్చామని తప్పుడు ప్రచారం చేసుకోవడం తప్ప తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. దాని వల్లే దావోస్ సమావేశాల్లో జరిగిన ఒప్పందాలు ఏమిటీ ? అందులో ఎన్ని సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి ? ఎంతమందికి ఉద్యోగాలిచ్చాయి ? వంటి అంశాలను గత ప్రభుత్వం బయటకు చెప్పలేదని అన్నారు. సెంటిలియాన్ నెట్‌వర్క్స్‌కు చెందిన హెచ్‌సీ రోబోటిక్స్ సంస్థ తెలంగాణలో మరో రూ.500 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ విషయమై సెంటిలియాన్ నెట్‌వర్క్స్ ఛైర్మన్, ఎండీ వెంకట్, డైరెక్టర్ రాధా కిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి.. హెచ్‌సీ రోబోటిక్స్ పెట్టుబడిపై ప్రకటన చేశారు. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పని చేసే సెంటిలియాన్ నెట్‌వర్క్స్, హెచ్‌సీ రోబోటిక్స్ సంస్థలు డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్‌వేర్, టెలీ కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి రంగాల్లో



హెచ్‌సీ రోబోటిక్స్ సీఎండీ వెంకట్‌తో మంత్రి శ్రీధర్ బాబు

తొమ్మిది దేశాల్లో పని చేస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రెండు వేల మంది ఉద్యోగాలు కల్పిస్తున్న హెచ్‌సీ రోబోటిక్స్.. వ్యాపార విస్తరణతో మరింత మందికి ఉపాధి కల్పించనుందని తెలిపారు. ఇక, దావోస్ పేరు చెప్పి గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప చేసేందేమీ లేదని ఈ సందర్భంగా అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లి 18 కంపెనీలతో దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. అందులో 17 సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. దావోస్ ప్రగతికి సంబంధించి ఏడాదిలోపే తమ ప్రోగ్రెస్ కార్డు చూపించామని అన్నారు. గత నెలలో జరిగిన దావోస్ సమావేశాల్లో కుదుర్చుకున్న రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల వివరాలనూ వచ్చే ఏడాది దావోస్ సమావేశాలకు ముందు ప్రకటిస్తామని చెప్పారు. వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండలో విస్తరణకు పలు ఐటీ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని మంత్రి తెలిపారు. సెంటిలియాన్ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్‌లో ప్రారంభించిందని చెప్పారు. వరంగల్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పరిశ్రమలకు సబ్సిడీల కింద ఇవ్వాల్సిన దానికి సంబంధించి గత ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో 2016 నుంచి రూ.4500 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని మంత్రి తెలిపారు. క్రమక్రమంగా నిధులు విడుదల చేస్తూ ఆ బకాయిలను చెల్లిస్తున్నామని చెప్పారు. ఇక, సహేతుక కారణాలు చూపకపోతే పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కేటాయించిన భూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే, ఆయా భూములను ఇతర అవసరాలకు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటుచేసిన ఇండస్ట్రీ హెల్త్ క్లినిక్‌లపై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే నిధులు కేటాయించి వాటిని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ , పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

రైతులకు 40 వేల కోట్లు చెల్లించాం

» సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలిచ్చేందుకు చర్యలు

» హార్టికల్చర్ రైతులకు తగిన ప్రోత్సాహం

» మాదాపూర్ హైటెక్స్‌లో 'కిసాన్ అగ్రి షో' ప్రారంభంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కిసాన్ అగ్రి షోలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ, సన్నధాన్యానికి బోనస్, రుణమాఫీ, రైతు భరోసా తదితర పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు నేరుగా రూ.40 వేల కోట్లు చెల్లించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. వ్యవసాయరంగంలో వస్తున్న ఆధునిక యంత్రాలను రైతులకు సబ్సిడీతో అందించడంతో పాటు హార్టికల్చర్ రైతులను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో మూడు రోజుల 'కిసాన్ అగ్రి షో-2025'(వ్యవసాయ పనిముట్లు, ఉత్పత్తుల ప్రదర్శన)ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని జిల్లా కేంద్రాల్లో వ్యవసాయ సీజన్ ఆరంభంలో అగ్రి షోలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాల్లో నిర్వహించే అగ్రి షోలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, రోబోల వినియోగాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఉత్పాదకతను పెంచేందుకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత, ఆవిష్కరణలు ఆవసరమన్నారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులకు ఆయా మండలాల్లో పండించే అన్ని పంటలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కిసాన్ ఫోరం ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ నిరంజన్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. అగ్రి షోలో 140 మందికి పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి పాల్గొన్నారు. కాగా, అగ్రి షో ప్రదర్శనలో 'ఫార్మ్ రోబో' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిమోట్‌తో నడిచే, రూ.4.5 లక్షల ధర కలిగిన ఈ వ్యవసాయ రోబో(చిన్న పాటి ట్రాక్టర్ తరహా)తో గొర్రు కొట్టడంతో పాటు హ్యాండ్ గన్, స్వీప్ స్ప్రేయర్లతో పురుగుమందులు చల్లవచ్చు. జీపీఎస్ నావిగేషన్‌తో మ్యాపింగ్ ఇస్తే 700 మీటర్ల పరిధి వరకు వ్యవసాయ పనులకు ఉపయోగించుకోవచ్చు. దీంతో పాటు పురుగుల మందు చల్లే డ్రోన్లు, వరి నాటు విఎషన్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

ఒక్కరోజే 3 ఎమ్మెల్సీ స్థానాలకు 43 నామినేషన్లు!

కరీంనగర్/నల్లగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్లు జోరందుకున్నాయి. శుక్రవారం ఒక్కరోజే మూడు స్థానాలకు మొత్తం 43 నామినేషన్లు దాఖలయ్యాయి. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు 30 నామినేషన్లు రాగా.. ఇందులో పట్టభద్రుల స్థానానికి 28 మంది, ఉపాధ్యాయ స్థానానికి ఇద్దరు నామినేషన్ వేశారు. ఈ రెండు స్థానాలకు ఇప్పటివరకు 58 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ నుంచి వి.నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి నామినేషన్ వేయగా.. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ ప్రసన్న హరికృష్ణ, బక్క జెడ్సన్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. ఇటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా 13 మంది తాజాగా నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సరోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఈ స్థానానికి 19 మంది నామినేషన్లు వచ్చాయి.

'నాటా' 2025 రిజిస్ట్రేషన్లు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్)లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నాటా(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్) 2025 ఎంట్రెన్స్‌కి నోటిఫికేషన్ వెలువడింది. ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ http://nata.in ద్వారా దరఖాస్తు చేయడంతోపాటు, పూర్తి వివరాలు పొందవచ్చు. నోటిఫికేషన్ ప్రకారం ఇందులో దరఖాస్తుల చివరి తేదీ గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఎంట్రెన్స్ పరీక్షలు 2025 మార్చి 1న ప్రారంభమై జూన్ వరకు కొనసాగుతాయి.

మొదలైన 'కొమెడ్' 2025 రిజిస్ట్రేషన్లు

కర్ణాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు ఉద్దేశించిన కొమెడ్ యూజీసెట్-2025కి (కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక) నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగల అభ్యర్థులు https://comedk.org/index వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 15. ఎంట్రెన్స్ పరీక్ష మే 10న జరుగుతుంది. ఫలితాలు మే 24న వెల్లడిస్తారు.

11న ఐసీఎంఏఐ ఫలితాలు

కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) ఇంటర్మీడియేట్, ఫైనల్ ఫలితాలు 2025 ఫిబ్రవరి 21న వెలువడుతాయని 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా'(ఐసీఎంఏఐ) తెలిపింది. తొలుత ఈ ఫలితాలను ఫిబ్రవరి 21న విడుదల చేస్తారని తెలిపినప్పటికీ వీటిని ముందుకు తీసుకువచ్చినట్లు ఐసీఎమ్ఏఐ వెల్లడించింది. www.icmai.in వెబ్‌సైట్ నుంచి వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'సుప్రీం'లో 241 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

సుప్రీంకోర్టులో 242 జూనియర్ కోర్ట్ అసిస్టెంట్(గ్రూప్ 'బి' నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండే గ్రాడ్యుయేట్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్‌తోపాటు పని అనుభవం తప్పనిసరి. రాత పరీక్ష, టైపింగ్ స్పీడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 8. పూర్తి వివరాల కోసం https://www.sci.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు.

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ https://cisfrectt.cisf.gov.in ద్వారా దరఖాస్తు చేసు కోవచ్చు. మొత్తం 1124 పోస్టులు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా భర్తీ చేస్తారు. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 4. శారీరక ప్రమాణాల పరీక్ష, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

మార్గదర్శి కేసులో జాప్యం సరికాదు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ డిపాజిట్లు సేకరించిందన్న కేసులో విచారణ ఆలస్యం కావడం సరికాదని హైకోర్టు పేర్కొంది. అన్ని వర్గాల వాదనలు విని వీలైనంత త్వరగా తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు మార్గనిర్దేశనం చేసిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించింది. అదనపు కౌంటర్ దాఖలుకు మరో రెండు వారాల గడువు కావాలని ఆర్బీఐ కోరడాన్ని జస్టిస్ శ్యాంకోషి, జస్టిస్ కె.సుజన ధర్మాసనం శుక్రవారం తప్పుపట్టింది. వారం రోజుల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆర్బీఐకి ఆదేశాలు జారీచేస్తూ విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. ఈ కేసు జాబితాలో ఉండవల్లి అరుణ్‌కుమార్ పేరు ప్రింట్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

అక్రమ హోర్డింగ్‌లు తొలగిస్తాం: రంగనాథ్

- శంషాబాద్‌లో భారీ హోర్డింగ్‌ల తొలగింపు

హైదరాబాద్ సిటీ, శంషాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని హోర్డింగ్‌లు, యూనిపోల్స్‌పై హైడ్రా దృష్టి సారించింది. శంషాబాద్‌లోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి రెండువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లను శుక్రవారం భారీ పోలీసు బందోబస్తుతో తొలగించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివారు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు.. ఔటర్ వరకు ఉన్న ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులు తొలగిస్తున్నామన్నారు. అనుమతి ఉండి రుసుము చెల్లించకున్నా.. చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందుగా భారీ హోర్డింగ్‌లపై దృష్టి సారించామన్నారు. శివార్లలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో అనుమతి లేని యూనిపోల్స్, హోర్డింగ్‌లు గుర్తించినట్లు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం మార్గంలో భారీగా ఉన్న అక్రమ హోర్డింగ్‌లు తొలగించామన్నా రు. ఇతర ప్రాంతాల్లోనూ తొలగింపు ఉంటుందని రంగనాథ్ పేర్కొన్నారు.



మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మంచిర్యాల జిల్లాలో విజృంభిస్తున్న డయేరియా

- ఆస్పత్రులకు బాధితుల పరుగు .. కలుషిత నీరే కారణం

చెన్నూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో డయేరియా చాపకింద నీరు లా విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని పలు కాలనీలకు చెందిన పలువురు వాంతులు, విరేచనాలతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో 67 డయేరియా కేసులు నమోదైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. చెన్నూర్ పట్టణం జగన్నాథస్వామి ఆలయ వీధికి చెందిన చొక్కారపు రవీందర్ (55) డయేరియాతో బాధపడుతూ ఈ నెల 4న మృతి చెందాడు. పట్టణానికి సరఫరా అయ్యే మంచినీరు కలుషితంకావడం వల్లనే డయేరి యా ప్రబలినట్లు పట్టణ ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని బట్టిగూడెం, జెండవాడ, సొన్నాయిల వీధి, లైన్‌గడ్డ, శివాలయం వీధి, కోటబొగడ, మంగలి బజార్ ప్రాంతాల్లోని వారే డయేరియా బారినపడుతున్నారు.

అమెరికా డిజైన్ కాంటెస్ట్‌లో

నారాయణ విద్యార్థుల సత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ డిజైన్ కాంటెస్ట్-2024'లో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ గ్రూప్ తెలిపింది. వరల్డ్ నెంబర్-1 స్థానంలో 4, వరల్డ్ నెంబర్-2 స్థానంలో 13, వరల్డ్ నెంబర్-3 స్థానంలో 9 సెలక్షన్స్‌తో పాటు మొత్తం 32 బహుమతులను గెలుపొందారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన ఈ పోటీలో వివిధ దేశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని వారు చెప్పారు. పోటీ పరీక్షల కోసం తాము ప్రత్యేక ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తున్నామని, దీంతో విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానంతో పాటు నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ఆ పిల్లి నాది.. కాదు నాది!

గుర్తుపట్టకుండా ఉండేందుకు రంగేస్తారా? .. అసలు మేం రంగు వేయలేదంటే నమ్మరేం?

- మార్జాలం కోసం ఇరుగుపొరుగు ఘర్షణ
- తొలుత పోలీస్‌స్టేషన్‌కు.. ఆపై ఎస్పీ దాకా పంచాయితీ
- నల్లగొండలో ఘటన.. రంగు అద్దారా? లేదా? అనేదే కీలకం
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పిల్లి వెంట్రుకలు

నల్లగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెల్ల బొచ్చుతో ముద్దుగా ఉందా పిల్లి! ఆ జీవి నాది.. అంటే నాది అంటూ ఇరుగుపొరుగు తగవులాడుకున్నారు. కడకు పోలీసులదాకా వెళ్లిందీ పిల్లి పంచాయితీ! నల్లగొండ జిల్లా కేంద్రంలో వెలుగుచూసిందీ ఘటన. పిల్లి యజమానులం అని చెప్పుకొంటున్న ఇద్దరిలో ఒకరు వెల్లడించిన వివరాల ప్రకారం.. నల్లగొండలోని రెహమత్‌నగర్‌కు చెందిన పుష్పలత మూడేళ్ల క్రితం నెల వయసున్న పిల్లిని తెచ్చుకొని షఫీ అని పేరు పెట్టుకొని పెంచుకుంటోంది. నిరుడు జూన్‌లో ఆ పిల్లి కనిపించకుండా పోయింది. గత నెల 2న తన ఇంటి పరిసరాల్లోనే పిల్లి కనిపించడంతో పట్టుకొని ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆ ఇంటి సమీపంలోనే ఉండే అష్రాఫ్, ఆ పిల్లి తమది అని.. తాము పెంచుకుంటున్న పిల్లిని ఎలా తీసుకెళతారని ఆమెను ప్రశ్నించాడు. పిల్లి తనదేనని.. గుర్తుపట్టకుండా రంగులేశారని ఆమె ఆరోపించింది. "నా పిల్లి ఎలా ఉంటుందో నాకు తెలుసు. పిల్లిని ఎత్తుకెళ్లడమే కాకుండా రంగువేసి మోసం చేస్తారా? దానికి స్నానం చేయిస్తే ఆ రంగంతా పోయింది" అని పుష్పలత వ్యాఖ్యానించింది. దీనికి అతడు.. తాము పిల్లికి రంగు వేయలేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే.. ఈ ఘటనపై పుష్పలత ఈనెల 15న నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తర్వాత అక్కడి పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గురువారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేసింది. పిల్లి పంచాయితీ తేల్చాలంటూ ఆయన ఆదేశించడంతో పోలీసులు కదిలారు. పుష్పలతను, అష్రాఫ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. పంచాయితీ తెగకపోవడంతో అసలు యజమాని ఎవరో తేల్చేందుకు ఆ పిల్లి వెంట్రుకలను హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఆ వెంట్రుకల ద్వారా ఎలా తేలుస్తారు? అనంటే.. పిల్లికి రంగు వేశారని పుష్పలత.. రంగు వేయలేదని అష్రాఫ్ చెబుతున్నారు కదా! రంగు వేశారా.. లేదా? అనేది పిల్లి వెంట్రుకలకు నిర్వహించనున్న పరీక్ష ద్వారా తేలనుంది. ఆ తర్వాత పిల్లి అసలు యజమాని ఎవరో తేలిపోనుంది!



గొడవంతా ఈ పిల్లి కోసమే

మార్టిగేజ్ మతలబు!

పంట రుణంగా వాణిజ్య రుణానికి స్లాట్.. మార్టిగేజ్ విలువ చెల్లించకుండా రిజిస్ట్రేషన్

- ధరణిలో అధికారులు, ఆపరేటర్ల చేతివాటం
- ప్రభుత్వ ఆదాయానికి రూ. కోట్లలో గండి
- ఆడిట్ లేకపోవడంతో అక్రమాలకు అవకాశం



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో ఉన్న చిన్న లొసుగును అడ్డుపెట్టుకుని సర్కారు ఖజానాకు భారీగా గండి పెడుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయాన్ని అధికారులు, ఆపరేటర్లు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. దీనిపై తహసీల్దార్ల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక రైతు తన అనుభవంలో ఉన్న 10 ఎకరాలకు వ్యవసాయ రుణం తీసుకోవాలంటే మార్టిగేజ్ చార్జీ చెల్లించాల్సిన పని లేదు. కేవలం డాక్యుమెంట్ చార్జీతో పంట రుణం పొందవచ్చు. అదే వ్యక్తి తన 10 ఎకరాలు తాకట్టు పెట్టి వాణిజ్య అవసరాలకు రుణం పొందాలంటే భూమి విలువలో మార్టిగేజ్ చార్జి 0.6 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే ఆపరేటర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉదాహరణకు.. ఒక మార్టిగేజ్ డాక్యుమెంట్ విలువ రూ.44 లక్షలు ఉందనుకుందాం. దానిపై ఒక రైతు పంట రుణం తీసుకుంటే రూ.50 డాక్యుమెంట్ చార్జి చెల్లిస్తే సరిపోతుంది. అదే, వాణిజ్య రుణం తీసుకుంటే మాత్రం మార్టిగేజ్ విలువలో 0.6 శాతం; డాక్యుమెంట్ చార్జీ రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. రుణం ఎంత తీసుకున్నా.. డాక్యుమెంట్ విలువపై ఈ మార్టిగేజ్ విలువ 0.6 శాతాన్ని చెల్లించాల్సిందే. అంటే, డాక్యుమెంట్ విలువ రూ.44 లక్షలు అనుకుంటే.. దానికి మార్టిగేజ్ విలువగా రూ.26,400 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా వాణిజ్య రుణం తీసుకోవాలంటే ధరణి రిజిస్ట్రేషన్ సమయంలో 'మార్టిగేజ్ విత వుట్ పొజిషన్' అనే ఐచ్ఛికాన్ని ఎంపిక చేసి స్లాట్ బుక్ చేసుకోవాలి. అప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన రూ.26,450 చెల్లించాల్సి ఉంటుంది. అదే పంట రుణం తీసుకోవాలంటే మాత్రం 'మార్టిగేజ్ డీడ్ బై స్మాల్ ఫార్మర్ ఇన్ ఫేవర్ ఆఫ్ పీఏసీ లేదా గ్రామీణ బ్యాంక్స్, షెడ్యూల్డ్ బ్యాంక్స్' అనే ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి. అప్పుడు కేవలం డాక్యుమెంట్ చార్జీగా 50 రూపాయలకు మాత్రమే చలానా జెనరేట్ అవుతుంది. సరిగ్గా, ఇక్కడే ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాణిజ్య రుణం తీసుకున్నా దానిని పంట రుణంగా పేర్కొంటున్నారు. మార్టిగేజ్ విలువలో సగానికి సగం నొక్కేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సిన తహసీల్దార్లు కూడా తమ వాటాలు తీసుకుని వాణిజ్య రుణాలు తీసుకునే వారిని కూడా పంట రుణాల ఖాతాలో చూపి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. దీనివల్ల సర్కారు ఆదాయానికి కోట్ల రూపాయల్లోనే గండి పడుతోంది. నిజానికి, ధరణి రిజిస్ట్రేషన్లపై ఏటా ఆడిట్ జరగాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకూ అస్సలు ఆడిట్టే జరగలేదు. ఈ అంశాన్ని పట్టించుకునేవారూ లేరు. దాంతో, ఈ గోల్‌మాల్ వ్యవహారం యధేచ్ఛగా సాగిపోతోంది. ధరణిలో రోజుకు 3500 స్లాట్‌లు బుక్ అవుతుండగా.. వాటిలో రిజిస్ట్రేషన్లు 2000 నుంచి 2500 వరకూ జరుగుతున్నాయి. అంటే, రోజుకు ఏ స్థాయిలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా దీనిపై ఆడిట్ చేస్తే ప్రభుత్వ ఖజానాకు ఎన్ని కోట్ల రూపాయలు నష్టం జరిగిందనేది తేలుతుంది.

పొరపాటు జరిగితే ఎవరిది బాధ్యత!?

ఒక చిన్న పొరపాటు లేదా ఉద్దేశపూర్వకంగా ఐచ్ఛికం తీసుకోవడంలో మార్పు చేస్తే చలానా కట్టాల్సిన సొమ్ములో భారీ తేడా కనిపిస్తోంది. మార్టిగేజ్ విలువకు సంబంధించి ప్రభుత్వం విధించిన రుసుం 0.6 శాతం చెల్లించకుండా కేవలం డాక్యుమెంట్ చార్జి మాత్రమే చెల్లించే వెసులబాటు ఉంది. మరి ఇలాంటి పొరపాటు జరిగితే దానికి ఎవరు బాధ్యత తీసుకోవాలనే విషయమై రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రిజిస్ట్రేషన్ సమయంలో సరైన ఆప్షన్ ద్వారా స్లాట్ బుక్ చేశారా లేదా అన్నది సంబంధిత రిజిస్ట్రార్ చూసుకోవాలి. అది వారి బాధ్యత. స్లాట్ బుక్ చేసే సమయంలో ఐచ్ఛికాల్లో ఆపరేటర్లే మార్పు చేసినా రిజిస్ట్రార్‌దే బాధ్యత అవుతుంది. ఆడిట్ సమయంలో ఈ విషయాలు వెలుగులోకి వస్తే ఆయన్నే బాధ్యున్ని చేస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్‌ను పరిశీలించి కంప్యూటర్ ఆపరేటర్‌కు తగిన జాగ్రత్తలు చెప్పాల్సిన బాధ్యత కూడా రిజిస్ట్రార్ మీదనే ఉంటుంది.

రూ.2.5 కోట్ల విలువైన యాపిల్ ఫోన్లు కొట్టేశారు

- బెజవాడ గోడౌన్‌లో యూపీ దొంగల బీభత్సం
- సీసీ ఫుటేజీల్లో ముఖాలు కనిపించకుండా జాగ్రత్తలు
- రెండు రోజుల క్రితం ఘటన

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ దొంగలు బెజవాడలో బీభత్సం సృష్టించారు. ఎలక్ట్రానిక్ పరికరాల గోడౌన్‌లోకి చొరబడి ఐఫోన్లు, ట్యాబ్‌లు, యూఎస్‌బీ పరికరాలను దొంగిలించారు. అమెరికాకు చెందిన ఇన్‌గ్రాం మైక్రో ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ దేశంలో సెల్‌ఫోన్ల షోరూంలకు సెల్‌ఫోన్లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలు సరఫరా చేస్తోంది. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఉన్న గోడౌన్ నుంచి విజయవాడ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఉన్న షోరూంలకు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పంపుతుంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారులో వచ్చిన ఆరుగురు ఆగంతకులు కట్టర్‌తో గోడౌన్ షట్టర్‌ను కత్తిరించి గోడౌన్ లోపలకు ప్రవేశించారు. సీసీ కెమెరాల్లో ముఖాలు కనిపించకుండా, వాటిని ఆకాశంవైపుకు తిప్పేశారు. ఆ తర్వాత అట్టపెట్టెల్లో ఉన్న యాపిల్ కంపెనీకి చెందిన 271 యాపిల్ ప్రో, మ్యాక్స్ ఫోన్లు, రెండు ఐప్యాడ్స్, 75 ఇయర్ పాడ్స్, ఒక మౌస్, ఒక అడాప్టర్, యూఎస్‌బీ కేబుల్, 12 యాక్సెసరీస్, పది లెనోవో ట్యాబ్‌లను దొంగిలించారు. దీనిపై గోడౌన్ ఇన్‌చార్జి ఫరూక్ పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా, క్రైమ్ డీసీపీ టి.తిరుమలేశ్వరరెడ్డి, డీసీపీ గౌతమీ షాలి, ఏడీసీపీ ఎం.రాజారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీలను బట్టి ఆ దొంగలు యూపీ లేదా బిహార్‌కు చెందిన వారై ఉంటారని అంచనాకు వచ్చారు. చోరీ సొత్తు విలువ రూ.2.51 కోట్లు ఉంటుందని పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిశోర్ తెలిపారు.

హుస్సేన్‌సాగర్ చుట్టూ

స్కైవాక్.. సైకిల్ ట్రాక్

- పదిన్నర కిలోమీటర్ల మేర నిర్మాణం
- ఎలివేటెడ్ కారిడార్‌లో సాగర్‌కు సొబగులు
- వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ప్రత్యేక జోన్లు
- ట్రాక్ వెంట ఓపెన్ థియేటర్లు, ఫుడ్ కోర్టులు
- సుమారు రూ.500 కోట్ల మేర వ్యయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ చుట్టూరా స్కైవాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. పర్యాటకులకు, సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు హెచ్ఎండీఏలోని హైదరాబాద్ అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ ప్రణాళికలు రూపకల్పన చేసింది. హుస్సేన్‌సాగర్ చుట్టూరా 10.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ స్కైవాక్, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది జరిగితే అతిపెద్ద సైకిల్ ట్రాక్, స్కైవాక్ నిర్మాణం చేసిన నగరంగా హైదరాబాద్ నిలువనుంది. హుస్సేన్‌సాగర్ చుట్టూరా ఎన్టీఆర్ గార్డెన్, అంబేడ్కర్ విగ్రహం, నెక్లెస్ రోడ్డు, జలవిహార్, సంజీవయ్య పార్కు, సెయిలింగ్ క్లబ్, ఇందిరాపార్కు, రామకృష్ణ మఠం, లుంబినీ పార్కు, సచివాలయం తదితర ప్రాంతాలను కనెక్ట్ చేసేవిధంగా స్కైవాక్, సైకిల్ ట్రాక్‌కు అవసరమైన ప్రతిపాదనలు చేశారు. ఎంఎంటీఎస్ ప్రయాణికులు నెక్లెస్‌రోడ్ రైల్వేస్టేషన్, ఖైరతాబాద్ రైల్వేస్టేషన్, మెట్రోస్టేషన్లతో పాటు సంజీవయ్యపార్కు వద్ద గల జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ల నుంచి ఎలివేటెడ్ ర్యాంప్‌లున్నాయి. ఆయా ప్రాంతాల్లో సైకిల్ ట్రాక్, స్కైవాక్‌లకు యాక్సెస్ పాయింట్లను ఇవ్వనున్నారు. 5.5మీటర్ల మేర వెడల్పుతో వచ్చే ఈ ఎలివేటెడ్ కారిడార్‌లో 3.3మీటర్ల మేర సైకిల్ ట్రాక్ కోసం వినియోగించనుండగా, 2.2మీటర్లు స్కైవాక్ కోసం వినియోగించనున్నారు.

ట్రాక్ వెంట ఓపెన్ థియేటర్లు, ఫుడ్ కోర్టులు

హుస్సేన్‌సాగర్‌పై 10.5 కిలోమీటర్ల మార్గంలో వివిధ ప్రాంతాల్లో పాదచారులకు, సైక్లిస్టుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ఆయా మార్గాల్లో సైకిల్ స్టాండ్‌లను ఏర్పాటు చేసి అద్దె ప్రతిపాదికన సైకిళ్లను ఇవ్వనున్నారు. ఆయా మార్గాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ప్రత్యేకంగా జోన్లుంటాయి. ఎలివేటెడ్ స్కైవాక్, సైకిల్ ట్రాక్ వెంట పలు ప్రాంతాల్లో ఫుడ్ కోర్టులు, ఓపెన్ థియేటర్లు, మినీ థియేటర్లతో పాటు ఆట విడుపు కోసం ప్రత్యేకంగా వివిధ రకాల స్పోర్ట్స్ ఎరీనాలకు అవకాశం కల్పించనున్నారు. సుమారు రూ.500కోట్ల మేరకు వ్యయం అవుతుందని, కేవలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.200కోట్ల నుంచి రూ.250కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనాలు వేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ప్రభుత్వం అనుమతిస్తే పూర్తిస్థాయిలో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును కన్సల్టెన్సీ ద్వారా సిద్ధం చేసే అవకాశాలున్నాయి. అయితే మోటారు రహిత పర్యావరణ హితమైన ప్రాజెక్టుగా ఎలివేటెడ్ సైకిల్ ట్రాక్, స్కైవాక్ కారిడార్ నిలుస్తుందని అధికారులు అంటున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే

కేంద్రాన్ని రంగంలోకి దించుతాం!

- మా విచక్షణాధికారాల్ని వినియోగించక తప్పదు
- గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి హైకోర్టు హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని రంగంలోకి దించక తప్పదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కోర్టు గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి, తమ ఆదేశాల అమలుకు కేంద్రానికి ఆదేశాలు జారీచేయాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాటికి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి పరిధిలోని సర్వే నంబర్లు 51, 52, 53లో అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే తీవ్రచర్యలు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీని హెచ్చరించింది. మార్చి 7 నాటికి అక్రమ నిర్మాణాలను తొలగించి, స్థాయీ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించకతప్పదని పేర్కొంది. గచ్చిబౌలిలోని సర్వే నంబర్లు 51, 52, 53లోని భూముల్లో నిర్మాణాలపై స్టేటస్‌కో ఆదేశాలు ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణాలకు అనుమతిస్తున్నారని హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వర్చువల్‌గా హాజరై భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాల తొలగింపులో తమ ప్రమేయం ఉండదని తెలిపారు. దీంతో ఆయనకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని జీహెచ్ఎంసీ అధికారులు కౌంటర్‌లో పేర్కొన్నారని.. పిటిషనర్ మాత్రం అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని అంటున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'తాజాగా స్థాయీ నివేదిక ఇవ్వాలని పలుమార్లు ఆదేశాలిచ్చినా అధికారులు అమలు చేయడం లేదు. అందుకే ప్రత్యక్ష హాజరుకు ఆదేశాలు ఇవ్వాల్సి వచ్చింది. జీహెచ్ఎంసీ అధికారులు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని పిటిషనర్ పేర్కొంటున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. వచ్చే విచారణ తేదీ నాటికి పూర్తిగా అక్రమ నిర్మాణాలను తొలగించి.. స్థాయీ నివేదిక సమర్పించాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ మార్చి 7కు వాయిదా వేసింది.



రోడ్ల మరమ్మతులకు మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి 10 వరకు మొదటి దఫాలో అత్యవసర మరమ్మతులు చేయాల్సిన రోడ్లను ఖరారు చేయాలని, 11న టెండర్లను ఆహ్వానించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. 17 నాటికి టెండర్లను తెరచి.. నిబంధనల ప్రకారం ఉన్న వారికి పనులను అప్పగించాలని భావిస్తున్నారు. టెండర్ దక్కించుకుని, ఒప్పందం చేసుకున్న నాటి నుంచి రెండు నెలల్లో పనులను పూర్తిచేసేలా కాంట్రాక్టర్లకు సూచించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లో పనుల నిర్వహణ, టెండర్లు పిలిచేందుకు ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియపై అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది.

రిపేర్ల జాబితాలో అధిక కి.మీ ఉన్న కొన్ని నియోజకవర్గాలు..

నియోజకవర్గం	అత్యవసరం (కి.మీ)	సాధారణం	మొత్తం	నిధులు (రెండు పనులకు కలిపి రూ.కోట్లలో)
పాలేరు	171.28	5.99	194.82	13.60
బోథ్	97.90	37.80	160.90	82.80
అశ్వారావుపేట	119.12	20.96	140.09	10.50
వికారాబాద్	138.02	--	138.02	30.20
నాగార్జునసాగర్	--	113.23	113.23	59.49

ఎట్టకేలకు చిక్కిన అడవి దున్న

- మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో మృత్యువాత
- యాదాద్రి జిల్లా పల్లెల్లో వారం పాటు సంచారం

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన అడవి దున్న భువనగిరి మండలం రెడ్డినాయక్ తండా పరిధిలో పట్టుబడింది. అయితే, అటవీ శాఖ అధికారులు బంధించే క్రమంలో మత్తు సూది ఇవ్వడంతో ప్రాణాలు కోల్పోయింది. జనవరి 30న యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలోని ఓ తోటలో అడవి దున్న పోతు కనిపించింది. పోలీసులు, అటవీ అధికారులు వెళ్లి చూడగా అది లేదు. మూడు రోజుల అనంతరం వలిగొండ మండలంలో కనిపించిన ఆ అడవి దున్న.. అధికారులు పట్టుకునే క్రమంలో తప్పించుకుంది. గురువారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు, చిన్నకొండూరు శివారులో తారసపడింది. అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా చిక్కలేదు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని జూపార్కుకు చెందిన పశువైద్యాధికారి డాక్టర్ తాజొద్దీన్ బృందం గాలింపు చర్యలు చేపడుతుండగా.. తాజొద్దీన్‌ను ఆ దున్న తీవ్రంగా గాయపరిచింది. శుక్రవారం ఉదయం బీబీనగర్ మండలం జంపల్లి శివారులో అడవి దున్న రోడ్డు వెంట సంచరిస్తుండటంతో వాహనదారులు అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అటవీ శాఖ అధికారుల బృందం దున్నపోతు కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టింది. భువనగిరి మండలం రెడ్డినాయక్ తండా గుట్టపై దున్నను గుర్తించిన అటవీ సిబ్బంది.. దానిని బంధించేందుకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. అయితే సూది ఇచ్చిన కొద్దిసేపటికే అది చనిపోయింది. 9 రోజుల పాటు సుమారు 60కి.మీ. మేర ప్రయాణం చేయడం, సరైన ఆహారం లేకపోవడం వల్లే దున్న మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు.



అడవి దున్న కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.